**జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు కావలెను**

మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని ఉమ్మడి జిల్లాల వారీగా గతంలో ప్రింట్ లేదా ఎలక్ట్రానిక్ మీడియాలో జిల్లా స్థాయిలో పని చేసిన అనుభవం ఉన్న రిపోర్టర్లు కావలెను.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

PRGI REG. No. : TGTEL/25/A0540

email: jobs@manasarkar.com

సంక్షేమ

# మనసర్కార్

Follow: manasarkar

సంపుటి: 01 ::: సంచిక:233 | హైదరాబాద్ 26 మార్చి 2026, గురువారం | పేజీలు: 8, వెల: రూ. 5/-

Vol-01 ::: Issue-233 | Hyderabad 26 March 2026, Thursday | Pages: 8, Rs. 5/-

**అసెంబ్లీల వారీగా రిపోర్టర్లు కావలెను**

మనసర్కార్ దినపత్రిక, డిజిటల్ ఛానల్, న్యూస్ పోర్టల్ కు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లోని అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా వార్తలను సేకరించుటకు రిపోర్టర్లు కావలెను. తెలుగు భాషపై పట్టు వార్తలను వ్రాయగలిగే సామర్థ్యం, సంఘటనలను వీడియో తీసి పంపగల అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును.

మీ బయోడేటాను ఈ క్రింది మెయిల్ కు పంపగలరు

మనసర్కార్ Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073

PRGI REG. No. : TGTEL/25/A0540

email: jobs@manasarkar.com

## నా సోదరుడికే ఫోన్ చేసి బెదిరిస్తారా?



**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

‘కోర్టు ఉత్తర్వులను ప్రశ్నిస్తూ నేరుగా నా సోదరుడికే ఫోన్ చేసి బెదిరిస్తారా? అలాంటివారిని ఎట్టిపరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోం. వారు విదేశాల్లో దాక్కున్నా సరే బుద్ధి చెబుతాం,’’ అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ తీవ్రంగా హెచ్చరించారు. మెడికల్ అడ్మిషన్ల కేసు విచారణ సందర్భంగా, బుధవారం ఈ కీలక పరిణామం చోటుచేసుకుంది. న్యాయవ్యవస్థను ప్రభావితం చేసేలా తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి బెదిరింపులకు దిగడంపై సీజేఐ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. హర్యానాకు చెందిన అన్నాచెల్లెళ్లు నిఖిల్ కుమార్ పూనియా, ఏక్తా పూనియా గతంలో జనరల్ కేటగిరీలో పరీక్షలు రాశారు. అయితే, మెడికల్ అడ్మిషన్ల కోసం తాము బౌద్ధమతం స్వీకరించామని, మైనారిటీ కోటాలో సీట్లు కేటాయించాలని సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే పరీక్షకు కొద్ది రోజుల ముందు మతం మారడంపై జస్టిస్ జోయమాల్య బాగ్చితో కూడిన ధర్మాసనం సందేహాలు వ్యక్తం చేసింది. సంపన్న వర్గాలకు చెందిన వారు ఇలా మైనారిటీల హక్కులను లాక్కోవాలని చూడటం 'కొత్త రకమైన మోసం' అని కోర్టు మండిపడింది.

...::: తరువాయి 2వ పేజీలో...



## లోక్‌సభలో ఆర్థిక బిల్లు ఆమోదం

**న్యూఢిల్లీ (ఏడీఎన్ఎన్):**

లోక్‌సభలో 2026 ఆర్థిక బిల్లు ఆమోదం పొందింది. పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఈ బిల్లుకు సభ బుధవారం ఆమోదముద్ర వేసింది. దేశ ఆర్థిక విధానాలు , పన్నుల రూపకల్పనలో అత్యంత కీలకమైన ఈ బిల్లు ఆమోదం పొందడం బడ్జెట్ ప్రక్రియలో ఒక ప్రధాన ఘట్టంగా భావిస్తున్నారు. ప్రభుత్వ ప్రతిపాదనలకు సభ ఆమోదం తెలపడంతో ఆర్థిక వ్యవస్థలో కీలక మార్పులకు మార్గం సుగమమైంది. ప్రభుత్వం ఈ ఆర్థిక బిల్లులో మొత్తం 32 సవరణలను ప్రతిపాదించింది. సుదీర్ఘ చర్చ తర్వాత సభ్యుల మద్దతుతో ఈ సవరణలన్నింటికీ లోక్‌సభ ఆమోదం లభించింది. ఈ బిల్లు ఆమోదంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రక్రియలో దిగువ సభకు సంబంధించిన కీలక భాగం విజయవంతంగా పూర్తయింది.

...::: తరువాయి 2వ పేజీలో...



## కేరళ ఎన్నికలపై యుద్ధ నీడలు...

**తిరువనంతపురంళ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితులు ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు సృష్టిస్తున్నాయి. ప్రధానంగా కేవలం చమురు ధరల పెరుగుదలపైనే కాకుండా ఈ యుద్ధ ప్రభావం వచ్చే నెలలో జరగనున్న కేరళ అసెంబ్లీ ఎన్నికల పైనా పడేలా కనిపిస్తోంది. యుద్ధ వాతావరణం కారణంగా గల్ఫ్ దేశాల నుంచి కేరళకు వచ్చే విమాన సర్వీసులు దెబ్బతినడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. కేరళ నుంచి 22 లక్షల మంది ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలలో ఉంటున్నారు. ప్రతి ఎన్నికల సమయంలోనూ వీరు వేల సంఖ్యలో స్వరాష్ట్రానికి వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం ఆనవాయితీ. అయితే, ప్రస్తుత యుద్ధ పరిస్థితుల వల్ల విమానాశ్రయాల మూసివేత, సర్వీసుల రద్దు వంటి కారణాలతో ప్రవాసీ ఓటర్లు కేరళకు చేరుకోవడం కష్టతరంగా మారింది. ఇది పోలింగ్ శాతంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా ఉత్తర కేరళలోని మలప్పురం, కొజికోడ్, కాసరగడ్, పాలక్కాడ్, త్రిశూర్ జిల్లాల్లో ప్రవాసీ ఓటర్ల సంఖ్య అధికం.

...::: తరువాయి 2వ పేజీలో...



## పదిహేను ప్రతిపాదనలు...

# ఐదు షరతులు

**తక్షణమే అమెరికా స్థావరాల మూసివేతకు డిమాండ్ | హర్మ్యూజ్ మాదే: ఇరాన్**

దశాబ్దాలుగా రగులుతున్న మధ్యప్రాచ్య సెగలను చల్లార్చేందుకు అమెరికా-ఇరాన్ మధ్య జరుగుతున్న పరోక్ష చర్చలు ఇప్పుడు క్లైమాక్స్ దశకు చేరుకున్నాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి కోసం 15 ప్రతిపాదనలతో కూడిన పత్రాన్ని ఇరాన్ ముందు ఉంచగా, దానికి ధీటుగా ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తాబా ఖమేనీ 5 కఠినమైన షరతులను తెరపైకి తెచ్చారు.

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## ఇరాన్ సరిహద్దుల్లో అమెరికా పారాట్రూపర్లు

మధ్యప్రాచ్యంలో యుద్ధ సెగలు పతాక స్థాయికి చేరాయి. ఒకవైపు శాంతి చర్చల మాట వినిపిస్తున్నా, క్షేత్రస్థాయిలో అమెరికా తన అత్యంత వేగవంతమైన '82వ ఎయిర్‌బోర్న్ డివిజన్'ను రంగంలోకి దించడం సంచలనం రేపుతోంది. కేవలం 18 గంటల వ్యవధిలో యుద్ధ భూమిలోకి దూకగల 3,000 మంది పారాట్రూపర్లు ఇప్పటికే మొహరించారు. కిందటి నెల 28న యుద్ధం మొదలైనప్పటి నుంచి 9,000 లక్ష్యాలపై వైమానిక దాడులు చేసిన అమెరికా, ఇప్పుడు భూతల దళాలను దించడం ద్వారా హర్మ్యూజ్ జలసంధిపై పట్టు సాధించాలని భావిస్తోంది. ఇరాన్ మాత్రం ట్రంప్ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ క్షిపణి దాడులను ఉధృతం చేయడంతో, గల్ఫ్ ప్రాంతంలో ఏ క్షణమైనా పెను విధ్వంసం చోటు చేసుకునేలా కనిపిస్తోంది.




...::: పూర్తి కథనం 2వ పేజీలో...

## ఇప్పసారాకు ఇందిరమ్మ పేరా?



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**


రాష్ట్ర అసెంబ్లీ వేదికగా ఇప్ప సారా అంశంపై అధికార , ప్రతిపక్ష సభ్యుల మధ్య తీవ్రస్థాయిలో వాగ్వాదం బుధవారం చోటుచేసుకుంది. జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఇప్పపువ్వు సారా ప్రాముఖ్యతను సభకు వివరించారు. ప్రపంచవ్యాప్తంగా దాదాపు 130 దేశాల్లో దీని ద్వారా భారీగా ఆదాయం లభిస్తోందని పేర్కొన్నారు. అయితే, ఈ చర్చ సందర్భంలో బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి మాట్లాడుతూ, ఒకవేళ ప్రభుత్వం ఇప్ప సారాను తయారు చేస్తే దానికి 'ఇందిరమ్మ' పేరు మాత్రం పెట్టవద్దని ఎద్దేవా చేశారు. ఈ వ్యాఖ్యలు సభలో తీవ్ర దుమారాన్ని రేపాయి. ఒక మహోన్నత నాయకురాలి పేరును సారా అంశంతో ముడిపెడతారా అంటూ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇందిరమ్మ పేరును ఇలాంటి సందర్భాల్లో వాడటంపై తమాషాగా ఉందా అని మండి పడ్డారు.

...::: తరువాయి 2వ పేజీలో...

## భారత్‌కు అండగా రష్యా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల కారణంగా ప్రపంచవ్యాప్తంగా చమురు సరఫరా వ్యవస్థ తీవ్రంగా దెబ్బతింది. ముఖ్యంగా హర్మ్యూజ్ జలసంధి ద్వారా మధ్యప్రాచ్యం నుంచి అందాల్సిన ముడి చమురు నిలిచిపోవడంతో, దేశీయంగా పెట్రోల్, డీజిల్ కొరత రాకుండా చూడటానికి కేంద్ర ప్రభుత్వం రష్యా వైపు మొగ్గు చూపింది. ఏప్రిల్ నెల అవసరాల కోసం రిలయన్స్, ఐఓసీ, బీపీసీఎల్ , హెచ్‌పీసీఎల్ వంటి ప్రముఖ భారతీయ రిఫైనరీ సంస్థలు రష్యా నుంచి 6 కోట్ల బ్యారెళ్ల ముడి చమురును సేకరించాయి. ప్రస్తుతం అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 100 నుంచి 110 డాలర్ల మధ్య కొనసాగుతోంది. యుద్ధం కారణంగా రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు భారీగా పెరిగినప్పటికీ, రష్యా నుంచి 5 -15 డాలర్ల ప్రీమియంతో భారత్ ఈ చమురును కొనుగోలు చేస్తోంది. దేశీయ రిఫైనరీలను నిరంతరాయంగా నడపడానికి, ధరల స్థిరీకరణకు ఈ దిగుమతులు అత్యంత కీలకంగా మారాయి. మార్చి నెలలోనే రష్యా నుంచి రోజుకు సగటున 20 లక్షల బ్యారెళ్లకు పైగా దిగుమతి చేసుకోవడం ద్వారా, భారతదేశానికి అతిపెద్ద చమురు సరఫరాదారుగా రష్యా తన స్థానాన్ని మరింత సుస్థిరం చేసుకుంది.



...::: తరువాయి 2వ పేజీలో...

## పాదయాత్ర మొదలు కాగానే సినిమా చూపిస్తా!



**తాడెపల్లి (ఏడీఎన్ఎన్):**

తన పాదయాత్ర మొదలు కాగానే ప్రతిరోజూ చంద్రబాబుకు సినిమా చూపిస్తానని, రెడ్ బుక్‌కు, అన్యాయ పాలనకు టైమ్ దగ్గరపడిందని వైసీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హెచ్చరించారు. తాడేపల్లిలో బుధవారం నిర్వహించిన అద్దంకి నియోజకవర్గ నేతల సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. రాబోయే రోజుల్లో కష్టపడే కార్యకర్తలకు పార్టీలో పెద్దపీట వేస్తామని, 'జగన్ 2.0' వెర్షన్‌లో క్షేత్రస్థాయి నాయకత్వానికి అత్యంత ప్రాధాన్యం ఉంటుందని స్పష్టం చేశారు. నియోజకవర్గాల పునర్విభజన జరగబోతుండటం పార్టీ క్యాడర్‌కు ఒక శుభవార్త అని, దీనివల్ల పార్టీ కోసం కష్టపడే అనేకమంది కార్యకర్తలు భవిష్యత్తులో నాయకులుగా ఎదిగే అవకాశం ఉంటుందని ఆయన చెప్పారు. అలాగే మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్లు రాబోతుండటాన్ని స్వాగతిస్తూ, గతంలో తమ ప్రభుత్వం మహిళా సాధికారతకు తీసుకున్న నిర్ణయాలను గుర్తుచేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతూ, చంద్రబాబు నాయుడు ఇతరుల కష్టాన్ని తన ఖాతాలో వేసుకునే 'క్రెడిట్ దోపిడీ'కి పాల్పడుతున్నారని ఆరోపించారు.

...::: తరువాయి 2వ పేజీలో...



## అమెరికా 'ఎఫ్-18' ఫైటర్ జెట్‌ను కూల్చేసిన ఇరాన్?

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికాకు చెందిన అత్యాధునిక ఎఫ్ 18 ఫైటర్ జెట్‌ను తమ దళాలు విజయవంతంగా కూల్చివేసినట్లు ఇరాన్ ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐ.ఆర్.జీ.సీ) బుధవారం ప్రకటించింది. ఈ ఘటనకు సంబంధించిన ఒక వీడియోను కూడా ఇరాన్ మీడియా సోషల్ మీడియాలో విడుదల చేసింది. ఈ దాడి ఎక్కడ జరిగింది? విమానం ఎంతవరకు దెబ్బతింది? అందులోని పైలట్ పరిస్థితి ఏమిటి? అనే వివరాలను మాత్రం ఐ.ఆర్.జీ.సీ వెల్లడించలేదు.

...::: తరువాయి 2వ పేజీలో...




## పాక్ ఒక ‘బ్రోకర్’ దేశం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పాకిస్తాన్ మాదిరి భారత్ బ్రోకర్ దేశం కాదని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వ్యాఖ్యానించారు. అంతర్జాతీయ దౌత్యంలో పాకిస్తాన్ ఒక ‘బ్రోకర్’లా వ్యవహరిస్తోందని, భారత్ ఎప్పుడూ స్వతంత్ర నిర్ణయాలే తీసుకుంటుందని ఆయన తేల్చి చెప్పారు. పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాల నేపథ్యంలో ఇరాన్, అమెరికా దేశాలకు మధ్యవర్తిత్వం వహించేందుకు పాకిస్తాన్ చేస్తున్న ప్రయత్నాలను ఆయన తప్పు పట్టారు. ఢిల్లీలో బుధవారం నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పేందుకు వాషింగ్టన్, టెహ్రాన్ మధ్య చర్చలు జరుపుతామని పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ చేసిన ప్రతిపాదనలను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సోషల్ మీడియాలో పంచుకోవడంతో ఈ వివాదం మొదలైంది. అయితే, దశాబ్దాలుగా పాకిస్తాన్ కేవలం ఒక మధ్యవర్తిగా మాత్రమే తన ఉనికిని కాపాడుకోవాలని చూస్తోందని భారత్ విమర్శించింది. వ్యూహాత్మక ప్రయోజనాల కోసమే పాక్ పాకులాడుతోందని జైశంకర్ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా సంక్షోభంపై భారత ప్రభుత్వం తన విధానాన్ని సమర్థించుకుంది. ఇరాన్‌పై దాడుల విషయంలో ప్రభుత్వం అనుసరిస్తున్న మౌనంపై వస్తున్న విమర్శలను కేంద్రం తోసిపుచ్చింది.


...::: తరువాయి 2వ పేజీలో...




### శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ దాడులు చేస్తాం...

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

### విజయవాడ ఉగ్రకుట్ర కేసులో మరో ఇద్దరు అరెస్ట్



...::: పూర్తి కథనం 2వ పేజీలో...



### ఆ ఏడుగురు ఎమ్మెల్యేలు కౌంటర్ దాఖలు చేయాల్సిందే

...::: పూర్తి కథనం 2వ పేజీలో...

### కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా



...::: పూర్తి కథనం 2వ పేజీలో...

# ఇరాన్ సరిహద్దుల్లో అమెరికా పారాట్రూపర్లు




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికాఇరాన్ మధ్య సాగుతున్న యుద్ధం 25వ రోజుకు చేరుకున్నవేళ, ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరాయి. ఇప్పటివరకు కేవలం వైమానిక దాడులకే పరిమితమైన అమెరికా, ఇప్పుడు తన అత్యంత శక్తివంతమైన '82వ ఎయిర్‌బోర్న్ డివిజన్'ను మధ్యప్రాచ్యానికి తరలిస్తుండటం ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఒకవైపు శాంతి చర్చల గురించి ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ మాట్లాడుతున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో భూతల దళాల సమీకరణలు మాత్రం మరో భారీ యుద్ధానికి సంకేతాలిస్తున్నాయి. అమెరికా సైన్యంలో 'ఆల్ అమెరికన్' అనే విశిష్ట గుర్తింపు కలిగిన ఈ 82వ ఎయిర్‌బోర్న్ డివిజన్‌కు ఒక ప్రత్యేకత ఉంది. వీరు ప్రపంచంలో ఎక్కడైనా సరే, ఆదేశాలు అందిన కేవలం 18 గంటల వ్యవధిలో మోహరించగల అసాధారణ వేగాన్ని కలిగి ఉంటారు. పారాచూట్ల ద్వారా నేరుగా యుద్ధ భూమిలోకి దూకడంలో వీరు దిట్టలు. నార్త్ కరోలినాలోని ఫోర్ట్ బ్రాగ్ కేంద్రంగా పనిచేసే ఈ విభాగం, నిరంతరం కఠిన శిక్షణలో ఉంటుంది. రెండో ప్రపంచ యుద్ధం వంటి చారిత్రాత్మక ఘట్టాల్లో సాహసోపేత విజయాలు సాధించిన ఈ దళాలను ఇప్పుడు రంగంలోకి దించడం ప్రాధాన్యం సంతరించుకుంది. పెంటగాన్ నివేదికల ప్రకారం, ఇప్పటికే మధ్యప్రాచ్యంలో ఉన్న వేలాది మంది మెరైన్ దళాలకు తోడుగా, అదనంగా 3,000 మంది పారాట్రూపర్లు చేరుకుంటున్నారు. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి అమెరికా దాదాపు 9,000 లక్ష్యాలపై వైమానిక దాడులు నిర్వహించింది. అయితే ఇప్పుడు భూతల దళాలను రంగంలోకి దించడం ద్వారా వ్యూహాత్మక చమురు మార్గాలను, కీలక మౌలిక సదుపాయాలను రక్షించాలని వాషింగ్టన్ భావిస్తోంది. ఈ పరిణామం యుద్ధ గమనాన్ని పూర్తిగా మార్చే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం హర్మూజ్ జలసంధి వద్ద నెలకొన్న అనిశ్చితి వల్ల అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు ఆకాశాన్ని తాకుతున్నాయి. ఇరాన్ జరుపుతున్న డ్రోన్, క్షిపణి దాడులను అడ్డుకునేందుకు అమెరికా తన రక్షణ కవచాన్ని మరింత బలపరుస్తోంది. ట్రంప్ చర్చల గురించి ప్రస్తావిస్తున్నా, ఇరాన్ మాత్రం అవన్నీ 'ఫేక్ న్యూస్' అని కొట్టిపారేయడమే కాకుండా, అమెరికా ప్రతిపాదించిన శాంతి ప్రణాళికను కూడా తిరస్కరించింది. ఇరాన్ గడ్డపైకి నేరుగా సైన్యాన్ని పంపే నిర్ణయం ఇంకా తీసుకోలేదని అధికారులు చెబుతున్నా, సరిహద్దుల్లో పెరుగుతున్న సైనిక సంఖ్య ఏ క్షణమైనా పెద్ద యుద్ధానికి దారితీయవచ్చనే ఆందోళన కలిగిస్తోంది. రాబోయే కొద్ది రోజులు మధ్యప్రాచ్య భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

## పదిహేను ప్రతిపాదనలు... ఐదు షరతులు

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అమెరికా, ఇరాన్ మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న ఉద్రిక్తతలకు ముగింపు పలికే దిశగా సాగుతున్న పరోక్ష చర్చలు ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన మలుపు తిరిగాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శాంతి ఒప్పందం కోసం 15 ప్రతిపాదనలను ముందుకు తీసుకురాగా, వాటికి కౌంటర్‌గా ఇరాన్ నూతన సుప్రీం లీడర్ మోజ్తాబా ఖమేనీ ఐదు కఠినమైన షరతులను విధించారు. ఈ చర్చల్లో ప్రధానంగా హర్మూజ్ జలసంధిపై పూర్తి నియంత్రణ సాధించడంతో పాటు, ఆ ప్రాంతం గుండా వెళ్లే నౌకల నుంచి ట్రాన్సిట్ రుసుము వసూలు చేసే అధికారం తమకు ఉండాలని ఇరాన్ డిమాండ్ చేస్తోంది. దీనితో పాటు గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలన్నింటినీ మూసివేయాలని, ప్రస్తుత యుద్ధం వల్ల కలిగిన ఆర్థిక నష్టానికి అమెరికా పరిహారం చెల్లించాలని ఇరాన్ పట్టుబడుతోంది. మరోవైపు అమెరికా కూడా ఇరాన్ ముందు తనదైన శైలిలో కఠిన నిబంధనలను ఉంచింది. ఇరాన్ తన బాలిస్టిక్ మిస్సైల్ పథకాన్ని ఐదేళ్ల పాటు నిలిపివేయాలని, శుద్ధి చేసిన యురేనియంను అప్పగించాలని అమెరికా కోరుతోంది. అలాగే హమాస్, హెజ్బొల్లా వంటి గ్రూపులకు ఇరాన్ అందిస్తున్న సహకారాన్ని పూర్తిగా నిలిపివేయాలని డిమాండ్ చేస్తోంది. అయితే, హర్మూజ్ జలసంధి నియంత్రణ మినహా మిగిలిన అంశాలపై చర్చించేందుకు అమెరికా సుముఖంగా ఉన్నట్లు సమాచారం అందుతోంది. హెజ్బొల్లాపై ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక చర్యలను నిలిపివేయడం వంటి అంశాలు కూడా ఈ చర్చల్లో కీలకంగా మారాయి. రెండు పక్షాలు తమ పట్టు వీడకపోవడంతో ఈ దౌత్యపరమైన చర్చలు మరింత సంక్లిష్టంగా మారే అవకాశం కనిపిస్తోంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెన్నెసీలో మీడియాతో మాట్లాడుతూ, ఇరాన్‌తో ఒప్పందం కుదురుతుందని తాను ఆశాభావంతో ఉన్నానని తెలిపారు. ప్రస్తుత చర్చల్లో ఇరాన్ చాలా సీరియస్‌గా ఉందని పేర్కొంటూనే, ఇరాన్ ఎప్పటికీ అణ్వాయుధాన్ని పొందకుండా తాము గట్టి చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అమెరికా దాని మిత్రదేశాలకు ఉన్న బెదిరింపులను అంతం చేసేందుకు ఇరాన్‌కు ఇదొక గొప్ప అవకాశమని, దీనిని వారు సద్వినియోగం చేసుకుంటారని ఆశిస్తున్నట్లు ట్రంప్ వ్యాఖ్యానించారు. ఈ ఒప్పందం కనుక కుదిరితే ప్రపంచం మరింత సురక్షితంగా, స్థిరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి కోసం ఇరాన్ పట్టుబట్టడం ఈ ప్రతిష్టంభనకు ప్రధాన కారణం కాగా, ఈ సంక్షోభం ఎలా ముగుస్తుందనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఉత్కంఠ రేపుతోంది.

### ఇరాన్ విధించిన 5 షరతులు:

**దురాక్రమణ, హత్యల నిలుపుదల:** అమెరికా, ఇజ్రాయెల్ జరుపుతున్న దాడులు, హత్యలు తక్షణమే ఆగిపోవాలి.
**భవిష్యత్తు రక్షణ హామీ:** ఇరాన్‌పై మళ్లీ ఎప్పుడూ సైనిక దాడులు జరగవని పటిష్టమైన అంతర్జాతీయ హామీ ఉండాలి.
**యుద్ధ నష్టపరిహారం:** యుద్ధం వల్ల జరిగిన ఆస్తిపాస్తుల, ప్రాణ నష్టానికి అమెరికా, ఇజ్రాయెల్ పరిహారం చెల్లించాలి.
**ప్రాంతీయ శాంతి:** కేవలం ఇరాన్‌పైనే కాకుండా ఈ ప్రాంతంలోని హమాస్, హూతీలు, హిజ్బుల్లా లపై దాడులు నిలిపివేయాలి.
**హర్మూజ్ సార్వభౌమాధికారం:** హర్మూజ్ జలసంధిపై ఇరాన్ చట్టపరమైన సార్వభౌమాధికారాన్ని అధికారికంగా గుర్తించాలి.

## నా సోదరుడికే ఫోన్ చేసి బెదిరిస్తారా?

**మొదటిపేజీ తరువాయి....**
ఈ నేపథ్యంలో పిటిషనర్ల తండ్రి నేరుగా సీజేఐ సోదరుడికి ఫోన్ చేసి కండిషన్లు పెట్టడంపై జస్టిస్ సూర్యకాంత్ విస్మయం వ్యక్తం చేశారు. 'నా 23 ఏళ్ల సర్వీసులో ఇలాంటి వారిని ఎంతో మందిని చూశాను. కోర్టు ధిక్కరణ చర్యలు ఎందుకు తీసుకోకూడదు?' అని హర్యానా ప్రభుత్వ తరపు లాయర్‌ను ప్రశ్నించారు. గతంలో జనరల్ కేటగిరీగా ఉన్న వారికి మైనారిటీ సర్టిఫికెట్లు ఎలా జారీ చేశారో వివరించాలని హర్యానా యంత్రాంగాన్ని కోర్టు నిలదీసింది. దీనిపై పూర్తి స్థాయి మార్గదర్శకాలను సమర్పించాలని హర్యానా ప్రధాన కార్యదర్శిని ఆదేశించింది.
**పిటిషన్ కొట్టివేత**
అర్హత లేని వారికి మైనారిటీ హోదా కల్పించడం సరైంది కాదని పేర్కొంటూ, అన్నాచెల్లెళ్లు దాఖలు చేసిన పిటిషన్‌ను ధర్మాసనం కొట్టేసింది. న్యాయప్రక్రియలో జోక్యం చేసుకునే ప్రయత్నాలను సహించేది లేదని స్పష్టం చేసింది.

# కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి టి. జీవన్ రెడ్డి ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు సంచలన ప్రకటన చేశారు. జగిత్యాలలో తన అనుచరులు, కార్యకర్తలతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన ఈ నిర్ణయాన్ని వెల్లడించారు. సుమారు 42 ఏళ్ల సుదీర్ఘ కాలం పాటు కాంగ్రెస్ పార్టీలో కొనసాగిన ఆయన, ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీలో ఉండలేనని పేర్కొంటూ తన రాజీనామా లేఖను ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు పంపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వైఖరిపై జీవన్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కాంగ్రెస్ కార్యకర్తల కష్టార్జితం వల్లే రేవంత్ రెడ్డికి ముఖ్యమంత్రి పదవి దక్కిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత పాత తరం నేతలను విస్మరిస్తున్నారని విమర్శించారు. గత రెండేళ్లుగా పార్టీలో తనకు అనేక అవమానాలు ఎదురయ్యాయని, దీనిపై అధిష్ఠానానికి ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతోనే ఈ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు అత్యంత సన్నిహితుడైన కాంగ్రెస్ కార్యకర్త గంగారెడ్డి హత్య ఉదంతం జీవన్ రెడ్డిని తీవ్రంగా కలిచివేసింది. ఒక సీనియర్ కార్యకర్త దారుణంగా హత్యకు గురైతే, ముఖ్యమంత్రి నుంచి కనీస పరామర్శ లేకపోవడం మరియు బాధిత కుటుంబానికి భరోసా కల్పించకపోవడంపై ఆయన మండిపడ్డారు. ఎంఎల్‌సిగా ఉన్నప్పటికీ తన అనుచరులకు రక్షణ కల్పించుకోలేని స్థితిలో ఉన్నానని, ప్రభుత్వం కానీ, పార్టీ యంత్రాంగం కానీ తనకు అండగా నిలవలేదని వాపోయారు. తనకు పదవుల కంటే ఆత్మగౌరవమే ముఖ్యమని, ఇకపై రేవంత్ రెడ్డిపైనే తన పోరాటం కొనసాగుతుందని జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి కొడంగల్‌లో కూడా జరగలేదని వ్యాఖ్యానిస్తూ, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఇచ్చిన హామీలు సైతం నెరవేరలేదని అసహనం వ్యక్తం చేశారు. దశాబ్దాల రాజకీయ ప్రస్థానంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని, ఇప్పుడు తన కార్యకర్తల అండతో ప్రజాక్షేత్రంలోనే తేల్చుకుంటానని ఆయన పునరుద్ఘాటించారు.

### జగన్‌పై వివక్షే కాంగ్రెస్‌కు శాపమైంది

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోవడానికి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పట్ల ఆనాడు అధిష్ఠానం వ్యవహరించిన తీరే ప్రధాన కారణమని తెలంగాణ కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణం తర్వాత జగన్ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం ప్రదర్శించిన వివక్షే నేడు ఆ పార్టీ కనుమరుగు కావడానికి దారితీసిందని ఆయన విశ్లేషించారు. రాష్ట్ర విభజన సమయంలో జగన్‌ను పిలిచి మాట్లాడి, ఆయనను కన్విన్స్ చేసి ఉంటే ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి వేరేలా ఉండేదని అభిప్రాయపడ్డారు. "ఆ సమయంలో అధిష్ఠానం జగన్‌ను పట్టించుకోలేదు, పైగా వివక్ష చూపింది. దాని ఫలితాన్ని నేడు కాంగ్రెస్ పార్టీ అనుభవిస్తోంది. వైఎస్ జగన్‌ను దూరం చేసుకోవడం వల్ల సీమాంధ్రలో పార్టీ తన ఉనికిని పూర్తిగా కోల్పోయింది" అని ఆయన పేర్కొన్నారు. నాడు జగన్‌కు జరిగిన అన్యాయం వల్లే కాంగ్రెస్ ఈ స్థాయికి పడిపోయిందని, ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ కనుచూపు మేరలో కూడా కనిపించడం లేదని జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ కుటుంబానికి ఉన్న ప్రజాదరణను గుర్తించడంలో అధిష్ఠానం విఫలమైందని, ఆనాడు తీసుకున్న నిర్ణయాల వల్లే పార్టీ తీవ్రంగా నష్టపోయిందని ఆయన స్పష్టం చేశారు.తెలంగాణలో కాంగ్రెస్ బలంగా ఉన్నప్పటికీ, ఏపీలో మాత్రం పార్టీ కోలుకోలేని స్థితికి చేరుకుందన్న జీవన్ రెడ్డి వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి.


## లోక్‌సభలో ఆర్థిక బిల్లు ఆమోదం

**మొదటిపేజీ తరువాయి....**
దేశాభివృద్ధిని కాంక్షిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ మార్పులపై ఆర్థిక నిపుణులు కూడా సానుకూలంగా స్పందిస్తున్నారు. లోక్‌సభ ఆమోదం పొందిన తర్వాత ఈ ఆర్థిక బిల్లు తదుపరి పరిశీలన కోసం ఎగువ సభ అయిన రాజ్యసభకు పంపనున్నారు. అక్కడ కూడా చర్చలు జరిగి రాజ్యసభ ఆమోదం లభించిన తర్వాత, బడ్జెట్ ప్రక్రియ అధికారికంగా ముగుస్తుంది. రాజ్యసభలో కూడా ప్రభుత్వం ఈ బిల్లును నెగ్గించుకోగలిగితే, ఏప్రిల్ 1 నుండి ప్రారంభమయ్యే కొత్త ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పన్నుల విధింపు , నిధుల కేటాయింపులపై పూర్తి స్పష్టత రానుంది. దేశ ఆర్థిక స్థిరత్వానికి, పారదర్శకమైన పన్నుల విధానానికి ఈ బిల్లు అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. బడ్జెట్ కేటాయింపులు క్షేత్రస్థాయిలోకి వెళ్లాలంటే ఈ ఆర్థిక బిల్లు ఆమోదం తప్పనిసరి. లోక్‌సభలో అడ్డంకులు తొలగిపోవడంతో ప్రభుత్వం ఇప్పుడు రాజ్యసభ ఆమోదంపై దృష్టి సారించింది. మొత్తం మీద పార్లమెంట్ ఉభయ సభల ఆమోదంతో ఈ బడ్జెట్ ప్రక్రియ త్వరలోనే ముగియనుంది.

## కేరళ ఎన్నికలపై యుద్ధ నీడలు...

**మొదటిపేజీ తరువాయి....**
సాధారణంగా ఈ ప్రాంతాల్లో గల్ఫ్ నుంచి వచ్చే ఓటర్ల కోసం ప్రత్యేక చార్టర్డ్ విమానాలను కూడా ఏర్పాటు చేసేవారు. కానీ ఈసారి యుద్ధ భయంతో విమాన ప్రయాణాలు అస్తవ్యస్తం కావడంతో, గతంలో మాదిరిగా ఓటర్లు తరలిరావడం అసాధ్యమని ప్రవాసీ సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాజకీయపరంగా చూస్తే, ఈ పరిణామం కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి, ముఖ్యంగా అందులోని కీలక భాగస్వామి అయిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ కు కొంత నష్టం కలిగించే అవకాశం ఉంది. గల్ఫ్ ఓటర్లలో మెజారిటీ ఓట్లు ఈ పార్టీకే పడుతుంటాయి.ఓటర్లు రాకపోతే తమ గెలుపు, మెజారిటీలు తగ్గుతాయని ఐయూఎంఎల్ నేతలు ఇప్పటికే ఆందోళన చెందుతున్నారు.
**ఛార్జీల భారం.. ఓటింగ్ పై ప్రభావం**
మరోవైపు యుద్ధం కారణంగా విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల టికెట్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. యుద్ధం ఒకవేళ త్వరగా ముగిసినప్పటికీ, పెరిగిన ఛార్జీల భారంతో ఓటు వేయడానికి రావడం ప్రవాసీయులకు సవాలుగా మారనుంది. దీనివల్ల ప్రవాసీయుల ప్రభావం ఎక్కువగా ఉండే నియోజకవర్గాల్లో ఫలితాలు తారుమారయ్యే ప్రమాదం ఉంది. అయితే, రాజకీయ విశ్లేషకులు మాత్రం ఈ ప్రభావం పరిమితంగానే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు. ప్రవాసీ ఓటర్ల సంఖ్య ఎక్కువగా ఉన్న నియోజకవర్గాల్లో అభ్యర్థులు భారీ మెజార్టీలతో గెలిచే అవకాశం ఉండటంతో, కొద్దిపాటి ఓట్ల తగ్గుదల మొత్తం ఫలితాన్ని మార్చలేకపోవచ్చని అంటున్నారు. ఈ పరిస్థితుల నేపథ్యంలో ఏప్రిల్ 9న జరిగే పోలింగ్‌లో గల్ఫ్ ఓటర్లు ఎంతవరకు పాల్గొంటారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది.

## నేను బతికున్నంత వరకు ఎన్నార్సీని అనుమతించను



**ఇంటర్నెట్ డెస్క్(ఏడీఎన్ఎన్):**

'నేను ప్రాణాలతో ఉన్నంత వరకు రాష్ట్రంలో ఎన్నార్సీని అనుమతించను' అని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బీజేపీపై ఆమె తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఓటరు జాబితా సవరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ప్రజల హక్కులు కాలరాసేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ఇందుకోసం రాజ్యాంగ సంస్థలను వాడుకుంటోందన్నారు. రాజ్యాంగ, ప్రజాస్వామ్య విలువలను ఏమాత్రం పాటించడం లేదని మండిపడ్డారు. ఈ రోజు ఓటుహక్కును లాక్కున్న వారు రేపు ఎన్నార్సీని తీసుకువచ్చి పౌరసత్వాన్ని కూడా లాక్కుంటారని దుయ్యబట్టారు. నక్సల్బరీలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మమత ఈ వ్యాఖ్యలు చేశారు. 'సర్' పేరుతో రాష్ట్రంలోని లక్షల మంది అర్హులైన ఓటర్ల పేర్లను ఈసీ తొలగించిందని సీఎం ఆరోపించారు. దీనివల్ల అనేక మంది మైనారిటీ ఓటర్లు, వలస కార్మికులు నష్టపోయారన్నారు. ఏకపక్షంగా ఈ తొలగింపులు చోటుచేసుకున్నాయని, తమ స్థానికతను నిరూపించుకోవడానికి బెంగాల్ ప్రజలకు ఒక్క అవకాశమూ ఇవ్వలేదని విమర్శించారు. 'సర్' పని ఒత్తిడితో రాష్ట్రంలో 220 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. వీటిపై ప్రశ్నిస్తూ బెంగాల్ ప్రజలకు తాను తోడుగా నిలబడం వల్లే తమ ప్రభుత్వాన్ని నియంత్రించేందుకు కేంద్రం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. భాజపా, ఎన్నికల కమిషన్ పని తీరుపై తనకు నమ్మకం లేదని మమత అన్నారు. నామినేషన్ వేసేందుకు వెళ్లే సమయంలో అభ్యర్థులు వారితో పాటు లాయర్లను తీసుకెళ్లి.. ప్రతి పత్రాన్ని జాగ్రత్తగా తనిఖీ చేసుకోవాలని సూచించారు.

## పాదయాత్ర మొదలు కాగానే సినిమా చూపిస్తా!

**మొదటిపేజీ తరువాయి...**
ఆర్సెలర్ మిట్టల్ స్టీల్ ప్లాంట్, గూగుల్ పెట్టుబడులు, బల్క్ డ్రగ్ పార్క్ వంటివి తమ హయాంలోనే పట్టాలెక్కాయని, ఇప్పుడు బాబు తన వల్లే వచ్చాయన్నట్లు బిల్డప్ ఇస్తున్నారని ఎద్దేవా చేశారు. తమ హయాంలో ప్రారంభమైన మూడు ప్రభుత్వ రంగ పోర్టుల పనులు ప్రస్తుతం ముందుకు సాగడం లేదని, పైగా పోర్టుల చుట్టుపక్కల మళ్ళీ భూములు లాక్కునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని, యుద్ధం పేరు చెప్పి వంటనూనె ధరలను లీటరుకు రూ. 40 వరకు పెంచేశారని జగన్ మండిపడ్డారు. పప్పుల ధరలు పెరగడంతో పాటు గ్యాస్ సిలిండర్లు బ్లాక్ మార్కెట్‌లో భారీ ధరలకు అమ్ముతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్యాస్ ధరలు తగ్గించాల్సింది పోయి, ప్రజలకు మళ్లీ కిరోసిన్ ఇస్తామనడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ, ప్రజలు మళ్లీ పాతకాలం నాటి కిరోసిన్ స్టౌవ్‌లు కొనుక్కోవాలా అని ప్రశ్నించారు. పంటలకు గిట్టుబాటు ధర లేక రైతులు విలవిలలాడుతున్నారని, ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శిస్తూ, కార్యకర్తలు ప్రజా పక్షాన పోరాటానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## పాక్ ఒక 'బ్రోకర్' దేశం

**మొదటిపేజీ తరువాయి...**
యుద్ధ ప్రాంతంలో చిక్కుకున్న దాదాపు 4.25 లక్షల మంది భారతీయులను ఇప్పటికే సురక్షితంగా స్వదేశానికి తరలించామని, మిగిలిన వారి భద్రత కోసం నిరంతరం దౌత్యపరమైన సంప్రదింపులు జరుపుతున్నామని ప్రభుత్వం వెల్లడించింది. ఇంధన భద్రత విషయంలో భారతీయులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్రం భరోసా ఇచ్చింది. ఇరాన్‌పై అమెరికా ఆంక్షలు ఉన్నప్పటికీ, గత 15 ఏళ్లుగా భారత్ అక్కడి నుంచి చమురు కొనుగోలు చేస్తూనే ఉందని గుర్తు చేసింది. ప్రస్తుతం రష్యా నుంచి అత్యధికంగా ముడి చమురు దిగుమతి చేసుకుంటున్నామని, దీనివల్ల అంతర్జాతీయ మార్కెట్లో ఒడిదుడుకులు ఉన్నా దేశీయంగా ఇంధన సరఫరాకు ఎటువంటి ముప్పు లేదని వివరించింది. అమెరికా భారత్‌కు అతిపెద్ద వాణిజ్య భాగస్వామి కాగా, ఇజ్రాయెల్ కీలక సాంకేతిక, వ్యూహాత్మక భాగస్వామిగా ఉందన్నారు. అదే సమయంలో ఇరాన్‌తో కూడా భారత్ సన్నిహిత సంబంధాలను కొనసాగిస్తోందని ప్రభుత్వం తెలిపింది. జాతీయ ప్రయోజనాలే పరమావధిగా భారత విదేశాంగ విధానం సాగుతోందన్నారు. ఎవరి ఒత్తిళ్లకు తలొగ్గే ప్రసక్తే లేదని కేంద్రం స్పష్టం చేసింది.

## ...ఇందిరమ్మ పేరా?

**మొదటిపేజీ తరువాయి...**
రాకేశ్ రెడ్డి వెంటనే తన వ్యాఖ్యలకు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. మంత్రి సీతక్క సైతం ఇందిరమ్మ పేరును వివాదంలోకి లాగడం మొత్తం మహిళా లోకాన్నే అవమానించడమని మండిపడ్డారు. సదరు అభ్యంతరకర వ్యాఖ్యలను వెంటనే సభ రికార్డుల నుంచి తొలగించాలని మంత్రి శ్రీధర్ బాబు స్పీకర్‌ను కోరారు. ఈ అంశం పై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు కూడా స్పందించారు . కేవలం ఒక పేరుపై గంటల తరబడి సభా సమయాన్ని వృథా చేయడం సమంజసం కాదని, ఒకవేళ తప్పుగా మాట్లాడి ఉంటే ఆ వ్యాఖ్యలను తొలగిస్తే సరిపోతుందని ఆయన అభిప్రాయపడ్డారు. మంత్రుల వ్యాఖ్యలకు బీజేపీ ఎమ్మెల్యే రాకేశ్ రెడ్డి వివరణ ఇచ్చారు . తాను కేవలం ఆ పేరు పెట్టవద్దని మాత్రమే సూచించానని, అందులో తప్పేముందని ప్రశ్నించారు. ఒకవేళ తన మాటలు ఎవరినైనా నొప్పించి ఉంటే రికార్డుల నుంచి తొలగించవచ్చని, కానీ తన ఉద్దేశాన్ని అపార్థం చేసుకోవద్దని విజ్ఞప్తి చేశారు. బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సైతం రాకేశ్ రెడ్డికి మద్దతుగా నిలిచారు . ఆయన ఎక్కడా అసభ్య పదజాలం వాడలేదని, మంత్రులు అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ధ్వజమెత్తారు. మొత్తానికి ఇప్పపువ్వు సారాపై మొదలైన చర్చ ఇందిరమ్మ పేరు చుట్టూ రాజకీయ రణరంగంగా మారి సభలో తీవ్ర ఉత్కంఠను రేకెత్తించింది.

## భారత్‌కు అండగా రష్యా

**మొదటిపేజీ తరువాయి...**
అంతర్జాతీయ ఒత్తిళ్లు ఉన్నప్పటికీ భారత్ తన స్వతంత్ర విదేశీ విధానాన్ని చాటుకుంటూ ఈ నిర్ణయం తీసుకుంది. ఒకవైపు అమెరికా ఆంక్షల సడలింపులను ఉపయోగించుకుంటూ ఇరాన్ నుంచి 5 మిలియన్ బ్యారెళ్ల చమురును సేకరిస్తూనే, మరోవైపు రష్యా నుంచి భారీ స్థాయిలో దిగుమతులు చేస్తోంది. ఈ వ్యూహం ద్వారా భారత్ తన 'ఎనర్జీ బాస్కెట్'ను సుస్థిరపరుచుకుంటోంది. యుద్ధ సంక్షోభ సమయంలో ఏ ఒక్క దేశంపై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించడం ద్వారా ఇంధన అవసరాలను తీర్చుకుంటోంది. అయితే, పశ్చిమాసియాలో యుద్ధం సుదీర్ఘకాలం కొనసాగితే ముడి చమురు ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. రష్యా కూడా భవిష్యత్తులో ధరలను పెంచే అవకాశం ఉన్నందున, భారత్ మరిన్ని కొత్త ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందని వారు అభిప్రాయపడుతున్నారు.

## ...కూల్చేసిన ఇరాన్?

**మొదటిపేజీ తరువాయి...**
ఈ ఘటనపై అమెరికా రక్షణ శాఖ నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ధృవీకరణ రాలేదు. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి అనేక క్లెయిమ్‌లు చేసినప్పుడు, అమెరికా వాటిని తోసిపుచ్చిన సందర్భాలు ఉన్నాయి. ప్రస్తుతానికి ఇరాన్ విడుదల చేసిన వీడియోలోని వాస్తవికతను అంతర్జాతీయ నిపుణులు పరిశీలిస్తున్నారు. ఒకవేళ ఇరాన్ ప్రకటన నిజమైతే, వాషింగ్టన్ , టెహ్రాన్ మధ్య ఉద్రిక్తతలు మరో స్థాయికి చేరి, నేరుగా యుద్ధానికి దారితీసే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. గల్ఫ్ ప్రాంతంలో ఇప్పటికే యుద్ధ వాతావరణం నెలకొన్న తరుణంలో ఈ వార్త ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపుతోంది.



## శత్రువులు పశ్చాత్తాప పడేవరకూ దాడులు చేస్తాం...

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

పశ్చిమాసియాలో యుద్ధం ముగింపుపై ఒకవైపు దౌత్యపరమైన చర్చలు సాగుతున్నాయనే వార్తలు వస్తుండగా, ఇరాన్ మాత్రం తన మొండి వైఖరిని ప్రదర్శిస్తోంది. అమెరికా, ఇజ్రాయెల్ చేసిన దురాక్రమణకు వారు పశ్చాత్తాపపడే వరకు తమ ప్రతీకార దాడులు కొనసాగుతూనే ఉంటాయని ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీతో జరిగిన చర్చల సందర్భంగా ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ దేశ సార్వభౌమత్వాన్ని, ప్రాదేశిక సమగ్రతను కాపాడుకోవడమే తమ మొదటి ప్రాధాన్యమని ఆయన వెల్లడించారు. ఇరాన్ పౌర ,రక్షణ మౌలిక సదుపాయాలే లక్ష్యంగా అమెరికాఇజ్రాయెల్ దాడులు చేయడం వల్లే ఈ ప్రాంతంలో అస్థిరత ఏర్పడిందని అరాగ్చీ ఆరోపించారు. తమ లక్ష్యాలు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు. అలాగే, వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని మూసివేయడం వంటి చర్యలన్నీ అంతర్జాతీయ చట్టాలకు అనుగుణంగానే ఉన్నాయని ఆయన సమర్థించుకున్నారు. ఒకవేళ శత్రువులు తమ తప్పును తెలుసుకుని పశ్చాత్తాపపడితేనే శాంతి సాధ్యమవుతుందనే సంకేతాలను ఇరాన్ పంపింది. మరోవైపు, ఇరాన్ నేతలకు అమెరికా, ఇజ్రాయెల్ తాత్కాలిక రక్షణ కల్పించినట్లు వార్తలు రావడం గమనార్హం. విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో పాటు పార్లమెంటు స్పీకర్ మహమ్మద్ బాగేర్ గాలిబఫ్‌పై చర్చలు కొనసాగుతున్నంత కాలం ఎలాంటి దాడులు చేయబోమని ఇజ్రాయెల్ మీడియా పేర్కొంది. అయితే, దీనిపై అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇరాన్ వ్యాఖ్యలను బట్టి చూస్తే శాంతి చర్చలు ఇప్పుడప్పుడే కొలిక్కి వచ్చేలా కనిపించడం లేదు. ప్రస్తుత ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ తన పట్టును నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోంది. అంతర్జాతీయ సమాజం ఈ పరిణామాలను నిశితంగా గమనిస్తోంది. అమెరికా ప్రతిపాదించిన 15 షరతులపై ఇరాన్ ఏ విధంగా స్పందిస్తుందనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. యుద్ధం ఆగిపోవాలంటే రెండుపక్షాల మధ్య ఏకాభిప్రాయం కుదరడం అనివార్యమని దౌత్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## విజయవాడ ఉగ్రకుట్ర కేసులో మరో ఇద్దరు అరెస్ట్



**విజయవాడ (ఏడీఎన్ఎన్):**

గత కొంతకాలం క్రితం విజయవాడలో కలకలం రేపిన ఉగ్రవాద కుట్ర కేసులో దర్యాప్తు సంస్థలు మరో కీలక అడుగు వేశాయి. ఈ కేసుతో సంబంధం ఉందనే ఆరోపణలపై హైదరాబాద్‌కు చెందిన సైదా బేగం, బళ్లారికి చెందిన అబ్దుల్ సలాంను పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. నిందితులను విజయవాడ కోర్టులో ప్రవేశపెట్టగా, న్యాయమూర్తి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించారు. తర్వాత భారీ భద్రత మధ్య వీరిని రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. హైదరాబాద్‌లోని చంచల్‌గూడ ప్రాంతంలో నివాసం ఉంటున్న సైదా బేగం ఇంట్లో బుధవారం ఉదయం పోలీసులు ఆకస్మిక సోదాలు నిర్వహించారు. ఈ కేసులో ఇప్పటికే అరెస్టయిన ఇతర ఉగ్ర నిందితులతో ఆమెకు ప్రత్యక్ష సంబంధాలు ఉన్నట్లు విచారణలో ప్రాథమిక ఆధారాలు లభించాయి. సోదాల తర్వాత ఆమెకు 41A నోటీసులు జారీ చేసి, వెంటనే అదుపులోకి తీసుకున్నారు. కాగా, సైదా బేగం స్వస్థలం మహారాష్ట్రలోని సోలాపూర్ అని, గత కొన్నేళ్లుగా ఆమె హైదరాబాద్‌లో నివసిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. సైదా బేగం కదలికలపై గత కొంతకాలంగా తెలంగాణ ఇంటెలిజెన్స్ పోలీసులు నిఘా ఉంచినట్లు తెలుస్తోంది. పాత నేరస్థులతో ఆమెకు ఉన్న సంబంధాలు, ముఖ్యంగా అనుమానాస్పదంగా సాగుతున్న ఆర్థిక లావాదేవీలపై పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. ఈ ఉగ్రవాద నెట్‌వర్క్ ఇంకా ఎంతమందికి విస్తరించి ఉందనే కోణంలో దర్యాప్తును వేగవంతం చేశారు.ఈ అరెస్టులతో ఉగ్రవాద సానుభూతిపరుల నెట్‌వర్క్‌లో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని భావిస్తున్నారు.



## ఆ ఏడుగురు ఎమ్మెల్యేలు కౌంటర్ దాఖలు చేయాల్సిందే

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

పార్టీ ఫిరాయింపుల వ్యవహారంపై తెలంగాణ హైకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి చేరిన పది మంది ఎమ్మెల్యేలు పార్టీ మారలేదని అసెంబ్లీ స్పీకర్ ఇటీవల ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా అసెంబ్లీ స్పీకర్‌తో పాటు ఏడుగురు ఎమ్మెల్యేలకు కోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరణతో కౌంటర్ దాఖలు చేయాలని వారిని ఆదేశించింది. ముఖ్యంగా దానం నాగేందర్, అరికెపూడి గాంధీ, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, పోచారం శ్రీనివాస్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, తెల్లం వెంకట్రావులపై వచ్చిన ఫిర్యాదులను కోర్టు పరిగణనలోకి తీసుకుంది. స్పీకర్ నిర్ణయం రాజ్యాంగ విరుద్ధమని, ఫిరాయించిన వారిపై వెంటనే అనర్హత వేటు వేయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కోర్టును కోరారు. ఈ నేపథ్యంలో హైకోర్టు నేరుగా జోక్యం చేసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో పెను దుమారం రేపుతోంది. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ క్లీన్ చిట్ ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ బీజేపీ ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి కూడా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై స్పందించిన న్యాయస్థానం ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు , స్పీకర్‌కు నోటీసులు ఇచ్చింది. ఫిరాయింపుల నిరోధక చట్టం ప్రకారం వీరిపై చర్యలు తీసుకోవాలని పిటిషనర్లు కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కేసు తదుపరి విచారణను న్యాయస్థానం ఏప్రిల్ 16వ తేదీకి వాయిదా వేసింది. స్పీకర్ కార్యాలయం ఇచ్చే వివరణ, ఎమ్మెల్యేలు దాఖలు చేసే కౌంటర్ అఫిడవిట్లపైనే ఈ కేసు భవిష్యత్తు ఆధారపడి ఉంది. హైకోర్టు ఇచ్చే తీర్పు ఫిరాయించిన ఎమ్మెల్యేల రాజకీయ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. వచ్చే నెల విచారణ వరకు ఈ రాజకీయ ఉత్కంఠ కొనసాగనుంది. న్యాయస్థానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అటు అధికార, ఇటు ప్రతిపక్ష పార్టీలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి.

సంక్షేమ
# మనసర్కార్
Follow: manasarkar





## ఇరాన్‌పై ఇజ్రాయెల్ బాంబుల వర్షం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**


ఇరాన్‌తో కొనసాగుతున్న యుద్ధంలో ఇజ్రాయెల్ తన ప్రతాపాన్ని చూపిస్తోంది. యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు ఇరాన్‌పై ఏకంగా 15,000 బాంబులను ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ రక్షణ శాఖ మంత్రి ఇజ్రాయెల్ కాట్జ్ ప్రకటించారు. గతేడాది జూన్ నెలలో జరిగిన సంఘర్షణలతో పోలిస్తే, ఈసారి నాలుగు రెట్లు అధికంగా బాంబులను ఉపయోగించినట్లు ఆయన వెల్లడించారు. అమెరికాతో కలిసి సంయుక్తంగా చేపట్టిన ఈ ఆపరేషన్‌లో భాగంగా ఇరాన్ వ్యాప్తంగా ఉన్న 3,000 వ్యూహాత్మక లక్ష్యాలను ధ్వంసం చేసినట్లు పేర్కొన్నారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రెండు రోజుల క్రితం ఇరాన్‌పై దాడులను ఐదు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ప్రకటించిన నేపథ్యంలో ఇజ్రాయెల్ స్పందన ఆసక్తికరంగా మారింది. ట్రంప్ చేసిన ఆ ప్రకటనతో తమకు ఎటువంటి సంబంధం లేదని ఇజ్రాయెల్ స్పష్టం చేసింది. తమ రక్షణ ప్రయోజనాల దృష్ట్యా దాడుల విషయంలో స్వతంత్రంగా వ్యవహరిస్తామని ఇజ్రాయెల్ సంకేతాలిచ్చింది. శత్రువుల కీలక స్థావరాలను నిర్వీర్యం చేయడమే లక్ష్యంగా తమ దాడులు కొనసాగుతున్నాయని కాట్జ్ వివరించారు. యుద్ధం ప్రారంభమైన అతి తక్కువ కాలంలోనే ఇన్ని వేల బాంబులను ప్రయోగించడం అంతర్జాతీయ సమాజాన్ని విస్మయానికి గురిచేస్తోంది. ఇరాన్ యొక్క అణు కేంద్రాలు, సైనిక స్థావరాలు , మౌలిక సదుపాయాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగినట్లు సమాచారం. అమెరికా శాంతి చర్చలకు మొగ్గు చూపుతున్నప్పటికీ, ఇజ్రాయెల్ మాత్రం తన సైనిక చర్యను ముమ్మరం చేయడం పశ్చిమాసియాలో ఉద్రిక్తతలను మరింత పెంచుతోంది. భవిష్యత్తులో ఈ దాడులు మరిన్ని ప్రాంతాలకు విస్తరించే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు



## నైజీరియాలో ఉగ్రవాదుల పంజా

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

నైజీరియాలోని వాయువ్య రాష్ట్రమైన కెబ్బీలో సాయుధ దుండగులు జరిపిన దాడిలో తొమ్మిది మంది నైజీరియా సైనికులు వీరమరణం పొందారు. మంగళవారం రాత్రి జరిగిన ఈ ఘటనలో పలువురు సైనికులు తీవ్రంగా గాయపడ్డారని భద్రతా వర్గాలు , స్థానిక అధికారులు వెల్లడించారు. బెనిన్ , నైజర్ దేశాలతో సరిహద్దులను పంచుకునే కెబ్బీ రాష్ట్రంలో సాయుధ కిడ్నాప్ ముఠాలు , ఇస్లామిక్ ఉగ్రవాదుల ప్రాబల్యం పెరుగుతుండటం ఇప్పుడు అంతర్జాతీయంగా ఆందోళన కలిగిస్తోంది. సైనిక వర్గాల సమాచారం ప్రకారం, కెబ్బీలోని షాంగా జిల్లాలో తమ బేస్ సమీపంలో సైనికులు గస్తీ నిర్వహిస్తుండగా దుండగులు ఒక్కసారిగా తూటాల వర్షం కురిపించారు. ఈ ప్రాంతంలో క్రియాశీలకంగా ఉంటూ భద్రతా బలగాలనే లక్ష్యంగా చేసుకునే 'లకురావా' అనే ఉగ్రవాద ముఠా ఈ దాడులకు పాల్పడి ఉంటుందని అధికారులు అనుమానిస్తున్నారు. కెబ్బీ రాష్ట్ర గవర్నర్ నాసిర్ ఇద్రిస్ గాయపడిన సైనికులను పరామర్శించి ఈ దాడిని ధృవీకరించినప్పటికీ, మరణాల సంఖ్యపై అధికారికంగా స్పందించలేదు. నైజీరియా అధ్యక్షుడు బోలా టినుబు ప్రభుత్వం బాధ్యతలు చేపట్టి మూడేళ్లు గడుస్తున్నా, దేశంలో శాంతిభద్రతల సమస్య ఇంకా కొలిక్కి రాకపోవడం గమనార్హం. వాయువ్య ప్రాంతంలో సాయుధ ముఠాల ఆగడాలు రోజురోజుకూ పెచ్చుమీరుతున్నాయి. ముఖ్యంగా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో, నైజీరియా వంటి దేశాల్లో అంతర్గత భద్రతా లోపాలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ఈ దాడిపై నైజీరియా సైన్యం ఇప్పటివరకు అధికారిక ప్రకటన విడుదల చేయలేదు.



## హంగేరీ రాజకీయాల్లో సరికొత్త ధ్రువతార


**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

హంగేరీ ప్రస్తుత రాజకీయాలు ఒక ఆసక్తికరమైన మలుపు వద్ద నిలిచాయి. చిన్నతనంలో తన గది గోడలపై విక్టర్ ఓర్బన్ ఫోటోలను అతికించుకుని, ఆయనను ఒక ప్రజాస్వామ్య హీరోగా ఆరాధించిన పీటర్ మాగ్యార్, ఇప్పుడు అదే ఓర్బన్‌ను గద్దె దించేందుకు 'తిస్జా' పార్టీ తరపున పోరాడుతున్నారు. తాజా ఎన్నికల సర్వేల ప్రకారం, మాగ్యార్ నేతృత్వంలోని సెంటర్‌రైట్ పార్టీ, ఓర్బన్ అధికార 'ఫిడెజ్' పార్టీ కంటే 8 నుంచి 12 శాతం ఆధిక్యంలో ఉండటం విశేషం. రెండు సంవత్సరాల క్రితం వరకు మాగ్యార్ పేరు హంగేరీ రాజకీయాల్లో పెద్దగా వినిపించలేదు. ఓర్బన్ ప్రభుత్వంలో మాజీ మంత్రిగా పనిచేసిన తన మాజీ భార్య జుడిత్ వర్గా రాజీనామా తర్వాత, ఆయన ప్రభుత్వంలోని అవినీతిని, ప్రచారాన్ని ఎండగడుతూ బయటకు వచ్చారు. కేవలం నాలుగు నెలల కాలంలోనే 2024 యూరోపియన్ ఎన్నికల్లో 30 శాతం ఓట్లను సాధించి అందరినీ ఆశ్చర్యపరిచారు. ఓర్బన్ అనుసరిస్తున్న గ్రాస్ రూట్ లెవల్ వ్యూహాలనే మాగ్యార్ కూడా అనుసరిస్తూ, జాతీయ జెండాలు , సోషల్ మీడియాను సమర్థవంతంగా వాడుకుంటూ ప్రజల్లోకి దూసుకెళ్తున్నారు. విదేశీ విధానంలో కూడా మాగ్యార్ విప్లవాత్మక మార్పులను ప్రతిపాదిస్తున్నారు. ఓర్బన్ హయాంలో హంగేరీ రష్యాతో సన్నిహితంగా ఉంటూ, యూరోపియన్ యూనియన్ తో ఘర్షణాత్మక వైఖరిని అవలంబించింది. దీనివల్ల యూరోపియన్ యూనియన్ హంగేరీకి రావాల్సిన బిలియన్ల కొద్దీ నిధులను నిలిపివేసింది. దీనికి భిన్నంగా, మాగ్యార్ తాము అధికారంలోకి వస్తే పశ్చిమ దేశాలతో సంబంధాలను పునరుద్ధరిస్తామని, 2035 నాటికి రష్యా ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గిస్తామని హామీ ఇచ్చారు. అలాగే, నిలిచిపోయిన నిధులను విడుదల చేయించడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థను గాడిలో పెడతామని పేర్కొన్నారు. ఓర్బన్ విధానాలను వ్యతిరేకిస్తున్నప్పటికీ, మాగ్యార్ తన అడుగులను జాగ్రత్తగా వేస్తున్నారు. కన్జర్వేటివ్ ఓటర్లు దూరమవ్వకుండా ఉండేందుకు.. వలసదారుల కోటాను వ్యతిరేకించడం, సరికొత్త సరిహద్దు కంచెను కొనసాగించడం వంటి కొన్ని జాతీయవాద నిర్ణయాలకు ఆయన మద్దతు ఇస్తున్నారు.వచ్చే నెల ఏప్రిల్ 12న జరగనున్న ఈ ఎన్నికల ఫలితాలు కేవలం హంగేరీకే కాకుండా, యూరప్‌లోని ప్రజాకర్షక రాజకీయాలకు ఒక దిక్సూచిగా మారనున్నాయి. ఓర్బన్ 16 ఏళ్ల సుదీర్ఘ పాలనకు చరమగీతం పాడుతూ మాగ్యార్ విజయం సాధిస్తారా లేదా అనేది ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా ఆసక్తిని రేకెత్తిస్తోంది. మచ్చలేని పాలన , పారదర్శకతను నినాదంగా చేసుకున్న మాగ్యార్, యువత , మార్పును కోరుకునే ఓటర్లను విశేషంగా ఆకట్టుకుంటున్నారు.

# అమెరికాతో స్నేహం.. చైనాతో వ్యాపారం

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

చైనాతో ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు విజయవంతంగా ముగిశాయని కెన్యా అధ్యక్షుడు విలియం రుటో బుధవారం ప్రకటించారు. అంతర్జాతీయ పెట్టుబడుల ఆకర్షణే లక్ష్యంగా జరిగిన ఒక సదస్సులో ఆయన ఈ కీలక విషయాన్ని వెల్లడించారు. ఈ ఒప్పందం ప్రకారం, కెన్యా నుండి చైనాకు ఎగుమతి అయ్యే దాదాపు 98 శాతం ఉత్పత్తులపై ఎటువంటి దిగుమతి సుంకాలు ఉండవు. తద్వారా తూర్పు ఆఫ్రికాలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ అయిన కెన్యాకు చైనా వంటి భారీ మార్కెట్ అందుబాటులోకి రానుంది. గత ఏడాది బీజింగ్‌లో పర్యటించిన విలియం రుటో, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో అనేక ఆర్థిక ,సహకార ఒప్పందాలపై సంతకాలు చేశారు. ప్రస్తుతం చైనా ,కెన్యా మధ్య జరుగుతున్న వాణిజ్యం ఎక్కువగా చైనా వైపు మొగ్గు చూపిస్తోంది. ఈ కొత్త ఒప్పందం ద్వారా




కెన్యా అధ్యక్షుడు రుటో ద్వంద్వ వ్యూహం

ఎగుమతులను పెంచి, వాణిజ్య లోటును తగ్గించుకోవచ్చని కెన్యా ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు, అమెరికాలోని ట్రంప్ యంత్రాంగంతో కూడా కెన్యా వేరొక వాణిజ్య ఒప్పందం కోసం చర్చలు జరుపుతుండటం గమనార్హం. చైనాతో కెన్యా సాన్నిహిత్యంపై అమెరికా అధికారులు విమర్శలు గుప్పిస్తున్నప్పటికీ, రుటో మాత్రం తన నిర్ణయాన్ని గట్టిగా సమర్థించుకున్నారు. తమ దేశ ఆర్థికాభివృద్ధికి ఎగుమతులు పెరగడం అత్యంత అవసరమని ఆయన పేర్కొన్నారు. గత ఏడాది కాలంలో కెన్యా ఆర్థిక వ్యవస్థ నిలకడగా ఉందని, ద్రవ్యోల్బణం నియంత్రణలో ఉండటమే కాకుండా కరెన్సీ (షిలింగ్) కూడా స్థిరంగా ఉందని ఆయన తెలిపారు. 2025లో కెన్యాకు విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (FDI) రికార్డు స్థాయిలో 2 బిలియన్ డాలర్లను దాటాయని, ఇది అంతకుముందు ఏడాదితో పోలిస్తే 15 శాతం అధికమని ఆయన వివరించారు.

# వెయ్యి డ్రోన్లతో ఉక్రెయిన్ పై రష్యా దాడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఉక్రెయిన్ గగనతలంపై రష్యా వినాశకరమైన దాడులకు తెగబడింది. గత 24 గంటల్లో ఏకంగా 1,000 డ్రోన్లతో విరుచుకుపడి రష్యా తన ప్రతాపాన్ని చూపింది. యుద్ధం మొదలైనప్పటి నుంచి ఒకే రోజులో ఇన్ని వందల డ్రోన్లతో దాడి చేయడం ఇదే మొదటిసారని ఉక్రెయిన్ రక్షణ వర్గాలు వెల్లడించాయి. సాధారణంగా రాత్రిపూట దాడులకు పరిమితమయ్యే రష్యా, ఈసారి పగలు కూడా వందలాది డ్రోన్లను ప్రయోగించి అంతర్జాతీయ సమాజాన్ని విస్మయానికి గురిచేసింది. ఇరాన్ తయారీ 'షాహెద్' డ్రోన్లతో పాటు రష్యా సొంతంగా అభివృద్ధి చేసిన అత్యాధునిక క్షిపణులను ఈ విధ్వంసానికి ఉపయోగించారు. సోమవారం రాత్రి 392 డ్రోన్లు, 34 క్షిపణులతో మొదలైన ఈ మారణకాండ, మంగళవారం పగటిపూట మరో 556 డ్రోన్ల దాడితో కొనసాగింది. ఉక్రెయిన్ అంతటా సుమారు 550 ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుని



రష్యా ఈ దాడులు జరిపింది. ఉక్రెయిన్ వైమానిక దళం అత్యంత చాకచక్యంగా వ్యవహరించి 541 డ్రోన్లను గాలిలోనే కూల్చివేసినప్పటికీ, మిగిలినవి నివాస ప్రాంతాలు, ఆసుపత్రులపై పడి భారీ నష్టాన్ని కలిగించాయి. ఇవానో‌ఫ్రాంకివ్స్క్ ప్రసూతి ఆసుపత్రి సమీపంలో జరిగిన దాడిలో ఒక సైనికుడు మరియు అతని 15 ఏళ్ల కుమార్తె మరణించడం తీవ్ర విషాదాన్ని నింపింది. అప్పుడే పుట్టిన తన బిడ్డను చూడటానికి వెళ్తుండగా జరిగిన ఈ ఘోరం ఉక్రెయిన్ ప్రజలను శోకసంద్రంలో ముంచెత్తింది.ఈ వినాశనంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాదిమిర్ జెలెన్‌స్కీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రష్యా లక్ష్యం కేవలం విధ్వంసమేనని, యుద్ధాన్ని ముగించాలనే ఆలోచన వారికి లేదని ఆయన మండిపడ్డారు. మాస్కోపై అంతర్జాతీయ సమాజం మరిన్ని కఠిన ఆంక్షలు విధించాలని, తమ గగనతలాన్ని కాపాడుకోవడానికి పశ్చిమ దేశాలు మరిన్ని అత్యాధునిక ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలను అందించాలని ఆయన కోరారు. మరోవైపు ఎల్వివ్ నగరంలోని చారిత్రక చర్చి కూడా ఈ దాడుల్లో దెబ్బతినడం సాంస్కృతిక విధ్వంసానికి అద్దం పడుతోంది.

# డెన్మార్క్ ఎన్నికల్లో 'కింగ్ మేకర్'గా మాజీ ప్రధాని!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

డెన్మార్క్ పార్లమెంటరీ ఎన్నికల ఫలితాలు ఆ దేశ రాజకీయాల్లో పెను మార్పులకు సంకేతంగా నిలిచాయి. ప్రస్తుత ప్రధానమంత్రి మెట్టె ఫ్రెడరిక్సెన్ నేతృత్వంలోని 'సోషల్ డెమోక్రాట్స్' పార్టీ 21.9% ఓట్లతో అతిపెద్ద పార్టీగా అవతరించినప్పటికీ, గత 120 ఏళ్లలో ఆ పార్టీకి ఇది అత్యంత బలహీనమైన ప్రదర్శన కావడం గమనార్హం. మొత్తం 179 స్థానాలున్న పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు అవసరమైన 90 సీట్ల మేజిక్ ఫిగర్‌ను ఏ కూటమి సాధించలేకపోయింది. ఫ్రెడరిక్సెన్ నేతృత్వంలోని వామపక్ష 'రెడ్ బ్లాక్' 84 స్థానాలతో సరిపెట్టుకోగా, కుడిపక్షాల 'బ్లూ బ్లాక్'కూటమి 77 స్థానాలను దక్కించుకుంది. ప్రధాన ప్రతిపక్షమైన లిబరల్ పార్టీ (వెన్‌స్ట్రే) కూడా 10.1% ఓట్లతో శతాబ్ద కాలంలోనే అత్యంత పేలవమైన ఫలితాన్ని మూటగట్టుకుంది. ఈ అనిశ్చిత పరిస్థితుల్లో 14 సీట్లు గెలుచుకున్న 'మోడరేట్స్' పార్టీ ఇప్పుడు కింగ్ మేకర్‌గా అవతరించింది. ఆ పార్టీ నేత, మాజీ ప్రధానమంత్రి లార్స్ లక్కే రాస్ముస్సేన్ చేతుల్లోనే




తదుపరి ప్రభుత్వ భవిష్యత్తు ఆధారపడి ఉంది. అమెరికాతో గ్రీన్లాండ్ వివాదం సమయంలో చాకచక్యంగా వ్యవహరించి అంతర్జాతీయంగా వార్తల్లో నిలిచిన రాస్ముస్సేన్, ప్రస్తుతం మధ్యేవాద ప్రభుత్వ ఏర్పాటుకు మొగ్గు చూపుతున్నారు. అయితే, లిబరల్ పార్టీ నేత ట్రోయెల్స్ లండ్ పౌల్సన్ మాత్రం ప్రస్తుత ప్రధానితో కలిసే ప్రసక్తే లేదని స్పష్టం చేస్తూ, రాస్ముస్సేన్‌ను తమ కూటమిలోకి రావాలని కోరుతున్నారు. దీంతో తదుపరి ప్రధాని ఎవరనేది ఇప్పుడు రాస్ముస్సేన్ తీసుకునే నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. నిజానికి ప్రధాని ఫ్రెడరిక్సెన్ గ్రీన్లాండ్ అంశంపై తనకున్న పాపులారిటీని నమ్ముకుని ముందస్తు ఎన్నికలకు వెళ్లినప్పటికీ, ఓటర్లు మాత్రం స్థానిక సమస్యలకే పెద్దపీట వేశారు. పెరిగిన జీవన వ్యయం, ఆర్థిక వ్యవస్థ మందగమనం , సంక్షేమ పథకాల అమలు వంటి అంశాలు ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేశాయి. వీటితో పాటు పంది మాంసం పెంపకం వల్ల తాగునీటిలో పెరుగుతున్న పురుగుమందుల మోతాదు వంటి పర్యావరణ ఆందోళనలు కూడా ప్రధాన ప్రచారాంశాలుగా నిలిచాయి. ఫలితాల తర్వాత ఫ్రెడరిక్సెన్ తన ఓటు బ్యాంకు తగ్గడంపై విచారం వ్యక్తం చేసినప్పటికీ, తన బాధ్యతలను కొనసాగించడానికి సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. రాబోయే కొద్ది రోజుల్లో సాగే రాజకీయ సంప్రదింపుల తర్వాతే డెన్మార్క్ కొత్త ప్రభుత్వంపై స్పష్టత రానుంది.

# అతడు ఆత్మహత్య చేసుకోలేదు!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన అమెరికన్ సెక్స్ అఫెండర్ జెఫ్రీ ఎప్స్టీన్ అకృత్యాలపై ఇన్నాళ్లూ మౌనంగా ఉన్న బాధితులు ఇప్పుడు గొంతు విప్పుతున్నారు. బీబీసీ న్యూస్‌నైట్ ప్రతినిధి విక్టోరియా డెర్బీషైర్ సమక్షంలో ఐదుగురు సర్వైవర్లు తొలిసారి ఒకే వేదికపైకి వచ్చి తమ చేదు జ్ఞాపకాలను పంచుకున్నారు. అమెరికా ప్రభుత్వం విడుదల చేసిన లక్షలాది ఫైళ్లలో పొరపాటున తమ పేర్లు బహిరంగం కావడంతో, ఇక దాచడానికి ఏమీ లేదని భావించి వారు ధైర్యంగా ముందుకు వచ్చారు. "ఇంతకాలం అణచివేతతో ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరి అయ్యాను, ఇప్పుడు నిజం చెప్పడం ద్వారా నేను స్వేచ్ఛగా శ్వాస తీసుకోగలను," అంటూ జోవన్నా హారిసన్ అనే బాధితురాలు కన్నీటి పర్యంతమయ్యారు. ఆమె 18 ఏళ్ల వయసులో ఎప్స్టీన్ చేతిలో చిక్కుకున్నారని, మసాజ్ పేరుతో మొదలైన ఆ వేధింపులు చివరకు అత్యాచారానికి దారితీశాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ చర్చలో మరో బాధితురాలు చాంటే డేవిస్ ఎప్స్టీన్ ప్రైవేట్ విమానంలో మాజీ అధ్యక్షుడు బిల్ క్లింటన్, నటుడు కెవిన్ స్పేసీలతో కలిసి చేసిన ఆఫ్రికా పర్యటనకు సంబంధించిన ఫోటోలను బయటపెట్టారు. ఒక విమానాశ్రయంలో ఇంధనం నింపుకుంటున్న



సమయంలో బిల్ క్లింటన్‌కు తాను మసాజ్ చేసిన విషయాన్ని ఆమె గుర్తు చేసుకున్నారు. ఎప్స్టీన్ సాగిస్తున్న అరాచకాల గురించి అప్పట్లో క్లింటన్‌కు ఎందుకు చెప్పలేదన్న ప్రశ్నకు సమాధానమిస్తూ, తాను ఎవరికీ చెప్పుకోలేని భయంకరమైన స్థితిలో ఉన్నానని, చెప్పినా ఆయన ఆపగలిగేవారా అనే సందేహం ఉండేదని ఆమె పేర్కొన్నారు. బిల్ క్లింటన్ మాత్రం తాను ఎప్స్టీన్ తప్పుడు పనులను ఎప్పుడూ చూడలేదని స్పష్టం చేసినప్పటికీ, ఆయన పేరు ఎప్స్టీన్ ఫైళ్లలో వందల సార్లు రావడం గమనార్హం. న్యూ మెక్సికోలోని ఎప్స్టీన్‌కు చెందిన 'జోరో రాంచ్', ప్రైవేట్ ద్వీపం 'లిటిల్ సెయింట్ జేమ్స్'లో తాము ఎదుర్కొన్న భయానక వాతావరణాన్ని బాధితులు వివరించారు. ఆ ప్రాంతాలు అత్యంత భయంకరంగా, నిశ్శబ్దంగా ఉండేవని, అక్కడ తాము బందీలుగా ఉన్నట్లు అనిపించేదని వారు చెప్పారు. బాధితురాలు లిసా ఫిలిప్స్ మాట్లాడుతూ, ఎప్స్టీన్ తనకున్న ప్రముఖుల సంబంధాల గురించి గొప్పలు చెప్పుకునేవాడని, వారి బలహీనతలను తెలుసుకోవడం ద్వారా వారిని తన గుప్పిట్లో ఉంచుకోవడం అతడికి ఇష్టమని వెల్లడించారు. 2003లో తన స్నేహితురాలిని బ్రిటిష్ రాజకుటుంబీకుడు ఆండ్రూ (మౌంట్‌బాటన్‌విండ్సర్)తో లైంగిక సంబంధం పెట్టుకోవాలని ఎప్స్టీన్ బలవంతం చేశాడని ఆమె సంచలన ఆరోపణ చేశారు. 2019లో జైలు గదిలో ఎప్స్టీన్ శవమై కనిపించడంపై బాధితులు ముక్తకంఠంతో అనుమానాలు వ్యక్తం చేశారు. అధికారుల నివేదిక ప్రకారం అది ఆత్మహత్య అని తేలినప్పటికీ, "మాకు అతడి గురించి తెలుసు, అతడు అస్సలు ఆత్మహత్య చేసుకునే వ్యక్తి కాదు," అని వారు ఖచ్చితంగా చెప్పారు. తమ గుట్టు ఎక్కడ బయటపడుతుందోనన్న భయంతోనే శక్తివంతులైన వ్యక్తులు ఎవరైనా అతడిని అంతం చేసి ఉండవచ్చని వారు అనుమానం వ్యక్తం చేశారు. 14 ఏళ్ల చిన్న ప్రాయంలోనే ఎప్స్టీన్ చేతిలో చిక్కుకున్న జెనాలిసా జోన్స్, వెండి పెసాంటేలు తమ చిన్ననాటి ఫోటోలను చూసుకుంటూ విలపించారు. "ఆ రోజుల్లో మా నవ్వులో ఉన్న స్వచ్ఛత ఇప్పుడు లేదు, ఎప్స్టీన్ మా అమాయకత్వాన్ని , భవిష్యత్తును కాలరాశాడు," అని వారు కన్నీరు మున్నీరయ్యారు.


# మానవ చరిత్రలోనే అతిపెద్ద నేరం 'బానిసత్వం'

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

మానవ చరిత్రలోనే అత్యంత భయంకరమైన నేరంగా పరిగణించబడే బానిసత్వంపై ఘనా దేశం ఐక్యరాజ్యసమితి వేదికగా కీలక పోరాటానికి దిగింది. అట్లాంటిక్ మీదుగా సాగిన బానిస వ్యాపారాన్ని "మానవాళికి వ్యతిరేకంగా జరిగిన అత్యంత ఘోరమైన నేరం,"గా గుర్తించాలని కోరుతూ ఘనా విదేశాంగ మంత్రి శామ్యూల్ ఒకుడ్జెటో అబ్లాక్వా ఐరాస సర్వప్రతినిధి సభలో చారిత్రాత్మక తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ తీర్మానం ద్వారా బానిస వ్యాపారానికి బాధ్యత వహిస్తూ సంబంధిత దేశాలు అధికారికంగా క్షమాపణలు చెప్పాలని, బాధితుల సంక్షేమం కోసం ప్రత్యేక 'పరిహార నిధి'ని ఏర్పాటు చేయాలని ఘనా డిమాండ్ చేస్తోంది. చారిత్రక వాస్తవాలను పరిశీలిస్తే, 1500 నుంచి 1800 సంవత్సరాల మధ్య కాలంలో ఆఫ్రికా నుంచి సుమారు 1.2 కోట్ల నుంచి 1.5 కోట్ల మందిని బంధించి అమానవీయ



రీతిలో అమెరికా ఖండాలకు తరలించారు. ఈ దారుణ ప్రయాణంలోనే 20 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారని అంచనా. ఈ నేపథ్యంలో, ఆఫ్రికా నాయకులు కేవలం వ్యక్తిగత లాభం కోసం కాకుండా, బాధితులకు న్యాయం జరిగేలా విద్యా నిధులు , నైపుణ్య శిక్షణ నిధుల రూపంలో మద్దతును కోరుతున్నారు. అంతేకాకుండా, వలస పాలన కాలంలో ఆఫ్రికా దేశాల నుంచి దోచుకెళ్లిన అమూల్యమైన కళాఖండాలను, వారసత్వ సంపదను తిరిగి తమ దేశాలకు అప్పగించాలని ఈ తీర్మానం గట్టిగా కోరుతోంది. అయితే, ఈ తీర్మానానికి బ్రిటన్ వంటి అభివృద్ధి చెందిన దేశాల నుండి తీవ్ర ప్రతిఘటన ఎదురయ్యే అవకాశం కనిపిస్తోంది. గతంలో జరిగిన చారిత్రక తప్పిదాలకు నేటి ప్రభుత్వాలను లేదా సంస్థలను బాధ్యులను చేయలేమని, అందువల్ల పరిహారాలు చెల్లించే ప్రసక్తే లేదని బ్రిటన్ వంటి దేశాలు వాదిస్తున్నాయి. అయినప్పటికీ, ఆఫ్రికన్ యూనియన్ మద్దతుతో ఘనా ఈ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఘనా అధ్యక్షుడు జాన్ డ్రమని మహామ ఈ తీర్మానాన్ని భవిష్యత్తు తరాలు గత అన్యాయాలను మర్చిపోకుండా ఉండటానికి ఒక "చారిత్రక భద్రతా కవచం"గా అభివర్ణించారు. ఐరాసలో త్వరలో జరగబోయే ఓటింగ్ ఈ సుదీర్ఘ పోరాటంలో ఒక కీలక మలుపు కానుంది.




## ఆస్ట్రేలియా మీడియాలో అలజడి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

ఆస్ట్రేలియా జాతీయ ప్రసార సంస్థ 'ఆస్ట్రేలియన్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్' (ఏబీసీ) లో బుధవారం వందలాది మంది జర్నలిస్టులు విధులు బహిష్కరించి భారీ సమ్మెకు దిగడం అంతర్జాతీయ మీడియాలో కలకలం రేపింది. గత 20 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఏబీసీ సిబ్బంది ఇలా రోడ్లపైకి రావడం ఇదే తొలిసారి. పెరిగిన జీవన వ్యయానికి అనుగుణంగా జీతాల పెంపు లేకపోవడం, పని పరిస్థితులు దిగజారడం వంటి కారణాలతో పాటు, భవిష్యత్తులో తమ స్థానాలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) తో భర్తీ చేస్తారనే భయాందోళనలు ఈ నిరసనకు ప్రధాన కారణమయ్యాయి.ఈ సమ్మె ప్రభావంతో ఏబీసీలో అత్యంత ప్రజాదరణ పొందిన '7.30 ఈవినింగ్ కరెంట్ అఫైర్స్' , 'బ్రేక్‌ఫాస్ట్ షో' వంటి ప్రతిష్టాత్మక కార్యక్రమాలు నిలిచిపోయాయి. దాదాపు 4,400 మంది ఉద్యోగులు ఉన్న ఈ సంస్థలో సుమారు 2,000 మంది వార్తా విభాగంలోనే పనిచేస్తుండటంతో, వారి గైర్హాజరీ వల్ల మేనేజ్‌మెంట్ పాత ప్రోగ్రామ్‌లు , బీబీసీ కంటెంట్‌తో ప్రసారాలను కొనసాగించాల్సి వచ్చింది. యాజమాన్యం ప్రతిపాదించిన మూడేళ్లలో 10% జీతాల పెంపును 60% మంది యూనియన్ సభ్యులు తిరస్కరించారు, ఎందుకంటే ప్రస్తుత 3.8% ద్రవ్యోల్బణంతో పోలిస్తే ఈ పెంపు చాలా తక్కువని వారు వాదిస్తున్నారు.జీతాలతో పాటు, జర్నలిస్టుల స్థానంలో ఏఐని వాడబోమని యాజమాన్యం స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంపై సిబ్బందిలో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. సిడ్నీ, మెల్‌బోర్న్ కార్యాలయాల వెలుపల నలుపు రంగు దుస్తులు ధరించి నిరసన తెలిపిన జర్నలిస్టులు, తమ కెరీర్ భద్రతపై ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా స్వల్పకాలిక కాంట్రాక్టులపై పనిచేస్తున్న యువ జర్నలిస్టులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఏబీసీ మేనేజింగ్ డైరెక్టర్ హ్యూ మార్క్స్ ఈ ఆఫర్‌ను సమర్థించుకున్నప్పటికీ, పరిస్థితిని చక్కదిద్దేందుకు యాజమాన్యం ప్రస్తుతం ఆస్ట్రేలియా పనివేదికల ట్రిబ్యునల్ ను ఆశ్రయించింది. మరోవైపు, ప్రతిపక్ష నేతలు ఈ సమ్మెను విమర్శిస్తూ, దేశానికి సమాచారం అవసరమైన సమయంలో ఇలా చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు.



## ఆఫ్రికాను చుట్టుముట్టిన ఇంధన సెగ

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**

పశ్చిమాసియాలో ఇరాన్ ,ఇజ్రాయెల్ మధ్య నెలకొన్న యుద్ధ మేఘాలు ఆఫ్రికా ఖండంపై తీవ్రమైన ఇంధన సంక్షోభాన్ని మోసుకొచ్చాయి. ప్రపంచ చమురు సరఫరాలో అత్యంత కీలకమైన 'స్ట్రెయిట్ ఆఫ్ హార్మూజ్' మార్గంలో ఉద్రిక్తతలు పెరగడంతో చమురు ,ఎల్.ఎన్.జి రవాణాకు తీవ్ర అంతరాయం కలిగింది. దీనివల్ల దిగుమతులపై ఆధారపడే పలు ఆఫ్రికా దేశాల్లో చమురు నిల్వలు ప్రమాదకర స్థాయికి పడిపోయాయి. ముఖ్యంగా మారిషస్ ప్రభుత్వం తమ దేశంలో ఇంధన నిల్వలు కేవలం 15 నుండి 20 రోజులకు మాత్రమే సరిపోతాయని ప్రకటించడమే కాకుండా, విద్యుత్ వినియోగంపై కఠినమైన ఆంక్షలు విధించింది. స్విమ్మింగ్ పూల్ హీటింగ్, ఫౌంటైన్లు , అలంకార దీపాలు వంటి అనవసర అవసరాలకు విద్యుత్ వాడకాన్ని నిలిపివేయాలని ఆదేశించింది. మరోవైపు దక్షిణ సూడాన్ రాజధాని జూబాలో ఇంధన కొరత కారణంగా ఇప్పటికే విద్యుత్ రేషనింగ్ ప్రారంభమవగా, నైజీరియా వంటి పెద్ద దేశాల్లో కూడా ఆందోళన వ్యక్తమవుతోంది. ఆఫ్రికా కుబేరుడు అలికో డాంగోటే ఈ పరిస్థితిపై స్పందిస్తూ, యుద్ధం ఇలాగే కొనసాగితే ఇంధన పొదుపు కోసం కోవిడ్ కాలం నాటి 'వర్క్ ఫ్రమ్ హోమ్' నిబంధనలను మళ్ళీ అమలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉగాండా, కెన్యా వంటి దేశాల్లో కూడా పెట్రోల్, డీజిల్ నిల్వలు మూడు వారాలకు మించి లేవని ప్రభుత్వ గణాంకాలు చెబుతున్నాయి. కెన్యాలో ఇప్పటికే 20 శాతం ఇంధన రిటైల్ కేంద్రాల్లో స్టాక్ లేకపోవడం గమనార్హం. దక్షిణాఫ్రికాలో పరిస్థితి మరికొంత భిన్నంగా ఉంది. అక్కడ సరఫరా కంటే కూడా ఏప్రిల్ నెలలో ఇంధన ధరలు భారీగా పెరుగుతాయనే భయంతో వినియోగదారులు పెద్ద ఎత్తున కొనుగోళ్లు జరుపుతున్నారు. రైతులు , భారీ పరిశ్రమలు తమ సాధారణ కోటా కంటే ఎక్కువ నిల్వలు చేసుకుంటుండటంతో మార్కెట్లో 'కృత్రిమ డిమాండ్' ఏర్పడి డీజిల్ కొరత కనిపిస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధరలు ఆకాశాన్నంటుతుండటంతో ఆఫ్రికా దేశాల ఆర్థిక వ్యవస్థలు అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. పశ్చిమాసియాలో శాంతి నెలకొంటేనే తప్ప ఆఫ్రికా ఖండంలో ఈ ఇంధన చీకట్లు తొలగే అవకాశం లేదని స్పష్టమవుతోంది.

## వెస్ట్ బ్యాంక్‌లో సెటిలర్ల హింస

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్) :**



వెస్ట్ బ్యాంక్‌లో పాలస్తీనా ప్రజలను వారి సొంత భూముల నుంచి వెళ్లగొట్టేందుకు ఇజ్రాయెల్ సెటిలర్లు సాగిస్తున్న హింస ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. ఇప్పటివరకు కేవలం ఇజ్రాయెల్ పూర్తి నియంత్రణలో ఉన్న 'ఏరియాసి' పైనే దృష్టి పెట్టిన సెటిలర్లు, ఇప్పుడు పాలస్తీనా పౌర అధికారాలు ఉన్న 'ఏరియాబి' లోని గ్రామాలను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని ఐక్యరాజ్యసమితి మానవతా విభాగం హెచ్చరిస్తోంది. 1993 ఓస్లో శాంతి ఒప్పందాల ప్రకారం వెస్ట్ బ్యాంక్‌ను విభజించినప్పటికీ, ప్రస్తుత పరిణామాలు ఆ ఒప్పందాల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని, ఇది కేవలం కొంతమంది వ్యక్తుల అల్లరి కాదని, పైస్థాయి నుంచి జరుగుతున్న ఒక పక్కా వ్యూహమని అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి గణాంకాల ప్రకారం, జనవరి 2023 నుండి ఫిబ్రవరి 2026 మధ్య కాలంలో సుమారు 4,765 మంది పాలస్తీనీయులు సెటిలర్ల హింస కారణంగా నిరాశ్రయులయ్యారు. ప్రధానంగా బెడౌయిన్ , పశుపోషక సంఘాలకు చెందిన వారు 97 ప్రాంతాల నుండి వెళ్లగొట్టబడ్డారు. ఈ ఏడాది ప్రారంభంలో ఒక్క రాస్ ఐన్ అల్‌ఔజా గ్రామం నుండే 600 మందిని బలవంతంగా ఖాళీ చేయించారు. ఏరియాసిలో పాలస్తీనా వర్గాలను ఖాళీ చేయించిన తర్వాత, సెటిలర్లు ఇప్పుడు పశ్చిమ దిశగా ఏరియాబి వైపు అడుగులు వేస్తున్నారని, ఈ భూభాగాలను ఇజ్రాయెల్‌లో విలీనం చేసుకోవడమే దీని ప్రధాన ఉద్దేశమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామాల వెనుక ఇజ్రాయెల్ అతివాద ఆర్థిక మంత్రి బెజలెల్ స్మోట్రిచ్ కీలక సూత్రధారిగా ఉన్నట్లు తెలుస్తోంది. స్వయంగా సెటిలర్ అయిన ఆయన, పాలస్తీనా రాజ్యం అనే ఆలోచననే లేకుండా చేయాలని బహిరంగంగానే ప్రకటించారు. ఆయన హయాంలో సుమారు 69 కొత్త సెటిల్‌మెంట్లు ఆమోదం పొందడం గమనార్హం.

# గ్యాస్ కొరత లేదు.. వదంతులు నమ్మొద్దు



అమరావతి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని, సోషల్ మీడియాలో వస్తున్న అవాస్తవ ప్రచారాలను నమ్మి ప్రజలు ఆందోళన చెందవద్దని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వదంతుల కారణంగా కొందరు ముందుజాగ్రత్తగా బుకింగ్‌లు చేస్తున్నారని, దీనివల్ల అనవసరమైన గందరగోళం ఏర్పడుతోందని ఆయన పేర్కొన్నారు. గ్యాస్ పంపిణీలో పారదర్శకత పెంచేందుకు వన్ టైమ్ పాస్‌వర్డ్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సిలిండర్లను బ్లాక్ మార్కెట్‌లో విక్రయించే వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతోందని, ఇప్పటివరకు ఇలాంటి అక్రమాలకు సంబంధించి 800 కేసులు నమోదు చేసి, 3,540 సిలిండర్లను సీజ్ చేసినట్లు వెల్లడించారు. పట్టణ ప్రాంతాల్లోని వినియోగదారుల సౌకర్యార్థం ఎల్పీజీ నుంచి పైప్డ్ నాచురల్ గ్యాస్ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. దీనికోసం త్వరలోనే కొత్త పాలసీని తీసుకురానున్నామని, ఆసక్తి గల పట్టణ వాసులు పైప్డ్ గ్యాస్ కోసం నమోదు చేసుకోవాలని మంత్రి సూచించారు. గ్యాస్ వినియోగాన్ని తగ్గించేలా సోలార్ మరియు ఇండక్షన్ కుకింగ్ స్టవ్‌ల వాడకాన్ని ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. అర్హత లేని వారి చేతుల్లోకి సిలిండర్లు వెళ్లకుండా చూడటం తమ బాధ్యతని, బ్లాక్ మార్కెటింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. వాణిజ్య అవసరాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గ్యాస్ సరఫరాను పెంచిందని, దీనివల్ల హోటళ్లు, రెస్టారెంట్లు మరియు విద్యాసంస్థలకు ఇబ్బంది లేకుండా సరఫరా అందుతుందని నాదెండ్ల మనోహర్ తెలిపారు. గ్యాస్‌తో పాటు రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ నిల్వలు కూడా పుష్కలంగా ఉన్నాయని, ఎక్కడా ఇంధన కొరత లేదని ఆయన భరోసా ఇచ్చారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే గ్యాస్ ఏజెన్సీలపై నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పౌర సరఫరాల శాఖ అప్రమత్తంగా ఉందని మంత్రి స్పష్టం చేశారు.



# బీసీ హాస్టళ్లలో వసతులపై మంత్రి సవిత సీరియస్

అమరావతి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలోని బీసీ హాస్టళ్ల రూపురేఖలను మార్చి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్. సవిత స్పష్టం చేశారు. సచివాలయంలో అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మరో రెండు నెలల్లో నూతన విద్యా సంవత్సరం ప్రారంభం కానున్న నేపథ్యంలో హాస్టళ్లలో పెండింగ్‌లో ఉన్న మౌలిక సదుపాయాల పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. ముఖ్యంగా విద్యార్థులు హాస్టళ్లలోకి ప్రవేశించే నాటికి మరుగుదొడ్ల నిర్మాణం పూర్తి కావాలని, తాగునీటి ఇబ్బందులు లేకుండా ప్రతి హాస్టల్‌లో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. విద్యార్థుల ఆరోగ్య భద్రతకు పెద్దపీట వేస్తూ హాస్టళ్లలో దోమల బెడద లేకుండా కిటికీలు, ద్వారాలకు మెష్‌లు ఏర్పాటు చేయాలని మంత్రి సూచించారు. నాణ్యమైన ఆహారంతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యను అందించడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశయమని ఆమె పేర్కొన్నారు. ఇందులో భాగంగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్తగా 10 మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలలను అందుబాటులోకి తీసుకురావాలని, ఇందుకోసం తక్షణమే అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఏ ఒక్క బీసీ బిడ్డ కూడా చదువుకు దూరం కాకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమని వెల్లడించారు. బీసీల ఆర్థికాభివృద్ధికి ఉద్దేశించిన 'ఆదరణ 3.0' పథకం అమలు తీరును కూడా మంత్రి ఈ సందర్భంగా సమీక్షించారు. రాబోయే విద్యా సంవత్సరంలో బీసీ హాస్టళ్లలో విద్యార్థుల నమోదును మరింత పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. బీసీల విద్యకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని, నిధుల కొరత లేకుండా చూస్తామని భరోసా ఇచ్చారు. ఈ ఉన్నత స్థాయి సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్. సత్యనారాయణ, ఎంజేపీ స్కూళ్ల కార్యదర్శి మాధవీలతతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొని పనుల పురోగతిని వివరించారు.

# ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె వివాహ వేడుక



గుంటూరు(ఏడీఎన్ఎన్) :

గుంటూరు జిల్లా పొన్నూరు ఎమ్మెల్యే, తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత ధూళిపాళ్ల నరేంద్ర కుమార్తె నాగసాయి వైదీప్తి వివాహం కెవిన్ రామ్‌తో బుధవారం అత్యంత వైభవంగా జరిగింది. గుంటూరులోని శ్రీ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ఒకే వేదికపై ఇద్దరు ముఖ్యమంత్రులు కలిసి నూతన వధూవరులను ఆశీర్వదించడం ఈ వివాహ వేడుకలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ శుభకార్యానికి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజుతో పాటు మంత్రులు నారా లోకేష్, పయ్యావుల కేశవ్, వంగలపూడి అనిత, గుమ్మడి సంధ్యారాణి, సవిత వంటి కీలక నేతలు హాజరయ్యారు. వీరందరూ వధూవరులకు శుభాకాంక్షలు తెలిపి, ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుటుంబ సభ్యులతో కొద్దిసేపు ముచ్చటించారు. ముఖ్యమంత్రులు, మంత్రుల రాకతో కన్వెన్షన్ సెంటర్ పరిసరాల్లో భారీ భద్రత మధ్య సందడి నెలకొంది. వీరితో పాటు ఉభయ రాష్ట్రాలకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఇతర రాజకీయ ప్రముఖులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. రాజకీయాలకు అతీతంగా పలువురు నేతలు ఈ వేడుకలో పాల్గొని నూతన దంపతులను దీవించారు.

# అబద్ధాలు చెప్పడం జగన్‌కు అలవాటే!

అమరావతి (ఏడీఎన్ఎన్) :



రాష్ట్రానికి వస్తున్న భారీ పరిశ్రమల విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలపై ఏపీ మంత్రులు అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అమరావతిలో బుధవారం మీడియాతో మాట్లాడిన మంత్రులు.. జగన్ 'క్రెడిట్ దోపిడీ' చేస్తున్నారని విమర్శించారు. ఉత్తరాంధ్ర దశ మార్చనున్న మిత్తల్ ప్లాంట్: మంత్రి అనగాని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిత్తల్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటుతో ఉత్తరాంధ్ర ప్రాంతం త్వరలోనే భారీ ఇండస్ట్రియల్ హబ్‌గా మారబోతోందని ధీమా వ్యక్తం చేశారు. ఈ ప్రాజెక్టు రాష్ట్రానికి రావడానికి మంత్రి నారా లోకేశ్ చేసిన నిరంతర కృషి మరియు పట్టుదలే ప్రధాన కారణమని ఆయన స్పష్టం చేశారు. "మొన్న గూగుల్ డేటా సెంటర్, నేడు మిత్తల్ స్టీల్ ప్లాంట్.. ఇలా ఏ మంచి జరిగినా అది తన వల్లే జరిగిందంటూ జగన్ అబద్ధాలు చెబుతున్నారు. లోకేశ్‌కు మంచి పేరు రావడం చూసి జగన్ సహించలేకపోతున్నారు. ఈ స్టీల్ ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్షన్నర మంది యువతకు ఉపాధి లభించనుంది," అని మంత్రి అనగాని పేర్కొన్నారు. మాట తప్పి.. మడమ తిప్పింది జగనే: మంత్రి గొట్టిపాటి మరోవైపు ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ జగన్ పాలనపై విమర్శలు గుప్పించారు. గత ఐదేళ్లలో వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, రాష్ట్ర ఆస్తులను కొల్లగొట్టడం తప్ప జగన్ చేసిందేమీ లేదని దుయ్యబట్టారు. "మాట తప్పను.. మడమ తిప్పను అని చెప్పి, అధికారంలోకి వచ్చాక ప్రతి విషయంలోనూ మాట తప్పిన వ్యక్తి జగన్," అని విమర్శించారు. మద్యనిషేధం హామీ ఇచ్చి కల్తీ మద్యంతో రాష్ట్రాన్ని దోచుకున్నారని, ఇసుక దోపిడీతో నీటిపారుదల రంగాన్ని సర్వనాశనం చేశారని మండిపడ్డారు. 'తల్లికి వందనం' పథకాన్ని ఒక బిడ్డకే పరిమితం చేసి ప్రజలను మోసం చేశారని, కానీ తమ ప్రభుత్వం వచ్చాక గుండ్లకమ్మ వంటి ప్రాజెక్టులను బాగు చేసి రైతులకు అండగా నిలుస్తోందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు.

# కూటమి పాలనలో అధికారులపై కక్ష సాధింపు..

తాడేపల్లి (ఏడీఎన్ఎన్) :




నిఘా కంటే 'ఇంటి చాడీలకే' బాబు ప్రాధాన్యం

రాష్ట్రంలో చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను వేధిస్తోందని వైసీపీ ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ తీవ్రంగా మండిపడ్డారు. తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ అప్రజాస్వామిక విధానాలను ఎండగట్టారు. మాజీ సీఎస్ జవహర్ రెడ్డి నెల్లూరు వెళ్లకపోయినా, ఆయన ఐఏఎస్ అధికారులతో భేటీ అయ్యారని ఎల్లో మీడియాలో వచ్చిన తప్పుడు వార్తలను నమ్మి నీలకంఠారెడ్డి వంటి అధికారులను బదిలీ చేయడం దుర్మార్గమని చంద్రశేఖర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఇంటెలిజెన్స్ నివేదికల కంటే ఇంటి చాడీలకే ఈ ప్రభుత్వం ఎక్కువ విలువనిస్తోంది. అసలు జరగని మీటింగ్ గురించి ప్రభుత్వం ఎందుకు అంతలా ఉలిక్కిపడుతోంది?" అని ఆయన ప్రశ్నించారు. పీఎస్ ఆర్ ఆంజనేయులు, పీవీ సునీల్ కుమార్ వంటి పలువురు సమర్థులైన అధికారులను గత ప్రభుత్వంలో పనిచేశారన్న నెపంతో వేధించడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు వద్ద పనిచేసిన అధికారులను కూడా గౌరవించి, వారికి ఉన్నతమైన బాధ్యతలు అప్పగించామని ఎమ్మెల్యే గుర్తు చేశారు. ప్రవీణ్ ప్రకాష్, కృష్ణబాబు, గిరిధర్ వంటి అధికారుల సేవలను హుందాగా వినియోగించుకున్నామే తప్ప, ఎక్కడా కక్ష సాధింపులకు పాల్పడలేదని స్పష్టం చేశారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం అధికారులను టిష్యూ పేపర్లలా వాడుకుంటూ బ్యూరోక్రసీని బలిపశువును చేస్తోందని ఆరోపించారు. 151 కి పైగా సంఖ్యాబలం ఉన్నా చంద్రబాబులో అభద్రతాభావం కనిపిస్తోందని, లోకేష్ లేదా పవన్ కళ్యాణ్ వెన్నుపోటు పొడుస్తారనే భయం ఆయనలో ఉందేమోనని చంద్రశేఖర్ ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతి గడపకూ కక్షా రాజకీయాన్ని పరిచయం చేసిందని విమర్శించారు. అనుభవం ఉన్న అధికారులను అణగదొక్కుతూ, తమకు అడుగులకు మడుగులు వత్తే వారికే ప్రాధాన్యం ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఫుడ్ సేఫ్టీ అధికారి పూర్ణచంద్రరావు అతి ప్రవర్తనను నీలకంఠారెడ్డి ఖండించారని, అయితే పూర్ణచంద్రరావు వెనుక మంత్రి లోకేష్ ఉండటంతోనే నీలకంఠారెడ్డిపై జులుం ప్రదర్శించి బదిలీ చేశారని చంద్రశేఖర్ ఆరోపించారు. సీఎం, డిప్యూటీ సీఎం, లోకేష్ ముగ్గురూ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

# కర్నూలు జిల్లాలో భారీ అగ్నిప్రమాదం

కర్నూలు (ఏడీఎన్ఎన్) :



కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలంలో బుధవారం ఘోర అగ్నిప్రమాదం సంభవించింది. మండల కేంద్రానికి సమీపంలోని జైరాజ్ స్టీల్ ప్లాంట్‌లో భారీ పేలుడు శబ్దంతో మంటలు చెలరేగాయి. నిమిషాల వ్యవధిలోనే మంటలు ప్లాంట్ అంతటా వేగంగా వ్యాపించడంతో కార్మికులు, స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ప్రమాద సమయంలో ప్లాంట్ ప్రాంగణం మొత్తం గందరగోళంగా మారింది. ప్రమాదం జరిగిన వెంటనే ప్లాంట్ నుంచి భారీ ఎత్తున నల్లటి పొగ వెలువడింది. ఈ దట్టమైన పొగ కిలోమీటర్ల మేర ఆకాశంలోకి ఎగిసిపడటంతో పాటు, సమీపంలోని ఓర్వకల్లు మరియు గుట్టపాడు గ్రామాలను పూర్తిగా కమ్మేసింది. దీంతో ఆయా గ్రామాల్లో వాయు కాలుష్యం ఒక్కసారిగా పెరిగిపోయింది. విషపూరితమైన పొగ కారణంగా గ్రామస్తులు ఊపిరి పీల్చుకోవడానికి ఇబ్బంది పడుతూ ఉక్కిరిబిక్కిరి అయ్యారు. పరిస్థితి భయానకంగా ఉండటంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి సాహసించలేకపోయారు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలను అదుపు చేసేందుకు తీవ్రంగా శ్రమిస్తున్నారు. ప్రస్తుతం ప్లాంట్ వద్ద సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ ప్రమాదానికి గల కారణాలు మరియు ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ప్రాణనష్టంపై ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

# జనసేన నుంచి బొలిశెట్టి ఔట్ ...!

మంగళగిరి (ఏడీఎన్ఎన్) :



ఆంధ్రప్రదేశ్ అధికార కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న జనసేన పార్టీలో అనూహ్య పరిణామం చోటుచేసుకుంది. పార్టీ సీనియర్ నేత, పర్యావరణ విభాగంలో చురుగ్గా పనిచేస్తున్న బొలిశెట్టి సత్యనారాయణపై జనసేన అధిష్టానం వేటు వేసింది. ఆయనకు పార్టీతో ఇకపై ఎలాంటి సంబంధం లేదని జనసేన అధికారికంగా ఒక ప్రకటనలో గురువారం ప్రకటించింది. పర్యావరణ పరిరక్షణ, మానవ హక్కుల కోసం ఆయన చేస్తున్న వరుస పోరాటాలు, కూటమి ప్రభుత్వ నిర్ణయాలపై ఆయన సంధిస్తున్న ప్రశ్నలే ఈ ఉద్వాసనకు ప్రధాన కారణమని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ముఖ్యంగా కొల్లేరు ప్రాజెక్టులో ₹2,952 కోట్లతో చేపట్టనున్న పనులు అశాస్త్రీయమని, అవి కేవలం కాంట్రాక్టర్ల లాభం కోసమేనని ఆయన చేసిన విమర్శలు పార్టీలో కలకలం రేపాయి. విశాఖలోని పావురాల కొండ పర్యావరణ విధ్వంసం, కొల్లేరు ఆక్రమణల విషయంలో బొలిశెట్టి సత్యనారాయణ గట్టిగా గొంతు వినిపిస్తూ వచ్చారు. కూటమి ప్రభుత్వంలో పవన్ కళ్యాణ్ పర్యావరణ శాఖ మంత్రిగా ఉన్నప్పటికీ, క్షేత్రస్థాయిలో జరుగుతున్న పరిణామాలపై బొలిశెట్టి బహిరంగంగానే అసంతృప్తి వ్యక్తం చేశారు. కూటమి మర్యాదను కాపాడటం కోసం, ప్రభుత్వ నిర్ణయాలకు వ్యతిరేకంగా వెళ్తున్నారనే కారణంతో జనసేన ఈ దిద్దుబాటు చర్యలకు దిగినట్లు తెలుస్తోంది. పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం అటు రాజకీయ వర్గాల్లోనూ, ఇటు పర్యావరణ ప్రేమికుల్లోనూ పెద్ద చర్చకు దారితీసింది. పార్టీ నుండి వేటు పడినప్పటికీ బొలిశెట్టి సత్యనారాయణ ఎంతో హుందాగా స్పందించారు. పర్యావరణ పరిరక్షణ కోసం దేశ స్థాయిలో మరింత చురుగ్గా పనిచేయాలనే తన అభ్యర్థనను మన్నించి, తనను బాధ్యతల నుండి విముక్తుడిని చేసినందుకు పవన్ కళ్యాణ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ పరంగా దూరమైనా సిద్ధాంతాల పరంగా అనుబంధం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. కొల్లేరు రక్షణ, భూ నిర్వాసితుల సమస్యలపై పవన్ కళ్యాణ్ పర్యావరణ మంత్రిగా చొరవ చూపాలని కోరుతూనే, ఇకపై తాను పూర్తిస్థాయిలో ప్రజా ఉద్యమాల వైపు అడుగులు వేయబోతున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

# బోట్ల చోరీ వెనుక టీడీపీ నేతలు, పోలీసుల హస్తం

నెల్లూరు (ఏడీఎన్ఎన్) :



నెల్లూరు జిల్లాలో పోలీసుల ఆధీనంలో ఉన్న బోట్లు మాయమవ్వడంపై మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డి కూటమి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. నెల్లూరులో బుధవారం మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ఆయన, ఈ చోరీ వెనుక అధికార పార్టీ నేతలు మరియు పోలీసుల ప్రమేయం ఉందని తీవ్రస్థాయిలో ఆరోపించారు. స్థానిక మత్స్యకారులు తమ ప్రాణాలకు తెగించి తమిళనాడుకు చెందిన బోట్లను పట్టుకుని పోలీసులకు అప్పగించారని కాకాణి గుర్తుచేశారు. ఈ ఘటనపై బిట్రగుంట, కావలి రూరల్ పోలీస్ స్టేషన్లలో కేసులు కూడా నమోదయ్యాయని తెలిపారు. "పోలీసుల పహారాలో ఉండాల్సిన బోట్లు ఎలా మాయమయ్యాయి? దీనిపై ప్రభుత్వం ఇప్పటివరకు ఎందుకు చర్యలు తీసుకోలేదు? సంబంధిత అధికారులపై వేటు వేయకపోవడానికి కారణమేంటి?," అని ఆయన నిలదీశారు. బోట్ల చోరీ వెనుక తెలుగుదేశం పార్టీ నేతల హస్తం ఉందని, వారిని కాపాడటానికే ప్రభుత్వం మౌనంగా ఉందని కాకాణి విమర్శించారు. మంత్రులు జిల్లాకు ఎందుకు వస్తున్నారో, అధికారులకు ఏం ఆదేశాలు ఇస్తున్నారో అర్థం కావడం లేదని ఎద్దేవా చేశారు. తమిళనాడులో ఉన్న ఆ బోట్లను వెంటనే వెనక్కి తీసుకువచ్చి జువ్వలదిన్నె హార్బర్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఫిషింగ్ హార్బర్ల ప్రైవేటీకరణ ప్రయత్నాలతో పాటు, ఈ బోట్ల చోరీ ఉదంతంపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని కాకాణి వెల్లడించారు. బాధిత మత్స్యకారులకు తమ పార్టీ పూర్తి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అవసరమైతే మత్స్యకారుల సమస్యలపై చర్చించేందుకు జగన్ స్వయంగా నెల్లూరుకు వచ్చే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు. మత్స్యకారుల పొట్టకొట్టేలా వ్యవహరిస్తే సహించేది లేదని, ప్రభుత్వం వెంటనే స్పందించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాకాణి డిమాండ్ చేశారు.

# వృద్ధులకు వాట్సాప్ ద్వారా సేవలు

అమరావతి (ఏడీఎన్ఎన్) :



రాష్ట్రంలోని వయోవృద్ధుల సంక్షేమం, భద్రతకు కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి స్పష్టం చేశారు. వెలగపూడి సచివాలయంలో బుధవారం జరిగిన 'సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కౌన్సిల్' సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వృద్ధులకు సేవలందించడంలో సాంకేతికతను జోడిస్తూ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఇందులో భాగంగా సీనియర్ సిటిజన్ కార్డుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా, 'వాట్సాప్ మన మిత్ర' ద్వారా ఉచితంగా ఐడీ కార్డులను పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఆర్టీసీ బస్సుల్లో వృద్ధులకు ఇచ్చే ప్రయాణ రాయితీలు, సీట్ల కేటాయింపును అత్యంత పటిష్టంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. వృద్ధుల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా వృద్ధాశ్రమాల్లో ప్రత్యేక వ్యాయామ పరికరాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని మంత్రి వెల్లడించారు. ఇటీవలి కాలంలో వృద్ధులే లక్ష్యంగా పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల వారిని అప్రమత్తం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సమాజంలో మారుతున్న జనాభా నిష్పత్తిని దృష్టిలో ఉంచుకుని, 2036 నాటికి పెరగనున్న వృద్ధుల సంఖ్యకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 'పాపులేషన్ మేనేజ్‌మెంట్ పాలసీ'ని తీసుకువస్తున్నారని, దీని ద్వారా వృద్ధులకు పూర్తి సామాజిక భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు.



# ఏపీ టూరిజం 'మిషన్ 2029'

అమరావతి (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో పర్యాటక రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 'మిషన్ 2029' కార్యాచరణను ప్రకటించారు. పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్న నేపథ్యంలో, 2029 నాటికి రాష్ట్రవ్యాప్తంగా 50 వేల హోటల్ గదులను, 10 వేల హోం స్టేలను అందుబాటులోకి తేవాలని పర్యాటక శాఖకు దిశానిర్దేశం చేశారు. ముఖ్యంగా రాజమహేంద్రవరం పరిసరాల్లో గోదావరి పుష్కరాల నాటికి పెద్ద ఎత్తున హోం స్టేలను సిద్ధం చేయాలని, వాటికి ప్రత్యేక రేటింగ్ విధానాన్ని తీసుకురావాలని సూచించారు. అరకు, మారేడుమిల్లి వంటి 15 ప్రకృతి రమణీయ ప్రాంతాల్లో కారావాన్ పార్కులను ఏర్పాటు చేసి, కుటుంబాలతో కలిసి పర్యాటకులు సురక్షితంగా ప్రకృతిని ఆస్వాదించేలా మౌలిక సదుపాయాలు కల్పించాలని స్పష్టం చేశారు. పర్యాటక ప్రాజెక్టుల వేగవంతమైన అమలు కోసం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన అటవీ, దేవాదాయ, పోలీసు మరియు మెరైన్ శాఖల సమన్వయంతో ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. విశాఖపట్నం, తిరుపతి నగరాలను అంతర్జాతీయ స్థాయి అమ్యూజ్‌మెంట్ పార్కులు, ఐకానిక్ డెస్టినేషన్లుగా తీర్చిదిద్దేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. జల రవాణాను ప్రోత్సహిస్తూ విశాఖ, విజయవాడ, శ్రీశైలం వంటి చోట్ల వాటర్ ఏరో డ్రోమ్స్ ఏర్పాటు చేసి, సీ ప్లేన్లను అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. అలాగే విశాఖ, కృష్ణపట్నం పోర్టుల నుంచి క్రూజ్ నౌకలను నిర్వహించడం ద్వారా పొరుగు రాష్ట్రాల పర్యాటకులను సైతం ఆకర్షించవచ్చని పేర్కొన్నారు. అమరావతిని ఒక 'క్రియేటివ్ సిటీ'గా అభివృద్ధి చేయాలని, ఇక్కడ కంటెంట్ క్రియేషన్ ద్వారా క్రియేటివ్ ఎకానమీని సృష్టించాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. ఈ ప్రాజెక్టుపై బాలీవుడ్ స్టార్ సంజయ్ దత్ కూడా ఆసక్తి చూపినట్లు ఆయన వెల్లడించారు. చారిత్రక హేవ్ లాక్ బ్రిడ్జిని ఈ ఏడాది డిసెంబరు నాటికి పర్యాటకుల కోసం సిద్ధం చేయాలని, 'ప్రసాద్', 'స్వదేశ్ దర్శన్' పథకాల కింద చేపట్టిన ప్రాజెక్టులను 2026 మే నాటికి పూర్తి చేయాలని గడువు విధించారు. గత ఏడాదితో పోలిస్తే పర్యాటకుల ఫుట్ ఫాల్ 21 శాతం వృద్ధి చెందిందని, ఈ జోరును కొనసాగిస్తూ ఆంధ్రప్రదేశ్‌ను పర్యాటక రంగంలో దేశంలోనే అగ్రస్థానంలో నిలబెట్టాలని అధికారులకు పిలుపునిచ్చారు.



# వ్యవసాయంలో గ్లోబల్ కనెక్ట్

విజయవాడ(ఏడీఎన్ఎన్) :

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సింగపూర్ ప్రతినిధులతో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విజయవాడలోని తన క్యాంప్ కార్యాలయం నుండి జరిగిన ఈ సమావేశంలో ఆహార భద్రత, సరఫరా వ్యవస్థలు, ఆధునిక నిల్వ పద్ధతులపై విస్తృతంగా చర్చించారు. సింగపూర్ తన అవసరాల కోసం సుమారు 80 శాతం ఆహార ఉత్పత్తులను ఇతర దేశాల నుండి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో, ఆ దేశం అనుసరిస్తున్న అత్యుత్తమ ఆహార భద్రతా విధానాలు, ఉత్పత్తుల సంరక్షణ చర్యలు మరియు సమర్థవంతమైన రవాణా నిర్వహణ గురించి మంత్రి అచ్చెన్నాయుడు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏపీలో పండే నాణ్యమైన ఉత్పత్తులను సింగపూర్‌కు ఎగుమతి చేయడం ద్వారా రైతులకు లాభసాటి ధరలు కల్పించే అవకాశాలపై ఆయన ఈ సందర్భంగా వివరించారు. ప్రభుత్వ విధానాల రూపకల్పనలో సింగపూర్ అనుసరిస్తున్న 'డేటా అనలిసిస్' విధానంపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రత్యేక ఆసక్తిని కనబరిచారు. డేటా ఆధారంగా నిర్ణయాలు తీసుకోవడం వల్ల ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందుతాయని, ఈ నమూనాను ఆంధ్రప్రదేశ్‌లో కూడా అమలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన పేర్కొన్నారు. దీనితో పాటు ఆహార ఉత్పత్తుల నిల్వలో నష్టాలను తగ్గించేందుకు అవసరమైన ఆధునిక కోల్డ్ స్టోరేజ్ మేనేజ్‌మెంట్ మరియు సాంకేతిక సహకారంపై ఇరు పక్షాలు చర్చించాయి. రాష్ట్రానికి ఉన్న సుదీర్ఘ సముద్ర తీర ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం, మత్స్య సంపద ఎగుమతులు మరియు తీర ప్రాంత మౌలిక సదుపాయాల పెంపు విషయంలో సింగపూర్ అనుసరిస్తున్న ఆధునిక నమూనాలను అధ్యయనం చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఉన్న విస్తృత అవకాశాలను మంత్రి ఈ సమావేశంలో వివరించారు. ఈ చర్చల ద్వారా ఇరు పక్షాల మధ్య జ్ఞాన మార్పిడి జరుగుతుందని, ఇది రాష్ట్రంలోని వ్యవసాయ సరఫరా వ్యవస్థలను మెరుగుపరచడానికి ఎంతగానో దోహదపడుతుందని అచ్చెన్నాయుడు ఆశాభావం వ్యక్తం చేశారు. ఆధునిక వ్యవసాయ విధానాల అమలు ద్వారా రైతులకు గరిష్ట ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడితి రాజశేఖర్‌తో పాటు సింగపూర్ ప్రతినిధులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



# ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య!

అనంతపురం(ఏడీఎన్ఎన్) :

ప్రేమించిన యువతి తన ప్రేమను నిరాకరించిందన్న మనస్థాపంతో ఓ యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన అనంతపురం జిల్లాలో చోటుచేసుకుంది. పులివెందుల నియోజకవర్గ పరిధిలోని అంబకపల్లి గ్రామానికి చెందిన శివ పవన్ కుమార్ రెడ్డి అనే యువకుడు ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. పోలీసుల కథనం ప్రకారం.. అంబకపల్లికి చెందిన శివ పవన్ కుమార్ రెడ్డి గత కొంతకాలంగా ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ఇటీవల తన ప్రేమ విషయాన్ని ఆమెకు తెలపగా, సదరు యువతి అందుకు అంగీకరించలేదు. అప్పటి నుంచి తీవ్ర మనస్థాపానికి గురైన శివ పవన్, జీవితంపై విరక్తి పెంచుకున్నాడు. ఈ క్రమంలో కోమలి గ్రామం సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చేతికి అందొచ్చిన కుమారుడు క్షణికావేశంలో తనువు చాలించడంతో అంబకపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. మృతుని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.



# అర్హులైన కొత్త వారికే ఇందిరమ్మ ఇళ్లు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో గత ప్రభుత్వాల హయాంలో నిలిచిపోయిన ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. శాసనసభలో గృహ నిర్మాణ రంగంపై బుధవారం జరిగిన చర్చలో ఆయన మాట్లాడుతూ, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి నేతృత్వంలో 21 లక్షల ఇందిరమ్మ ఇళ్లను నిర్మించిన విషయాన్ని గుర్తుచేశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్‌లో లక్ష ఇళ్లకు అనుమతులు ఇచ్చినప్పటికీ, అనేక చోట్ల పనులు అసంపూర్తిగా మిగిలిపోయాయని ఆయన వెల్లడించారు.గత ప్రభుత్వం ప్రారంభించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో సుమారు 70 వేల ఇళ్లకు సంబంధించి చిన్నపాటి పనులు పెండింగ్‌లో ఉన్నాయని, మరో 26 వేల ఇళ్లు నిర్మాణ దశలోనే నిలిచిపోయాయని మంత్రి వివరించారు. ఈ అసంపూర్తి పనులన్నింటినీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే పూర్తి చేసిందని ఆయన సభకు తెలిపారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ఈ ఇళ్లు నిరుపయోగంగా ఉండకూడదనే ఉద్దేశంతో, ఎంత ఖర్చయినా సరే పెండింగ్ పనులను పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేస్తామని హామీ ఇచ్చారు.గతంలో కేటాయించిన ఇళ్లలో సుమారు 12 వేల ఇళ్లను లబ్ధిదారులు ఇప్పటికీ స్వాధీనం చేసుకోలేదని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం వారికి మూడు నెలల గడువు ఇస్తూ నోటీసులు జారీ చేసిందని, స్పందించిన 6 వేల మంది ఇళ్లలోకి చేరారని చెప్పారు. నోటీసులకు స్పందించని మిగిలిన ఇళ్లను స్వాధీనం చేసుకొని, అర్హులైన కొత్త లబ్ధిదారులకు కేటాయిస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే, ఇప్పటివరకు ఎవరికీ కేటాయించని ఇళ్లను కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని వెల్లడించారు.ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు గృహ నిర్మాణ రంగంలోని సమస్యలపై చర్చించేందుకు హైదరాబాద్‌లో త్వరలోనే ఒక ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహిస్తామని మంత్రి ప్రకటించారు. ఈ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేస్తామని, అందరి సలహాలతో పారదర్శకంగా ఇళ్ల పంపిణీ చేపడతామని వివరించారు. గృహ నిర్మాణ రంగంలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించి, పేదలకు సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ ప్రాధాన్యత అని ఆయన పునరుద్ఘాటించారు.

# పేదవాడి ఇంటి కల కేసీఆర్‌తోనే సాధ్యం



హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 28 నెలలు గడుస్తున్నా, హైదరాబాద్ నగరంలో కనీసం ఒక్క ఇంటినైనా నిర్మించారా అని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. అసెంబ్లీ సమావేశాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై బుధవారం జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన పేద ప్రజల సొంత ఇంటి కలను నిజం చేసిన ఘనత కేవలం కేసీఆర్ ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 2.31 లక్షల ఇళ్లను మంజూరు చేసిందని, అందులో 1.62 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి చేసిందని తలసాని వివరించారు. ముఖ్యంగా జంట నగరాల పరిధిలో 65 వేల ఇళ్లను లాటరీ విధానం ద్వారా అత్యంత పారదర్శకంగా లబ్ధిదారులకు కేటాయించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. సనత్ నగర్ నియోజకవర్గంలోని ఐడీహెచ్ కాలనీలోనే దేశంలోనే మొట్టమొదటిసారిగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టామని, నాటి గవర్నర్ నరసింహన్ సైతం ఈ ఇళ్లను చూసి అబ్బురపడి అభినందించారని తెలిపారు.నగరంలోని బస్తీల్లో నిర్మించిన ఇళ్లను అక్కడే 70 ఏళ్లుగా నివసిస్తున్న స్థానిక పేదలకు మాత్రమే కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లపై విమర్శలు చేసే నాయకులు తనతో వస్తే, బీఆర్ఎస్ హయాంలో ఎంత నాణ్యమైన ఇళ్లు నిర్మించామో ప్రత్యక్షంగా చూపిస్తానని సవాల్ విసిరారు. పేదలకు గృహాలను అందించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేస్తోందని, కొత్త ఇళ్ల నిర్మాణంపై ఆ పార్టీకి స్పష్టమైన అజెండా లేదని తలసాని ధ్వజమెత్తారు.



# ఆయిల్ ఫామ్ సాగుకు స్వర్ణధామం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాష్ట్రంలో పంట మార్పిడి విధానంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్పష్టం చేశారు. అసెంబ్లీలో బుధవారం జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. తెలంగాణ ప్రాంతంలోని భౌగోళిక పరిస్థితులు, నేల స్వభావం ఆయిల్ ఫామ్ సాగుకు అత్యంత అనుకూలంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 20 లక్షల ఎకరాల భూమి ఈ పంటకు యోగ్యంగా ఉందని మంత్రి వివరించారు.ఆయిల్ ఫామ్ సాగు ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం లభించడమే కాకుండా, దేశీయంగా వంట నూనెల కొరతను తీర్చడంలో తెలంగాణ కీలక పాత్ర పోషిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పరంగా ఈ పంట సాగు చేసే రైతులకు అవసరమైన ప్రోత్సాహకాలు, రాయితీలు కల్పిస్తున్నామని తెలిపారు. అకాల వర్షాల వల్ల రాష్ట్రవ్యాప్తంగా దెబ్బతిన్న పంటల గురించి ప్రస్తావిస్తూ.. క్షేత్రస్థాయిలో నష్టపోయిన పంట వివరాలను సేకరించాలని అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. పంట నష్టంపై పూర్తి నివేదిక అందిన వెంటనే ప్రభుత్వం తరపున తగిన సహాయం ప్రకటించనున్నట్లు మంత్రి వెల్లడించారు.రైతులు కేవలం వరి, పత్తి వంటి పంటలకే పరిమితం కాకుండా, మార్కెట్ డిమాండ్ ఉన్న ఉద్యానవన పంటల వైపు మళ్లాలని ఆయన సూచించారు. ఆధునిక సాగు పద్ధతులను అవలంబించడం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవచ్చని మంత్రి తుమ్మల ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# రేవంత్.. దమ్ముంటే నాపై పోటీ చెయ్

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ మంత్రి హరీశ్ రావు ఘాటు విమర్శలు చేశారు. రేవంత్ రెడ్డి మళ్ళీ ముఖ్యమంత్రి కావడం అసాధ్యమని, ఆయన ఎన్ని ప్రయత్నాలు చేసినా అవి పగటి కలలుగానే మిగిలిపోతాయని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డికి దమ్ముంటే సిద్దిపేటలో తనపై పోటీ చేసి గెలవాలని సవాల్ విసిరారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం ఖాయమని, కేసీఆర్ మళ్ళీ ముఖ్యమంత్రి అవుతారని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను, అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని హరీశ్ రావు మండిపడ్డారు.నియోజకవర్గాల పునర్విభజన మహిళా రిజర్వేషన్లను తాము స్వాగతిస్తున్నామని, దీనివల్ల బీఆర్ఎస్ పార్టీకే ఎక్కువ లాభం జరుగుతుందని హరీశ్ రావు విశ్లేషించారు. అయితే జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇక కాంగ్రెస్ నేత జీవన్ రెడ్డి తమ పార్టీలోకి వస్తారనే ప్రచారంపై స్పందిస్తూ, ఆ విషయాన్ని ఇప్పుడే చెప్పలేమని, వేచి చూడటం మంచిదని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రాజకీయాల్లో ఎప్పుడు గోల్ కొట్టాలో తమకు బాగా తెలుసని ఆయన హెచ్చరించారు.

# నేతన్నల కష్టాలు తీర్చండి

సిరిసిల్ల (ఏడీఎన్ఎన్) :



సిరిసిల్ల నేతన్నల సమస్యల పరిష్కారం కోరుతూ మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను బుధవారం కలిశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ ప్రస్తుతం ఎదుర్కొంటున్న తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి నేతన్నలను గట్టెక్కించాలని కోరుతూ ఆయనకు వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా పవర్ లూమ్ పరిశ్రమపై పడుతున్న విద్యుత్ భారాలను తగ్గించాలని, గతంలో ఉన్న విధంగానే రాయితీలు కొనసాగించాలని ఈ సందర్భంగా కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.సిరిసిల్ల వస్త్ర పరిశ్రమపై పేరుకుపోయిన సుమారు రూ.38 కోట్ల విద్యుత్ బకాయిలతో పాటు, సర్ ఛార్జీలను తక్షణమే మాఫీ చేయాలని కేటీఆర్ కోరారు. పరిశ్రమ గడ్డు పరిస్థితుల్లో ఉండటం వల్ల కార్మికులు మళ్లీ ఆత్మహత్యల బాట పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. పాత బకాయిలతో సంబంధం లేకుండా నేతన్నలకు విద్యుత్ సబ్సిడీ ప్రయోజనాలు అందేలా చూడాలని, తద్వారా వారికి తక్షణ ఆర్థిక వెసులుబాటు కల్పించి భరోసా ఇవ్వాలని డిప్యూటీ సీఎంను కోరారు. కేటీఆర్ వివరించిన సమస్యలపై ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సానుకూలంగా స్పందించారు. నేతన్నల సంక్షేమం దృష్ట్యా విద్యుత్ బకాయిల అంశాన్ని ప్రభుత్వం నిశితంగా పరిశీలిస్తుందని హామీ ఇచ్చారు. కార్మికులకు మేలు జరిగేలా తగిన నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు. సంక్షోభంలో ఉన్న నేతన్నలను ఆదుకోవడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, బకాయిల మాఫీ మరియు సబ్సిడీల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకుంటామని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు.రాజకీయాలకు అతీతంగా సిరిసిల్ల నేతన్నల ప్రయోజనాలే పరమావధిగా ఈ భేటీ జరగడం రాజకీయ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. సిరిసిల్ల ప్రాంత ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్న వస్త్ర పరిశ్రమను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని నేతలు అభిప్రాయపడ్డారు. ఈ చర్చల నేపథ్యంలో ప్రభుత్వం నుంచి రాబోయే స్పందన కోసం నేతన్నలు ఆశగా ఎదురుచూస్తున్నారు. త్వరలోనే సానుకూల జీవో వెలువడుతుందని కార్మిక వర్గాలు ఆశిస్తున్నాయి.

# రాష్ట్రంలో పెట్రోల్ కొరత లేదు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



తెలంగాణ రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత ఉందంటూ వస్తున్న వార్తలను పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రవ్యాప్తంగా పెట్రోల్ బంకుల వద్ద వాహనదారుల రద్దీ అమాంతం పెరగడం, ముఖ్యంగా హైదరాబాద్‌లో కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ ఏర్పడిన నేపథ్యంలో ఆయన బుధవారం ఈ కీలక ప్రకటన చేశారు. కేవలం కొన్ని పుకార్ల కారణంగానే ప్రజలు ఆందోళనకు గురవుతున్నారని, రాష్ట్రంలో దాదాపు రెండు నెలలకు సరిపడా ఇంధన నిల్వలు అందుబాటులో ఉన్నాయని ఆయన స్పష్టం చేశారు.అవసరానికి మించి ఇంధనాన్ని నిల్వ చేసుకోవద్దని, బంకుల వద్ద క్యూ కట్టి ఇబ్బందులు పడవద్దని మంత్రి సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా డ్రమ్ములు, కంటైనర్లలో పెట్రోల్ నింపితే కఠిన చర్యలు తీసుకుంటామని బంకు యజమానులను హెచ్చరించారు. వాణిజ్య గ్యాస్ సరఫరాలో కొంత ఇబ్బంది ఉన్న మాట వాస్తవమేనని, ఈ అంశంపై ఇప్పటికే కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నామని వివరించారు. ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఇంధన లభ్యతపై ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటుందని మంత్రి పునరుద్ఘాటించారు.

# గిరిజనులకు అండగా ప్రభుత్వం

- రూ.15 లక్షల భారీ ప్యాకేజీతో పునరావాసం

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



అమ్రాబాద్ అభయారణ్య ప్రాంతంలో దశాబ్దాలుగా నివసిస్తున్న గిరిజన కుటుంబాల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ప్రతిష్ఠాత్మక పునరావాస పథకాన్ని అమలు చేస్తోంది. ఇందులో భాగంగా మొదటి దశలో నాలుగు గ్రామాలకు చెందిన 417 కుటుంబాలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని నిర్ణయించారు. అసెంబ్లీ కౌన్సిల్ హాల్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేతుల మీదుగా 14 గిరిజన కుటుంబాలకు పరిహారం చెక్కులను బుధవారం పంపిణీ చేశారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల చొప్పున భారీ ఆర్థిక సాయాన్ని ప్రభుత్వం అందజేస్తోంది.ఈ పునరావాస ప్యాకేజీలో భాగంగా 160 కుటుంబాలు నగదు పరిహారాన్ని ఎంచుకోగా, మిగిలిన 257 కుటుంబాలకు పక్కా ఇల్లు మరియు 5 ఎకరా ల భూమిని ప్రభుత్వం కేటాయిస్తోంది. నాగర్‌కర్నూల్ జిల్లా బచారం వద్ద అత్యాధునిక వసతులతో కూడిన పునరావాస కాలనీని నిర్మిస్తున్నారు. ఈ మొత్తం ప్రాజెక్ట్ కోసం ప్రభుత్వం రూ.62.55 కోట్ల నిధులను కేటాయించింది. కొత్తగా నిర్మించే కాలనీల్లో గిరిజన బిడ్డల కోసం డిజిటల్ లెర్నింగ్ సదుపాయాలతో కూడిన ఆధునిక పాఠశాలలు, మెరుగైన వైద్య సేవలు , మౌలిక వసతులను కల్పించనున్నారు.ఈ నిర్ణయం వల్ల అటు గిరిజన కుటుంబాలకు ఆర్థిక భద్రత చేకూరడమే కాకుండా, ఇటు వన్యప్రాణుల సంరక్షణకు కూడా పెద్దపీట వేసినట్లవుతుంది. సుమారు 1501 హెక్టార్ల అటవీ భూమి పునరుద్ధరణకు ఈ తరలింపు అవకాశం కల్పిస్తోంది. దేశంలోనే అత్యధిక పరిహారం అందిస్తున్న రాష్ట్రాల్లో ఒకటిగా తెలంగాణ నిలిచింది. బచారం పునరావాస కాలనీని ఒక 'మోడల్ విలేజ్'గా తీర్చిదిద్ది, గిరిజనుల సామాజిక, ఆర్థికాభివృద్ధికి బాటలు వేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

# దేశాన్ని విడదీసే రాజకీయాలు వద్దు!

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :



దక్షిణాది రాష్ట్రాల సీట్ల పెంపు , మహిళా రిజర్వేషన్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా ఖండించారు. మీడియాతో బుధవారం ఆయన మాట్లాడుతూ , ప్రాంతీయ అసమానతల పేరుతో ప్రజల మధ్య విభజన తీసుకురావాలని చూడటం సరికాదని హితవు పలికారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు కేటాయిస్తే ముఖ్యమంత్రికి వచ్చిన అభ్యంతరం ఏమిటో చెప్పాలని ఆయన నిలదీశారు.కాంగ్రెస్ పార్టీకి మహిళలంటేనే ద్వేషమని, అందుకే దశాబ్దాల పాలనలో వారికి రిజర్వేషన్లు ఇవ్వలేదని బండి సంజయ్ ఆరోపించారు. గతంలో మహిళా రిజర్వేషన్ బిల్లు కాపీలను చింపిన పార్టీలతో ఇప్పుడు కాంగ్రెస్ అంటకాగుతోందని విమర్శించారు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా మహిళా రిజర్వేషన్లను అమలు చేసి తీరుతామని ఆయన స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల్లో అసెంబ్లీ, పార్లమెంట్ సీట్ల సంఖ్యను పెంచితే దక్షిణాదికి నష్టం జరుగుతుందనడంలో అర్థం లేదని కొట్టిపారేశారు.ప్రాంతీయ అసమానతల పేరుతో రాజకీయంగా లబ్ధి పొందాలని చూడటం మానుకోవాలని బండి సంజయ్ సూచించారు. దేశభక్తి, జాతీయవాదం పట్ల కాంగ్రెస్ నేతలకు గౌరవం లేదని, దేశాన్ని విభజించే రాజకీయాలు చేయడం దురదృష్టకరమని మండిపడ్డారు. తమిళనాడు, కేరళ వంటి రాష్ట్రాల్లో కాంగ్రెస్ కూటమి ఓడిపోతుందనే భయంతోనే రేవంత్ రెడ్డి ఇలాంటి కొత్త డ్రామాలకు తెరలేపారని ఆయన ఎద్దేవా చేశారు.దక్షిణాదికి అన్యాయం జరుగుతోందంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు సాగవని బండి సంజయ్ పేర్కొన్నారు. త్వరలోనే తమిళనాడు, కేరళ ప్రజలు కాంగ్రెస్ భాగస్వామ్య పక్షాలకు తగిన బుద్ధి చెబుతారని ధీమా వ్యక్తం చేశారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా కాంగ్రెస్ పప్పులు ఉడకవని, రాజకీయ ప్రయోజనాల కోసం దేశ సమగ్రతను దెబ్బతీయవద్దని ఆయన హెచ్చరించారు.



# పార్టీలతో పొత్తులు పెట్టుకుంటే తప్పేంటి?

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

రాజకీయాల్లో పొత్తులు పెట్టుకోవడం సర్వసాధారణమని, బీఆర్ఎస్ ఇతర పార్టీలతో చేతులు కలిపితే తప్పేముందని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రశ్నించారు. మీడియా ప్రతినిధులతో బుధవారం జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గతంలో కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా పుట్టిన టీడీపీ, ప్రస్తుతం అదే పార్టీతో పొత్తు పెట్టుకున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మారుతున్న రాజకీయ సమీకరణాల దృష్ట్యా వ్యూహాత్మక నిర్ణయాలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు.హైదరాబాద్ నగరంలో ఓటింగ్ శాతం తగ్గడానికి గల కారణాలను కూడా సుధీర్ రెడ్డి విశ్లేషించారు. నగరంలో నివసించే వారు ఓటింగ్ రోజున తమ స్వగ్రామాలకు వెళ్లడం వల్లే గ్రేటర్ పరిధిలో పోలింగ్ శాతం తగ్గుతోందని పేర్కొన్నారు. అలాగే రాబోయే నియోజకవర్గాల పునర్విభజన జరిగితే హైదరాబాద్‌లో అసెంబ్లీ సీట్ల సంఖ్య పెరిగే అవకాశం ఉందని జోస్యం చెప్పారు. ఓటర్ల జాబితాను సమగ్రంగా నవీకరించడం వల్ల వ్యవస్థలో పారదర్శకత పెరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.



# ఆ రోజే కవిత కొత్త పార్టీ ప్రకటన!

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

తెలంగాణ రాజకీయ యవనికపై మరో కొత్త పార్టీ ఆవిర్భవించబోతోంది. తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత సొంత పార్టీ ఏర్పాటుపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నెల 27న శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని తన నూతన రాజకీయ ప్రస్థానానికి శ్రీకారం చుట్టాలని ఆమె భావిస్తున్నారు. ఆ రోజు ఉదయం 8 గంటలకు కొత్త పార్టీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని తెలంగాణ జాగృతి వర్గాలు వెల్లడించాయి.ఈ కీలక ప్రకటన సందర్భంగా పార్టీ పేరు, జెండా , విధివిధానాలను కవిత స్వయంగా వెల్లడించనున్నారు. ముఖ్యంగా తన మెట్టినిల్లు నుంచే పార్టీ చిహ్నాన్ని ప్రకటించబోతుండటం విశేషం. అంతేకాకుండా, రాబోయే ఎన్నికల్లో తాను ఏ నియోజకవర్గం నుంచి పోటీ చేయబోతున్నారనే అంశంపై కూడా ఈ సందర్భంగా స్పష్టత ఇచ్చే అవకాశం ఉంది. తెలంగాణ అస్తిత్వం, అభివృద్ధి అజెండాతో ఈ పార్టీ ముందుకు సాగనున్నట్లు తెలుస్తోంది.గత కొంతకాలంగా కవిత రాజకీయ భవిష్యత్తుపై జరుగుతున్న ప్రచారానికి ఈ ప్రకటనతో తెరపడనుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన మద్దతుదారులు , జాగృతి కార్యకర్తలతో కలిసి ఆమె ఈ కొత్త ప్రయాణాన్ని ప్రారంభించబోతున్నారు. శ్రీరామనవమి రోజున వెలువడే ఈ ప్రకటన తెలంగాణ రాజకీయాల్లో ఎలాంటి మార్పులకు దారితీస్తుందోనని రాజకీయ విశ్లేషకులు ఆసక్తిగా గమనిస్తున్నారు. పార్టీ విధివిధానాల్లో ప్రధానంగా యువత, మహిళలు , సామాజిక అంశాలకు ప్రాధాన్యత ఉండనున్నట్లు సమాచారం.



# 'కడియం' బినామీ ఆస్తులపై పల్లా ఆరోపణలు

హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :

స్టేషన్ ఘన్‌పూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే కడియం శ్రీహరిపై జనగామ బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ సందర్భంగా ఆయన కడియం శ్రీహరి రాజకీయ నైతికతను ప్రశ్నించారు. దేవాదుల ఎత్తిపోతల పథకానికి తానే సృష్టికర్తనని కడియం చెప్పుకోవడం హాస్యాస్పదమని, ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న పదేళ్ల కాలంలో ఆ ప్రాజెక్టు కోసం ఆయన చేసిందేమీ లేదని పల్లా ఆరోపించారు. ఏ పాత్ర పోషించని వ్యక్తి ఇప్పుడు క్రెడిట్ తీసుకోవడం సిగ్గుచేటని మండిపడ్డారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కడియం శ్రీహరికి రాజకీయంగా ఎన్నో అద్భుతమైన అవకాశాలు కల్పించారని పల్లా గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం, ఎంపీ, ఎమ్మెల్సీ వంటి కీలక పదవులతో పాటు ఆయన కుటుంబ సభ్యులకు కూడా ప్రాధాన్యత ఇచ్చారని, కేసీఆర్ పెట్టిన రాజకీయ భిక్షతోనే ఆయన ఈ స్థాయిలో ఉన్నారని వ్యాఖ్యానించారు. అటువంటి వ్యక్తి ఇప్పుడు కేసీఆర్‌నే విస్మరించి మాట్లాడటం ఆయన నైతికతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. కడియం శ్రీహరి నిజాయతీ గల నాయకుడు కాదని, బినామీ పేర్లతో భారీగా ఆస్తులు కూడబెట్టారని పల్లా సంచలన ఆరోపణలు చేశారు.నియోజకవర్గాల పునర్విభజన లేదా సమీకరణలు ఎలా మారినా తాను జనగామ ప్రజలకే సేవ చేస్తానని, అక్కడి ప్రజలతో తనకున్న అనుబంధం విడదీయలేనిదని పల్లా స్పష్టం చేశారు. ఒకప్పుడు ఒకే పార్టీలో ఉండి ఇప్పుడు ప్రత్యర్థులుగా మారిన ఈ ఇద్దరు నేతల మధ్య సాగుతున్న ఈ ఆరోపణలు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయాల్లో వేడిని పెంచుతున్నాయి. కడియం శ్రీహరి అవినీతిపై త్వరలోనే మరిన్ని ఆధారాలు బయటపెడతామని పల్లా హెచ్చరించడం గమనార్హం.

## రాశి ఫలాలు

**26-03-2026 గురువారం**

**మేషం:**

ఉద్యోగులకు పదోన్నతికి అవకాశం ఉంది. వృత్తి, వ్యాపారాల్లో మార్పులు చేసి లాభాలు పొందుతారు. నిరుద్యోగులు శుభవార్త వింటారు. ఏ ప్రయత్నం తలపెట్టినా విజయవంతంగా పూర్తవుతుంది. ఆస్తి సంబంధమైన వ్యవ హారాల్లో సానుకూలతలు చోటు చేసుకుంటాయి. గృహ, వాహన ప్రయత్నాల్లో పురోగతి ఉంటుంది.

**వృషభం:**

ఉద్యోగంలో బరువు బాధ్యతలు బాగా పెరిగే అవకాశముంది. కుటుంబ జీవితం అన్ని విధాలా సామరస్యంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాలు సంతృప్తికరంగా పురోగమిస్తాయి. ఆర్థిక ఇబ్బందులేవీ ఉండకపోవచ్చు. కొందరు మిత్రుల కారణంగా డబ్బు నష్టపోయే అవకాశం ఉంది.

**మిథునం:**

ఉద్యోగంలో అధికారులు, సహచరులతో సామరస్యం, ఆదరణ బాగా పెరుగుతాయి. ఆదాయానికి లోటుండదు. ఇంటా బయటా గౌరవ మర్యాదలు వృద్ధి చెందుతాయి. వృత్తి, వ్యాపారాల్లో కొన్ని చిన్నపాటి ఆర్థిక సమస్యలు ఉండవచ్చు. ఆదాయంలో ఆశించిన స్థాయిలో పురోగతి ఉంటుంది.

**కర్కాటకం:**

వృత్తి, ఉద్యోగాల్లో బాధ్యతలను సక్రమంగా, సజావుగా నిర్వర్తిస్తారు. వ్యాపారాల్లో కొత్త ఆలోచనలు ప్రవేశ పెడతారు. ఆర్థిక పరిస్థితి ఆశాజనకంగా ఉంటుంది. అదనపు ఆదాయ ప్రయత్నాలకు ఆశించిన ప్రతిఫలం ఉంటుంది. షేర్లు, స్పెక్యులేషన్లు బాగా లాభాలనిస్తాయి..

**సింహం:**

వృత్తి, వ్యాపారాల్లో పెట్టుబడులకు తగ్గట్టుగా లాభాలు గడిస్తారు. ప్రయాణాల వల్ల మంచి ఆశించిన ఫలితం ఉంటుంది. ఉద్యోగంలో పనిభారం ఉంటుంది. అధికారుల నుంచి సహాయ సహకారాలు ఉంటాయి. నిరుద్యోగులకు సొంత ఊర్లో ఉద్యోగం లభించే అవకాశం ఉంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త అవసరం.

**కన్య:**

ఉద్యోగంలో పనిభారం, పని ఒత్తిడి ఎక్కువగా ఉంటాయి. అధికారులకు మీ ప్రతిభ మీద నమ్మకం పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాల్లో పోటీదార్ల మీద పైచేయి సాధిస్తారు. ఆదాయ వృద్ధి ప్రయత్నాల్లో శ్రమకు తగ్గ ప్రతిఫలం ఉంటుంది. ప్రయాణాల వల్ల లాభాలు కలుగుతాయి.

**తుల:**

ఉద్యోగ జీవితం చాలా వరకు సానుకూలంగా సాగిపోతుంది. వృత్తి, వ్యాపారాల్లో డిమాండ్ బాగా పెరుగుతుంది. ఆర్థిక, వ్యక్తిగత సమస్యలు చాలావరకు పరిష్కారం అవుతాయి. కుటుంబంలో ప్రశాంత వాతావరణం నెలకొంటుంది. ఆదాయ ప్రయత్నాల్లో ఆశించిన ఫలితాలు కనిపిస్తాయి. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది. .

**వృశ్చికం:**

వృత్తి జీవితంలో బాగా ఒత్తిడి ఉన్నప్పటికీ అందుకు తగ్గ ప్రతిఫలం కూడా అందుతుంది. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. ఆస్తి, ఆర్థిక వివాదాలు పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు నిర్వర్తించాల్సి వస్తుంది.

**ధనస్సు:**

ఉద్యోగంలో ప్రోత్సాహం, ఆదరణ ఆశించిన స్థాయిలో కొనసాగుతాయి. వృత్తి, వ్యాపారాలు లాభ దాయకంగా సాగిపోతాయి. ప్రతి పనిలోనూ శ్రమాధిక్యత ఉంటుంది. కొందరు మిత్రులతో అపార్థాలు తలెత్తే అవకాశం ఉంది. గృహ, వాహన సంబంధమైన ప్రయత్నాలు ఒక కొలిక్కి వస్తాయి.

**మకరం:**

వృత్తి, ఉద్యోగాలు చాలా మెరుగ్గా ఉంటాయి. అనుకున్న పనులు పూర్తవుతాయి. ఏ రంగంలో ఉన్నప్పటికీ ఆదాయానికి లోటుండకపోవచ్చు. ఆరోగ్య పరిస్థితి మెరుగ్గా ఉంటుంది. ఆస్తి, ఆర్థిక వ్యవహారాల్లో సరైన నిర్ణయాలు తీసుకుని అమలు చేస్తారు. తలపెట్టిన పనులు కొద్ది శ్రమతో పూర్త వుతాయి.

**కుంభం:**


వృత్తి, ఉద్యోగాల్లో ఆశించిన అవకాశాలు అందుతాయి. వ్యాపారాల్లో కొద్దిపాటి మార్పులను ప్రవేశ పెట్టి లాభాలు గడిస్తారు. ఇంటా బయటా కార్యకలాపాలు బాగా పెరుగుతాయి. క్షణం కూడా తీరిక లేని పరిస్థితి ఏర్పడుతుంది. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. తలపెట్టిన వ్యవహారాల్లో విజయం సాధిస్తారు.

**మీనం:**

వృత్తి, ఉద్యోగాలు ఉత్సాహంగా, ప్రోత్సాహకరంగా సాగిపోతాయి. వ్యాపారాల్లో లాభాలు నిలకడగా ఉంటాయి. ఆర్థిక పరిస్థితి యథాతథంగా కొనసాగుతుంది. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. నిరుద్యోగులకు అనుకూల వాతావరణం ఉంటుంది.

# పెట్రోల్, రేషన్.. బైక్, కార్లకు పరిమితి విధింపు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



రాష్ట్రంలో ఇంధన కొరత లేదని అధికారికంగా చెబుతున్నప్పటికీ, పలు ప్రాంతాల్లో పెట్రోల్ బంకుల వద్ద ఏర్పడుతున్న పరిస్థితులు వాహనదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. గంటల తరబడి క్యూలో నిలబడ్డా పరిమితంగా మాత్రమే ఇంధనం అందించడం వల్ల అసంతృప్తి వ్యక్తమవుతోంది. తెలంగాణ పెట్రోలియం అసోసియేషన్ ప్రకటన ప్రకారం, HPCL, IOCL, BPCL సంస్థల్లో తగినంత పెట్రోల్, డీజిల్ నిల్వలు ఉన్నాయని స్పష్టం చేసింది. ఇంధన కొరతపై వస్తున్న వార్తలు నిరాధారమని ఖండిస్తూ, ప్రజలు అవసరానికి మించి నిల్వ చేసుకోవద్దని విజ్ఞప్తి చేసింది.అయితే భూమిపై పరిస్థితి భిన్నంగా కనిపిస్తోంది. ఆదిలాబాద్ జిల్లాలోని కొన్ని పెట్రోల్ బంకుల్లో గంటల తరబడి క్యూలో నిలబడ్డ వాహనదారులకు కేవలం రూ.50 విలువైన పెట్రోల్ మాత్రమే ఇస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనిపై వాహనదారులు బంక్ సిబ్బందితో వాగ్వాదానికి దిగిన సంఘటనలు చోటుచేసుకున్నాయి.ఇక హైదరాబాద్ నగరంలోని మూసారాంబాగ్ ప్రాంతంలో ఒక పెట్రోల్ బంకులో బైక్‌లకు రూ.200, కార్లకు రూ.1000 వరకు మాత్రమే పెట్రోల్ అందిస్తామని బోర్డులు ఏర్పాటు చేయడం గమనార్హం.ఈ పరిణామాల నేపథ్యంలో ఇంధన సరఫరాపై స్పష్టత అవసరమని, ప్రజల్లో నెలకొన్న ఆందోళనను నివారించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

# భద్రాద్రి రామాలయానికి రూ. 351 కోట్లు

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**



దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాద్రి పుణ్య క్షేత్రం మహర్దశ దిశగా అడుగులు వేస్తోంది. రామాలయ సమగ్ర అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం తొలి విడతగా రూ. 351 కోట్ల నిధులను మంజూరు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ పరిపాలన జీవో నంబర్ 167 ద్వారా ఈ నిధులను కేటాయించింది. మొత్తం రూ. 586 కోట్లతో మూడు దశల్లో అమలు చేయనున్న మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, మొదటి విడత పనులకు ఈ నిధులు వెచ్చించనున్నారు. గత ఏడాది మార్చిలో భద్రాచలంలో పర్యటించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఆలయంతో పాటు పట్టణ అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించిన నేపథ్యంలో ఈ నిధుల విడుదల ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ శుక్రవారం శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకుని భద్రాద్రి రామయ్యకు రాష్ట్ర ప్రభుత్వం తరపున ముత్యాల తలంబ్రాలు, పట్టు వస్త్రాలు సమర్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విచ్చేస్తున్నారు. ఈ పర్యటనలో ఆయన ఆలయ అభివృద్ధి పనులకు అధికారికంగా శంకుస్థాపన చేయనున్నారు. భద్రాద్రి అభివృద్ధికి పెద్దపీట వేస్తూ నిధులు మంజూరు చేసినందుకు గాను రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న భద్రాచలం మాస్టర్ ప్లాన్ పనులు ఇప్పుడు పట్టాలెక్కనుండటంతో భక్తుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

# ఒకేచోట వరుస ప్రమాదాలు.. ముగ్గురు మృతి

**కర్నూల్ ఏడీఎన్ఎన్) :**




కర్నూల్ జిల్లాలో చోటుచేసుకున్న వరుస రోడ్డు ప్రమాదాలు విషాదాన్ని మిగిల్చాయి. ఒకేచోట జరిగిన రెండు ప్రమాదాల్లో ముగ్గురు వ్యక్తులు మృతి చెందగా, నంద్యాల వద్ద జరిగిన మరో ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. వివరాల ప్రకారం... కర్నూల్ నగరంలోని చెన్నమ్మ సర్కిల్ వద్ద బుధవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఓ లారీ వేగంగా వచ్చి పాదచారిని ఢీకొట్టింది. ఈ ఘటనలో అతను అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనను గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలకు దిగారు.అయితే, అదే సమయంలో మరో లారీ వేగంగా అక్కడికి చేరుకుని సహాయం అందించేందుకు నిలిచిన వారిపైకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో మరో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. ఒకరికి సహాయం చేయబోయి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం స్థానికులను కలచివేసింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ప్రమాదాలకు కారణమైన రెండు లారీల డ్రైవర్లపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనను కళ్లారా చూసినవారు తీవ్ర దిగ్భ్రాంతికి గురై కన్నీటి పర్యంతమయ్యారు. మృతుల కుటుంబ సభ్యుల రోదనలు హృదయ విదారకంగా మారాయి. నంద్యాల వద్ద బస్సు ప్రమాదంఇక మరోవైపు నంద్యాల సమీపంలోని జాతీయ రహదారిపై మార్నింగ్ స్టార్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు ప్రమాదానికి గురైంది. తెల్లవారుజామున టైరు పేలిపోవడంతో అదుపుతప్పిన బస్సు రహదారి పక్కనున్న పంట పొలాల్లోకి దూసుకెళ్లింది.ఈ ఘటనలో సుమారు 10 మంది ప్రయాణికులు గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వారిని సమీప ఆస్పత్రికి తరలించారు. బస్సు అధిక వేగంతో ప్రయాణించడం వల్లే ప్రమాదం జరిగినట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పిడుగురాళ్ల వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ ప్రవేశాలు

- **ఏప్రిల్ 15 నుండి ఓపీ సేవలు ప్రారంభం!**

**పిడుగురాళ్ల (ఏడీఎన్ఎన్):**



పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో కొత్తగా నిర్మిస్తున్న ప్రభుత్వ బోధనాసుపత్రి పనులు తుది దశకు చేరుకున్నాయి. జిల్లా ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఈ ప్రాజెక్టులో భాగంగా, ఏప్రిల్ 15వ తేదీ నుండి ఔట్ పేషెంట్ సేవలను ప్రారంభించేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్, జిల్లా కలెక్టర్ కృతికా శుక్లాతో కలిసి ఆసుపత్రి నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లతో చర్చించిన తర్వాత అధికారిక ప్రారంభోత్సవ తేదీని ఖరారు చేస్తామని కార్యదర్శి వెల్లడించారు.వైద్య విద్యకు సంబంధించి వచ్చే 2026 27 విద్యా సంవత్సరం నుండే ఈ కళాశాలలో 100 ఎంబీబీఎస్ సీట్ల మంజూరు కోసం నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్.ఎమ్.సి )కి దరఖాస్తు చేసినట్లు సౌరభ్ గౌర్ తెలిపారు. ఎన్.ఎమ్.సి కమిటీ తనిఖీలను దృష్టిలో ఉంచుకుని, మే నెలాఖరు నాటికి కళాశాల భవన నిర్మాణాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని ఆయన ఇంజనీర్లను ఆదేశించారు. దీనిపై తాను ప్రతి వారం స్వయంగా పర్యవేక్షణ చేస్తానని స్పష్టం చేశారు. అలాగే, అడ్మిషన్లు పొందే విద్యార్థుల కోసం హాస్టళ్లలో అన్ని రకాల వసతులు ఉండేలా చూడాలని, నీరు , విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కృతికా శుక్లా సూచించారు.వైద్య సేవల కార్యాచరణలో భాగంగా, ఏప్రిల్ 1వ తేదీ తర్వాత ట్రయల్ రన్ నిర్వహించి, 15 నుండి ఓపీ సేవలను ప్రారంభించనున్నారు. తర్వాత వీలును బట్టి ఇన్‌పేషెంట్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఆస్పత్రి నిర్వహణకు అవసరమైన వైద్యులు, పారామెడికల్ సిబ్బంది నియామకాలను త్వరగా పూర్తి చేయాలని డీఎంఈ అధికారులను ఆదేశించారు. ఆస్పత్రికి వచ్చే రోగుల సౌకర్యార్థం ప్రధాన రహదారికి ఇరువైపులా బస్సు స్టాపులను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు.సమీక్ష తర్వాత కార్యదర్శి , కలెక్టర్ జానపాడు ఉప ఆరోగ్య కేంద్రం, కామేపల్లిలోని 104 హెల్త్ సెంటర్ల పనితీరును కూడా పర్యవేక్షించారు.

# వైన్ షాపులకు దేవుళ్ల పేర్లు తీసేయాలి



**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న బడ్జెట్ సమావేశాల్లో మద్యం దుకాణాల పేర్లపై ఆసక్తికరమైన చర్చ తెరపైకి వచ్చింది. నిజామాబాద్ అర్బన్ బీజేపీ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని ఒక వినూత్న విన్నపం చేశారు. రాష్ట్రంలోని వైన్ షాపులకు దేవుళ్ల పేర్లు పెట్టడాన్ని తక్షణమే నిషేధించాలని, దీనిపై ప్రభుత్వం ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. దైవ నామాలను మద్యం విక్రయ కేంద్రాలకు అన్వయించడం వల్ల హిందూ మత మనోభావాలు దెబ్బతింటున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణలో రేణుక ఎల్లమ్మ, మైసమ్మ వంటి గ్రామ దేవతల పేర్లతో వేలాది మద్యం దుకాణాలు నడుస్తున్నాయని, వ్యాపార లాభాల కోసం దేవుళ్ల పేర్లను వాడుకోవడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ఇకపై కొత్తగా లైసెన్సులు ఇచ్చే సమయంలోనే, దుకాణాలకు దైవ నామాలు పెట్టకుండా కఠిన నిబంధనలు అమలు చేయాలని కోరారు. దేవుళ్ల పేర్లు పెడితే వ్యాపారం బాగా జరుగుతుందనే నమ్మకంతో చాలామంది ఈ ఆనవాయితీని కొనసాగిస్తున్నారని, అయితే ఇది భక్తికి మరియు మత విశ్వాసాలకు అవమానకరమని సూర్యనారాయణ గుప్తా స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, భవిష్యత్తులో మద్యం దుకాణాలకు కేవలం వ్యక్తుల పేర్లు లేదా తటస్థ పేర్లు మాత్రమే ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# ఆర్టీసీ ప్రయాణికులకు బంపర్ ఆఫర్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**




హైదరాబాద్ నగరంలోని ఆర్టీసీ ప్రయాణికులకు టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం బుధవారం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్ కొరత పుకార్ల నేపథ్యంలో వాహనదారులు బంకుల వద్ద గంటల తరబడి వేచి చూస్తున్న పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ కీలక నిర్ణయం తీసుకుంది. నగర పరిధిలో నడిచే మెట్రో ఏసీ , డీలక్స్ బస్సుల టికెట్ ధరలపై 30 శాతం రాయితీని ప్రకటిస్తూ ప్రయాణికులకు ఊరటనిచ్చింది.బంకుల వద్ద వాహనదారులు బారులు తీరి ఇబ్బందులు పడటం కంటే, క్షేమంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం ఉత్తమమని ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి సూచించారు. "పెట్రోల్ కష్టాలు పడటం ఎందుకు దండగ.. ఆర్టీసీ బస్సులు ఉండగా" అంటూ ఆయన ప్రయాణికులను ఉద్దేశించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఇంధన కొరత వార్తల నేపథ్యంలో సామాన్య ప్రజలకు ప్రయాణ భారం తగ్గించేందుకే ఈ రాయితీని అమలు చేస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. నగరంలోని ప్రధాన మార్గాల్లో నడిచే మెట్రో ఏసీ, డీలక్స్ సర్వీసులన్నింటికీ ఈ 30 శాతం రాయితీ వర్తిస్తుందని ఆర్టీసీ స్పష్టం చేసింది. సొంత వాహనాలపై పెట్రోల్ ఖర్చు పెరగడం , బంకుల వద్ద రద్దీ పెరగడంతో, చాలా మంది ప్రయాణికులు ఇప్పుడు ఆర్టీసీ వైపు మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈ నిర్ణయం వల్ల అటు ప్రయాణికులకు ఆర్థికంగా కలిసి రావడమే కాకుండా, నగర రోడ్లపై వ్యక్తిగత వాహనాల రద్దీ కూడా తగ్గే అవకాశం ఉందని భావిస్తున్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ప్రజలు పుకార్లను నమ్మి ఆందోళన చెందవద్దని, ప్రజా రవాణా వ్యవస్థను ఉపయోగించుకోవాలని ఆర్టీసీ యాజమాన్యం కోరింది. సామాన్యులకు ఇబ్బంది కలగకుండా మరిన్ని అదనపు బస్సులను కూడా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆర్టీసీ ప్రకటించిన ఈ రాయితీతో మెట్రో ఏసీ, డీలక్స్ బస్సుల్లో ప్రయాణించే వారి సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం కనిపిస్తోంది.

# ఏప్రిల్ 1 నుంచి చికెన్ షాపులు బంద్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్) :**



పౌల్ట్రీ కంపెనీలు అందిస్తున్న తక్కువ మార్జిన్ల కారణంగా తాము తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నామని తెలంగాణ చికెన్ వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో చికెన్ ధరలు పెరిగినప్పటికీ, కంపెనీల నిబంధనలు మరియు మధ్యవర్తుల ప్రమేయం వల్ల క్షేత్రస్థాయిలో వ్యాపారులకు తగిన లాభం దక్కడం లేదని వారు పేర్కొంటున్నారు. తమ సమస్యలపై పౌల్ట్రీ యాజమాన్యాలకు ఎన్నిసార్లు విన్నవించినా సానుకూల స్పందన రాకపోవడంతో, నిరవధిక సమ్మెకు వెళ్లాలని వ్యాపార సంఘాలు తీర్మానించాయి.ప్రస్తుత మార్జిన్లతో దుకాణాల అద్దెలు, కరెంట్ బిల్లులు , సిబ్బంది ఖర్చులు భరించడం కష్టంగా మారిందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకుని పౌల్ట్రీ కంపెనీలతో చర్చలు జరపాలని, తమకు గిట్టుబాటు అయ్యేలా మార్జిన్లను పెంచాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ఏప్రిల్ 1 నుంచి ప్రారంభం కానున్న ఈ బంద్ వల్ల రాష్ట్రవ్యాప్తంగా చికెన్ సరఫరా నిలిచిపోయి, వినియోగదారులకు ఇబ్బందులు తప్పేలా లేవు. డిమాండ్లు నెరవేరే వరకు వెనక్కి తగ్గేది లేదని వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు.



# పులివెందుల మెడికల్ కాలేజీని వెంటనే ప్రారంభించాలి

**పులివెందుల (ఏడీఎన్ఎన్):**

పులివెందుల ప్రభుత్వ వైద్య కళాశాలను వెంటనే ప్రారంభించి, 2026 27 విద్యా సంవత్సరంలో అడ్మిషన్లు కల్పించాలని కోరుతూ జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వేంపల్లిలో బుధవారం నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం పులివెందుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడం శోచనీయమన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే 50 ఎకరాల భూమితో పాటు భవన నిర్మాణాల కోసం సుమారు రూ. 412 కోట్లు ఖర్చు చేశారని, ప్రస్తుతం 625 పడకల బోధన ఆసుపత్రి మరియు నర్సింగ్ కళాశాల భవనాలు 100 శాతం పూర్తయ్యాయని వివరించారు. మెడికల్ కాలేజీ భవనాలు కూడా 60 శాతం పైగా పూర్తయినప్పటికీ, ప్రభుత్వం అడ్మిషన్ల ప్రక్రియను పట్టించుకోకపోవడం అన్యాయమని వారు మండిపడ్డారు.నేషనల్ మెడికల్ కమిషన్ గతంలోనే 50 ఎంబీబీఎస్ సీట్లను కేటాయించినప్పటికీ, చంద్రబాబు ప్రభుత్వం వసతులు లేవనే సాకుతో ఆ సీట్లను వద్దని లేఖ రాయడం వల్ల పులివెందుల కళాశాల గత రెండు విద్యా సంవత్సరాల్లో సుమారు 200 సీట్లను కోల్పోయిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఒకవైపు పిడుగురాళ్ల మెడికల్ కాలేజీని ప్రారంభిస్తున్న ప్రభుత్వం, పులివెందుల విషయంలో ఎందుకు మొండివైఖరి ప్రదర్శిస్తోందని నిలదీశారు. ప్రభుత్వం తక్షణమే ఎన్.ఎమ్.సితో చర్చించి, 202627 విద్యా సంవత్సరంలో 100 ఎంబీబీఎస్ సీట్లు మరియు 24 పీజీ సీట్లతో కళాశాలను ప్రారంభించాలని వారు డిమాండ్ చేశారు.ఈ నేపథ్యంలో పులివెందుల మెడికల్ కాలేజీ ప్రస్తుత పరిస్థితిని అధ్యయనం చేసేందుకు గురువారం ఉదయం 11 గంటలకు వైద్య కళాశాల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో అఖిలపక్ష నేతలు సందర్శించనున్నట్లు వారు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, వైకాపా నేత ఎస్. సతీష్ కుమార్ రెడ్డి, సీపీఎం నేత కె. ప్రభాకర్ రెడ్డితో పాటు పలువురు సామాజిక ఉద్యమ నేతలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. మీడియా సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నేతలు డాక్టర్ సుబ్రహ్మణ్యం, అమర్నాథరెడ్డి, రవీంద్రనాథ్ రెడ్డి తదితరులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు.



# "తేనెటీగల దాడిలో.. కానిస్టేబుల్ మృతి"

**అమరావతి (ఏడీఎన్ఎన్) :**

నంద్యాల జిల్లాలోని శ్రీశైలం ఆనకట్ట వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ గుండెపోటుతో మృతి చెందిన ఘటన విషాదాన్ని మిగిల్చింది. విధుల్లో ఉన్న సమయంలో తేనెటీగల దాడి జరగడం, ఆ ఆందోళనలో గుండెపోటుకు గురవడం ఈ ఘటనలో విషాదాంశంగా మారింది. వివరాల ప్రకారం... ఎస్పీఎఫ్‌కు చెందిన కానిస్టేబుల్ పిల్లి వీరాస్వామి (52) గత కొన్నిరోజులుగా శ్రీశైలం ఆనకట్ట వద్ద భద్రతా విధులు నిర్వహిస్తున్నారు. బుధవారం ఉదయం విధుల్లో ఉండగా ఆకస్మికంగా అక్కడ గూడుకట్టిన తేనెటీగల గుంపు ఆయనపై దాడి చేసినట్లు సమాచారం.తేనెటీగల దాడి నుంచి తప్పించుకునే క్రమంలో వీరాస్వామి తీవ్ర ఆందోళనకు గురై గుండెపోటుకు లోనయ్యారు. ఘటనాస్థలంలోనే కుప్పకూలిన ఆయనను సహచర సిబ్బంది అప్రమత్తంగా ఆసుపత్రికి తరలించగా, అప్పటికే ఆయన మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. సమాచారం అందుకున్న ఉన్నతాధికారులు ఘటనాస్థలాన్ని సందర్శించి పరిస్థితులను పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనతో పోలీసు విభాగంలో విషాద వాతావరణం నెలకొంది. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.



# అత్తాపూర్‌లో కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్

**హైదరాబాద్ (ఏడీఎన్ఎన్):**

నగరంలోని అత్తాపూర్‌లో భారీ ఎత్తున సాగుతున్న నకిలీ అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కేంద్రాన్ని పోలీసులు బట్టబయలు చేశారు. 'డెక్కన్ ట్రేడర్స్' పేరుతో నిర్వహిస్తున్న గోదాములపై హైదరాబాద్ సిటీ కమిషనర్ టాస్క్ ఫోర్స్ ,ఆహార కల్తీ నియంత్రణ విభాగం అధికారులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 70 క్వింటాళ్ల కల్తీ అల్లం వెల్లుల్లి పేస్ట్‌ను స్వాధీనం చేసుకుని, ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు.తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు గడించడమే లక్ష్యంగా నిందితులు ఎం.ఎం. పహాడీ ప్రాంతంలోని రెండు వేర్వేరు గోదాముల్లో ఈ అక్రమ దందాను కొనసాగిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు హాని కలిగించే శాంటిక్ యాసిడ్, ఎసిటిక్ యాసిడ్, సింథటిక్ ఫుడ్ కలర్స్ ,వెల్లుల్లి పొట్టును కలిపి ఈ నకిలీ పేస్ట్‌ను తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. తయారీ కేంద్రం అత్యంత అపరిశుభ్రంగా, ఈగలు, దుమ్ము ధూళి మధ్య ఉండటం గమనార్హం. ఇలా తయారు చేసిన ప్రమాదకరమైన పేస్ట్‌ను ప్లాస్టిక్ డబ్బాల్లో నింపి నగరంలోని హోల్‌సేల్ కిరాణా దుకాణాలకు క్యాటరింగ్ సర్వీసులకు సరఫరా చేస్తున్నట్లు విచారణలో తేలింది.



## టీ20 హీరోలకు వన్డే ప్రపంచకప్ షాక్?

**గిల్ చేతికి పగ్గాలు.. కోహ్లీ, రోహిత్ అండ!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

టీ20 ప్రపంచకప్‌లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసి విశ్వవిజేతగా నిలిచిన టీమిండియా, ఇప్పుడు తన తదుపరి లక్ష్యంపై కన్నేసింది. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనున్న 2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత క్రికెట్ నియంత్రణ మండలి ఇప్పుడే మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. అయితే, టీ20 ఫార్మాట్‌లో మెరిసిన పలువురు స్టార్లకు బీసీసీఐ షాక్ ఇవ్వనుందని వార్తలు వస్తున్నాయి. కొందరికి వన్డే జట్టులో చోటు దక్కడం కష్టమేనన్న సంకేతాలు వెలువడుతున్నాయి. వన్డే క్రికెట్ అంటే కేవలం మెరుపు దాడులు మాత్రమే కాదు.. సుదీర్ఘ ఇన్నింగ్స్ లు నిర్మించే ఓర్పు, సహనం అవసరం. ఈ నేపథ్యంలో, టీ20 స్పెషలిస్టులుగా ముద్రపడిన సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, సూర్యకుమార్ యాదవ్, రింకూ సింగ్, అభిషేక్ శర్మ వంటి ఆటగాళ్లకు 2027 వన్డే జట్టులో చోటు దక్కకపోవచ్చని తెలుస్తోంది. దేశవాళీ క్రికెట్‌లో అసాధారణంగా రాణిస్తే తప్ప, వన్డే ఫార్మాట్‌లో వీరి పునరాగమనం కష్టమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. భవిష్యత్తు సారథిగా శుభ్‌మన్ గిల్‌ను సిద్ధం చేయాలని సెలక్టర్లు గట్టి నిర్ణయంతో ఉన్నారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ సిరీస్‌లలో ఆశించిన ఫలితాలు రాకపోయినా, గిల్ నాయకత్వ లక్షణాలపై యాజమాన్యం నమ్మకంగా ఉంది. మరోవైపు, వయసు పెరుగుతున్నా రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల ఫామ్, అనుభవం జట్టుకు అత్యంత కీలకం కానుంది. ఫిట్‌నెస్‌ను కాపాడుకుంటే ఈ ఇద్దరు దిగ్గజాలు 2027 ప్రపంచకప్‌లో ఆడటం ఖాయంగా కనిపిస్తోంది. మిడిల్ ఆర్డర్‌లో కేఎల్ రాహుల్ వికెట్ కీపర్ బ్యాటర్‌గా, బౌలింగ్ విభాగంలో జస్ప్రీత్ బుమ్రా ప్రధాన అస్త్రంగా జట్టుకు వెన్నెముకలా నిలవనున్నారు. శ్రేయస్ అయ్యర్, హార్దిక్ పాండ్యా, కుల్దీప్ యాదవ్ వంటి సీనియర్లు తమ స్థానాలను సుస్థిరం చేసుకునే పనిలో ఉన్నారు. శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, యశస్వి జైస్వాల్ వంటి బ్యాటర్లకు, రిషబ్ పంత్, కేఎల్ రాహుల్ వికెట్ కీపర్లుగా, హార్దిక్ పాండ్యా, అక్షర్ పటేల్, రవీంద్ర జడేజా వంటి ఆల్ రౌండర్లు, జస్ప్రీత్ బుమ్రా, కుల్దీప్ యాదవ్, అర్ష్ దీప్ సింగ్, ప్రసిద్ధ్ కృష్ణ, హర్షిత్ రాణా వంటి బౌలర్లకు టీమ్‌లో చోటు దొరికే ఛాన్సులు బలంగా ఉన్నాయి.

## మహీంద్రా ఈవీ ధమాకా సేల్స్

**ఎలక్ట్రిక్ కార్లపై రూ. 4 లక్షల వరకు భారీ తగ్గింపు!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరల నేపథ్యంలో ఎలక్ట్రిక్ వాహనాల (EV) వైపు మొగ్గు చూపుతున్న వినియోగదారులకు మహీంద్రా అదిరిపోయే గుడ్ న్యూస్ చెప్పింది. మార్చి 2026 నెలాఖరు వరకు తన ఎలక్ట్రిక్ కార్ల శ్రేణిపై రూ. 4 లక్షల వరకు భారీగా ధమాకా సేల్స్ ప్రకటించింది. ఈ ఆర్థిక సంవత్సరం ముగింపు సందర్భంగా స్టాక్ క్లియర్ చేయడానికి తమ ఎలక్ట్రిక్ వాహనాల మొదటి వార్షికోత్సవ వేడుకల భాగంగా ఈ ఆఫర్లను ఇస్తోంది. మహీంద్రా XUV400 EL ప్రో పై అత్యధికంగా రూ.4 లక్షల తగ్గింపు ఉంది. ఒక్కసారి ఛార్జ్ చేస్తే వరుసగా 359 కి.మీ నుండి 456 కి.మీ రేంజ్ అందిస్తుంది. దీని ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 17.49 లక్షల నుండి ప్రారంభమవుతుంది. మహీంద్రా BE 6 కారు రూ. 2.95 లక్షల వరకు డిస్కౌంట్ ఉంది. ఇటీవల విడుదలైన 'బ్యాట్‌మాన్ ఎడిషన్' కోసం కంపెనీ ప్రత్యేక బైబ్యాక్ ఆఫర్‌ను కూడా ప్రకటించింది. లగ్జరీ టెక్నాలజీ కలయికతో వచ్చిన మహీంద్రా XEV 9e ఫ్లాగ్‌షిప్ మోడల్‌పై కూడా ఆకర్షణీయమైన ఆఫర్లు ఉన్నాయి. దీనిపై గరిష్టంగా రూ. 2.95 లక్షల వరకు ప్రయోజనాలు లభిస్తున్నాయి ఇందులో రూ. 1.4 లక్షల నుండి రూ. 1.5 లక్షల వరకు నేరుగా నగదు తగ్గింపు ఉంటుంది. ఇది రియర్‌వీల్ డ్రైవ్‌తో వస్తుంది. 59 kWh వేరియంట్ 228 bhp శక్తిని, 79 kWh వేరియంట్ 282 bhp శక్తిని ఉత్పత్తి చేస్తుంది. దీని ప్రారంభ ఎక్స్‌షోరూమ్ ధర రూ. 21.90 లక్షల నుండి ఉంది. ఈ ఆఫర్లు మార్చి 31, 2026 వరకు మాత్రమే వర్తిస్తాయి.



## రిలయన్స్ జియోస్టార్ సీఈఓ రాజీనామా

**ఓపెన్‌ఏఐలో కీలక పదవి!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారతీయ మీడియా రంగంలో సంచలనం రేపుతూ రిలయన్స్ నేతృత్వంలోని జియోస్టార్ సీఈఓ కిరణ్ మణి తన పదవికి రాజీనామా చేశారు. ప్రపంచ ప్రసిద్ధ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సంస్థ ఓపెన్‌ఏఐ నుండి భారీ ఆఫర్ రావడంతో ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు. కిరణ్ మణి ఓపెన్‌ఏఐలో ఆసియాపసిఫిక్ ప్రాంత ఎండీగా బాధ్యతలు చేపట్టనున్నారు. కిరణ్ మణి రాజీనామాను జియోస్టార్ వైస్ ఛైర్మన్ ఉదయ్ శంకర్ ధ్రువీకరించారు. ఈ మేరకు సంస్థ ఉద్యోగులకు అంతర్గత ఈమెయిల్స్ పంపారు. జూన్ నెలలో ఆయన ఓపెన్‌ఏఐలో తన కొత్త బాధ్యతలను స్వీకరించనున్నారు. అమెరికా, యూరప్ మార్కెట్ల తర్వాత అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఆసియా పసిఫిక్ ప్రాంతంపై ఓపెన్‌ఏఐ ప్రత్యేక దృష్టి సారించింది. ముఖ్యంగా ఆంత్రోపిక్, గూగుల్ వంటి సంస్థల నుండి గట్టి పోటీ ఎదురవుతున్న తరుణంలో కిరణ్ మణి నియామకం ప్రాధాన్యత సంతరించుకుంది. టెక్నాలజీ డిజిటల్ మీడియా విభాగంలో కిరణ్ మణికి రెండు దశాబ్దాలకు పైగా అపారమైన అనుభవం ఉంది. జియోస్టార్‌లో చేరకముందు ఆయన సుమారు 13 ఏళ్ల పాటు గూగుల్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. గూగుల్‌కు ముందు మైక్రోసాఫ్ట్, ఐబీఎం వంటి దిగ్గజ టెక్ సంస్థల్లో పనిచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో గ్లోబల్ లీడర్‌గా ఉన్న ఓపెన్‌ఏఐలో ఒక భారతీయుడు కీలక పదవిని చేపట్టడం గమనార్హం.

# సౌతాఫ్రికాను చిత్తు చేసిన కివీస్

**రోహిత్, అభిషేక్ రికార్డులు బ్రేక్ చేసిన కివీస్ కెప్టెన్**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



సొంతగడ్డపై న్యూజిలాండ్ మహిళల జట్టు జైత్రయాత్ర కొనసాగింది. సౌతాఫ్రికా మహిళలతో జరిగిన ఐదో టీ20లో కివీస్ 92 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌ను 4-1తో సొంతం చేసుకుని దక్షిణాఫ్రికాపై సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. ఈ మ్యాచ్‌లో కెప్టెన్ అమేలియా కెర్ ఆకాశమే హద్దుగా చెలరేగి రికార్డుల వేట కొనసాగించింది. ఈ మ్యాచ్ ద్వారా అమేలియా కెర్ ప్రపంచ క్రికెట్‌లో పలు రికార్డులను తన పేరిట లిఖించుకుంది. అంతర్జాతీయ టీ20ల్లో వరుసగా 11 సార్లు 30 అంతకంటే ఎక్కువ పరుగులు చేసిన తొలి బ్యాటర్‌గా చరిత్ర సృష్టించింది. పురుషుల క్రికెట్‌లో రోహిత్ శర్మ, అభిషేక్ శర్మలు వరుసగా 7 సార్లు మాత్రమే ఈ ఘనత సాధించగా, అమేలియా వారిని వెనక్కి నెట్టింది. అంతేకాదు గతంలో చమేరీ ఆటపట్టు, రెబెక్కా బ్లేక్ పేరిట ఉన్న 9 సార్ల రికార్డును కూడా ఆమె అధిగమించింది. గత 11 ఇన్నింగ్స్ ల్లో 669 పరుగులు చేయడంతో పాటు 12 వికెట్లు తీసింది. ఇటీవలే టీ20ల్లో వేగంగా 1000 పరుగులు, 100 వికెట్లు తీసిన తొలి మహిళా క్రికెటర్ గానూ ఆమె రికార్డు సృష్టించింది. తొలుత బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 194 పరుగులు చేసింది. కెప్టెన్ అమేలియా కెర్ కేవలం 55 బంతుల్లోనే 19 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 105 పరుగులు చేసి తన అంతర్జాతీయ టీ20 కెరీర్‌లో తొలి సెంచరీని నమోదు చేసింది. బ్రూక్ హాలిడే (26), జార్జియా పిల్మర్ (27) కీలక సహకారాన్ని అందించారు. 195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన సౌతాఫ్రికా, కివీస్ బౌలర్ల ధాటికి విలవిలలాడింది. 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి కేవలం 102 పరుగులు మాత్రమే చేయగలిగింది. లియా తాహుహు 3 వికెట్లతో చెలరేగగా, సోఫీ డివైన్, అమేలియా కెర్ చెరో రెండు వికెట్లు తీశారు. అద్భుత సెంచరీతో పాటు బౌలింగ్‌లోనూ రాణించిన అమేలియా కెర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్'తో పాటు 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డులను కైవసం చేసుకుంది.

# ఆర్ఆర్ డీల్‌తో షేన్ వార్న్ కుటుంబానికి కాసుల వర్షం!

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



క్రికెట్ హిస్టరీలో రికార్డ్ డీల్: వేల కోట్లు పలికిన రాజస్థాన్, ఆర్సీబీ జట్లు!

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (IPL) 2026 సీజన్ ప్రారంభానికి ముందే క్రికెట్ ప్రపంచం ఊహించని భారీ వ్యాపార ఒప్పందాలకు వేదికైంది. ఐపీఎల్ తొలి సీజన్ విజేత రాజస్థాన్ రాయల్స్ (RR), డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB) ఫ్రాంఛైజీలు రికార్డు ధరలకు చేతులు మారాయి. ముఖ్యంగా రాజస్థాన్ రాయల్స్ విక్రయం, ఆ జట్టు మాజీ కెప్టెన్, దివంగత లెజెండ్ షేన్ వార్న్ కుటుంబానికి వందల కోట్ల లాభాన్ని తెచ్చిపెట్టడం విశేషం. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త కాల్ సోమాని నేతృత్వంలోని కన్సార్టియం రాజస్థాన్ రాయల్స్ జట్టులో 100 శాతం వాటాను కొనుగోలు చేసింది. ఈ ఒప్పందం విలువ సుమారు 1.63 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 15,341 కోట్లు). ఈ కన్సార్టియంలో రాబ్ వాల్టన్, హ్యాంప్ కుటుంబం వంటి దిగ్గజ పెట్టుబడిదారులు భాగస్వాములుగా ఉన్నారు. 2008లో ఈ జట్టు విలువ కేవలం రూ. 320 కోట్లు మాత్రమే కావడం గమనార్హం. అంటే గత 18 ఏళ్లలో జట్టు విలువ దాదాపు 48 రెట్లు పెరిగింది. ఈ భారీ డీల్ వల్ల అత్యధికంగా లాభపడింది ఎవరైనా ఉన్నారంటే అది ఆస్ట్రేలియా స్పిన్ మాంత్రికుడు షేన్ వార్న్ కుటుంబమే. 2008లో రాజస్థాన్ రాయల్స్ లో చేరినప్పుడు వార్న్ కేవలం ఆటగాడిగానే కాకుండా, తన భవిష్యత్తుపై గట్టి ముద్ర వేశారు. అప్పట్లో ఆయన పెట్టుకున్న ఒక నిబంధన నేడు ఆయన కుటుంబానికి శ్రీరామరక్షగా మారింది. కెప్టెన్‌గా, కోచ్‌గా సేవలు అందించినందుకు ప్రతిగా ఏటా 0.75 శాతం వాటా ఇచ్చేలా వార్న్ ఒప్పందం చేసుకున్నారు. రాజస్థాన్‌తో నాలుగేళ్లు కొనసాగిన వార్న్, మొత్తం 3 శాతం వాటాను దక్కించుకున్నారు. తాజా విక్రయ ఒప్పందం ప్రకారం, వార్న్ కుటుంబానికి రూ. 450 నుండి రూ. 460 కోట్ల వరకు దక్కనున్నట్లు సమాచారం. 2022లో వార్న్ హఠాన్మరణం చెందినప్పటికీ, పద్దెనిమిదేళ్ల క్రితం ఆయన వేసిన ఈ 'పెట్టుబడి' స్కెచ్ నేడు అద్భుత ఫలితాలను ఇస్తోంది. అయితే, ఈ వాటా విక్రయానికి బీసీసీఐ (BCCI) ఆమోదం లభించాల్సి ఉంది. మరోవైపు, ఆర్సీబీ ఫ్రాంఛైజీ కూడా సుమారు రూ. 16,753 కోట్ల భారీ ధరకు అమ్ముడుపోయినట్లు వార్తలు వస్తున్నాయి. ఐపీఎల్ 2026 తర్వాత ఈ కొత్త యాజమాన్యాలు జట్లను పూర్తిస్థాయిలో తమ ఆధీనంలోకి తీసుకోనున్నాయి.

# క్రికెట్‌లో వర్ణ వివక్ష: కన్నీళ్లు పెట్టుకున్న శివరామకృష్ణన్

**చేదు జ్ఞాపకాలను పంచుకున్న భారత మాజీ స్పిన్నర్**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



భారత క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రతిభావంతుడైన లెగ్ స్పిన్నర్‌గా గుర్తింపు పొందిన లక్ష్మణ్ శివరామకృష్ణన్, తన కెరీర్‌ను దెబ్బతీసిన కొన్ని చేదు నిజాలను బయటపెట్టారు. మైదానంలోనే కాకుండా డ్రెస్సింగ్ రూమ్‌లో కూడా తాను ఎదుర్కొన్న వర్ణ వివక్ష, జాతి అహంకార వ్యాఖ్యలు తనను మానసికంగా ఎంతగా కుంగదీశాయో మీడియా ఇంటర్వ్యూలో వివరించారు. శివరామకృష్ణన్ కేవలం 14 ఏళ్ల వయసులో నెట్ బౌలర్‌గా వెళ్లినప్పుడు ఎదురైన అవమానాన్ని గుర్తు చేసుకున్నారు. "స్కూల్ యూనిఫాంలో ఉన్న నన్ను ఒక సీనియర్ భారత బ్యాటర్ గదిలోకి పిలిచి, నన్ను గ్రౌండ్ స్టాఫ్ అనుకుని తన బూట్లు శుభ్రం చేయమన్నాడు. అది నా పని కాదని నేను ఖచ్చితంగా చెప్పినప్పటికీ, ఆ ఘటన నన్ను తీవ్రంగా బాధించింది" అని ఆయన తెలిపారు. సొంత జట్టు సభ్యుల నుండే తనకు వేధింపులు ఎదురయ్యాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. తమిళనాడు జట్టులో ఆడుతున్నప్పుడు కొందరు సీనియర్లు తనను 'కరుపా' (నల్లటివాడు) అని పిలిచేవారని చెప్పారు. ముంబై, జలంధర్ వంటి నగరాల్లో ఫీల్డింగ్ చేస్తున్నప్పుడు ప్రేక్షకులు కూడా 'కాలియా' అంటూ తన రంగును ఎగతాళి చేసేవారని గుర్తు చేసుకున్నారు. తన 17వ పుట్టినరోజున జరిగిన ఒక సంఘటన శివరామకృష్ణన్‌ను కన్నీళ్లు పెట్టించింది. "నా కోసం తెచ్చిన డార్క్ చాక్లెట్ కేక్‌ను చూపిస్తూ ఒక సీనియర్ ఆటగాడు.. 'హే సన్నీ, ఇంత నల్లటి అబ్బాయికి కరెక్ట్ రంగు కేక్ ఆర్డర్ చేశావ్' అని ఎగతాళి చేశాడు. ఆ మాటలకు నేను ఏడుస్తూ కేక్ కట్ చేయనని మొండికేశాను. అప్పుడు సునీల్ గవాస్కర్ నన్ను దగ్గరకు తీసుకుని ఓదార్చడంతో కన్నీళ్లతోనే కేక్ కట్ చేశాను" అని ఆనాటి బాధను పంచుకున్నారు. ఈ అవమానాలు, మానసిక వేధింపుల వల్లే తన కెరీర్ ఆశించిన స్థాయిలో సాగలేదని ఆయన పరోక్షంగా అభిప్రాయపడ్డారు. ప్రతిభ ఉన్నప్పటికీ, ఇలాంటి వివక్ష క్రీడాకారుల ఆత్మవిశ్వాసాన్ని ఎలా దెబ్బతీస్తుందో శివరామకృష్ణన్ ఉదాహరణగా నిలిచారు.

# ఏఐ (AI) తో జాగ్రత్త: ఈ ప్రశ్నలు అడగకండి

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**



మీ సీక్రెట్స్ సేఫ్‌గా ఉంచుకోవాలంటే చాట్‌బాట్స్ తో ఇలా వ్యవహరించండి!

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (AI) మన పనులను సులభతరం చేస్తోంది అనడంలో సందేహం లేదు. అయితే, చాట్ జీపీటీ, జెమిని ఏఐ వంటి టూల్స్‌ను వాడేటప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే వ్యక్తిగత భద్రతకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. టెక్ నిపుణులు కొన్ని కీలక అంశాలు విషయంలో హెచ్చరిస్తున్నారు. మీ బ్యాంక్ ఖాతా నంబర్లు, పాస్‌వర్డ్ లు, ఆధార్ లేదా పాన్ వివరాలను చాట్‌బాట్‌లో ఎప్పుడూ టైప్ చేయకండి. మీరు షేర్ చేసే సమాచారం క్లౌడ్ సర్వర్‌లలో నిక్షిప్తమవుతుంది, అది మీ నియంత్రణలో ఉండదు. ఆఫీస్ రహస్య పత్రాలను కూడా ఇక్కడ అప్‌లోడ్ చేయడం వల్ల డేటా లీక్ అయ్యే ప్రమాదం ఉంది. చాలా మంది శారీరక నొప్పులకే కాకుండా, మానసిక ఒత్తిడి, డిప్రెషన్ వంటి సమస్యలకు కూడా AI సలహాలు తీసుకుంటున్నారు. గుర్తుంచుకోండి, AI కేవలం సమాచారాన్ని మాత్రమే ఇస్తుంది, అది డాక్టర్ లేదా థెరపిస్ట్ కు ప్రత్యామ్నాయం కాదు. తప్పుడు మందులు లేదా చికిత్స ప్రాణాపాయానికి దారితీయవచ్చు. హ్యాకింగ్ పద్ధతులు, బాంబుల తయారీ లేదా చట్టవిరుద్ధమైన పనుల గురించి సరదాగా కూడా సెర్చ్ చేయకండి. ఇలాంటి ప్రశ్నలను టెక్ కంపెనీలు గమనిస్తాయి, ఇది మిమ్మల్ని అనవసరమైన చట్టపరమైన ఇబ్బందుల్లోకి నెట్టవచ్చు. చాట్ జీపీటీ ఇచ్చే ప్రతి సమాచారం నూటికి నూరు శాతం నిజం కాదు. ఇది కొన్నిసార్లు తప్పుడు సమాచారాన్ని కూడా నిజంలాగే భ్రమింపజేస్తుంది. ఏదైనా ముఖ్యమైన వార్తను లేదా విషయాన్ని నమ్మే ముందు ఇతర విశ్వసనీయ వనరుల ద్వారా ధృవీకరించుకోవడం మంచిది. ఉద్యోగం, పెళ్లి లేదా వ్యక్తిగత సంబంధాల వంటి కీలక నిర్ణయాలను AIకి వదిలేయకండి. AIకి భావోద్వేగాలు ఉండవు, అది కేవలం డేటా ఆధారంగా సమాధానాలు ఇస్తుంది. మీ పరిస్థితులు, అనుభవాలు మీకు మాత్రమే తెలుసు కాబట్టి, ఆ నిర్ణయాలు మీరే తీసుకోవడం ఉత్తమం. టెక్నాలజీ మనకు సహాయకారిగా ఉండాలి కానీ, మన జీవితాన్ని శాసించేదిగా మారకూడదు. విజ్ఞతతో వాడుకుంటేనే AI ఒక వరంగా ఉంటుందని పేర్కొన్నారు.

# ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ మాయాజాలం

**డార్క్ ప్యాటర్న్స్‌పై కేంద్రం సీరియస్!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**




దేశంలో డిజిటలైజేషన్ వేగంగా పెరుగుతున్న వేళ, ఆన్‌లైన్ ద్వారా ఇన్సూరెన్స్ కొనుగోలు చేయడం ఒకప్పుడు సౌకర్యంగా అనిపించినా, ఇప్పుడు అది వినియోగదారులకు పెద్ద తలనొప్పిగా మారుతోంది. ఇది ఒక మాయాజాలంలా ఉందని అధికశాతం వినియోగదారులు చెప్తున్నారు. ప్రముఖ కమ్యూనిటీ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్ 'లోకల్ సర్కిల్స్' దేశవ్యాప్తంగా నిర్వహించిన తాజా సర్వేలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంపై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తీవ్రంగా స్పందించారు. ఆర్థిక ఉత్పత్తుల తప్పుదారి విక్రయాన్ని ఇకపై నేరంగా పరిగణిస్తామని ఆమె హెచ్చరించారు. బ్యాంకులు లేదా ఇన్సూరెన్స్ కంపెనీలు వినియోగదారుల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మరోవైపు, RBI కూడా వినియోగదారుల రక్షణ కోసం కొత్త మార్గదర్శకాలను సిద్ధం చేస్తోంది. ఆన్‌లైన్ ఇన్సూరెన్స్ రంగంలో పారదర్శకత పెంచకపోతే, డిజిటల్ ఆర్థిక లావాదేవీలపై ప్రజల్లో ఉన్న నమ్మకం సడలిపోయే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దేశంలోని 341 జిల్లాల్లో సుమారు 87 వేల మంది వినియోగదారుల అభిప్రాయాలను సేకరించగా, దాదాపు 80 శాతం మంది ఆన్‌లైన్ ప్లాట్‌ఫారమ్‌లలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. ముఖ్యంగా పాలసీని కొనుగోలు చేయడం సులభమే కానీ, దానిని రద్దు చేయడం మాత్రం గగనమవుతోందని సర్వే వెల్లడించింది. రద్దు ఆప్షన్‌ను వెబ్‌సైట్‌లలో వెతకడం కష్టతరం చేయడం లేదా పదుల సంఖ్యలో దశలను దాటాల్సి రావడం వంటి 'డార్క్ ప్యాటర్న్స్' పద్ధతులను కంపెనీలు వాడుతున్నాయని వినియోగదారులు వాపోతున్నారు. సుమారు 90 శాతం మంది వినియోగదారులు అవాంఛిత కాల్స్, మెసేజ్‌లు, వెబ్‌సైట్ పాప్‌అప్‌ల ద్వారా పాలసీలు కొనాలని ఒత్తిడి ఎదుర్కొంటున్నారు. కేవలం ప్రీమియం కోట్ తెలుసుకోవాలన్నా వ్యక్తిగత వివరాలు ఇవ్వాల్సి వస్తోందని 85 శాతం మంది తెలిపారు. దీనివల్ల నిత్యం స్పామ్ కాల్స్ వస్తున్నాయని ఫిర్యాదు చేశారు. ప్రారంభంలో తక్కువ ధర చూపి, పేమెంట్ చేసే సమయానికి ట్యాక్సులు, ఇతర ఛార్జీల పేరుతో ధర పెంచేస్తున్నారని 82 శాతం మంది పేర్కొన్నారు. క్లెయిమ్ సమయంలో లేదా కొనుగోలు సమయంలో దాచిన ఛార్జీలను ఎదుర్కొంటున్నట్లు 65 శాతం మంది వెల్లడించారు.



## బుమ్రాకు భార్య సంజనా ఫన్నీ వార్నింగ్

**'ధురంధర్ 2' డైలాగ్‌తో బుమ్రాను ఆటపట్టించిన సంజన!**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

థియేటర్లలో రికార్డులు సృష్టిస్తున్న 'ధురంధర్ 2' సినిమాలోని ఒక డైలాగ్ ఇప్పుడు ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. ఈ సినిమాలో ఒక డైలాగ్‌తో టీమిండియా స్టార్ ప్లేయర్ బుమ్రా భార్య సంజనా సోషల్ మీడియాలో అతనని ఆటపట్టించింది. అత్యంత కీలకమైన సన్నివేశంలో వచ్చే "ఘర్ కీ యాద్ నహీ ఆయీ తుఝే, జస్సీ?" (జస్సీ, నీకు ఇల్లు గుర్తురాలేదా?) అనే మాట ఇప్పుడు మీమ్స్ రాయుళ్లకు హాట్ ఫేవరెట్‌గా మారింది. సామాన్యుల నుంచి సెలబ్రిటీల వరకు ప్రతి ఒక్కరూ ఈ డైలాగ్‌ను వాడుతూ ఫన్నీ పోస్ట్‌లు చేస్తున్నారు. సంజనా పోస్ట్ నెటిజన్లను విపరీతంగా ఆకట్టుకుంటోంది. "జస్ప్రీత్ తన ఫ్రెండ్స్ తో కలిసి 'బాయ్స్ నైట్' ప్లాన్ చేసిన ప్రతిసారీ నా రియాక్షన్ ఇదే.." అంటూ " ఘర్ కీ యాద్ నహీ ఆయీ తుఝే, జస్సీ?" అని క్యాప్షన్ ఇచ్చారు. బుమ్రా ముద్దుపేరు కూడా 'జస్సీ' కావడంతో, సినిమా డైలాగ్‌ను ఆమె తన వ్యక్తిగత జీవితానికి అన్వయించి చేసిన ఈ పోస్ట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. సినిమాలో రణ్‌వీర్ సింగ్ (జస్సీ) పాకిస్థాన్‌లో భారత గూఢచారి 'హంజా'గా పనిచేస్తుంటాడు. అక్కడ అతడిని గుర్తించిన చిన్ననాటి స్నేహితుడు గుర్బాజ్ సింగ్ (పిండా), ఎంతో ఆవేదనతో.. "ఇన్నేళ్లవుతోంది.. నీకు ఇల్లు గుర్తురాలేదా జస్సీ?" అని అడుగుతాడు. సినిమాలో ఎంతో ఎమోషనల్ గా సాగే ఈ సీన్‌ను, నెటిజన్లు ఇప్పుడు తమ రోజువారీ జీవితాల్లోని ఫన్నీ సందర్భాలకు వాడుకుంటూ సందడి చేస్తున్నారు.



## ఐపీఎల్‌లో మెగా డీల్: ఛైర్మన్‌గా మాజీ క్రికెటర్ ఆర్యమన్!

**బిర్లా 'రాయల్' ఎంట్రీ: రూ. 16 వేల కోట్లకు ఆర్సీబీ విక్రయం**

**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఐపీఎల్ చరిత్రలో అత్యంత క్రేజ్ ఉన్న ఫ్రాంఛైజీ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు సరికొత్త శకంలోకి అడుగుపెట్టింది. సుమారు 1.78 బిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో రూ. 16,000 కోట్లకు పైగా) భారీ ఒప్పందంతో ఆదిత్య బిర్లా గ్రూప్ నేతృత్వంలోని కన్సార్టియం ఈ జట్టును సొంతం చేసుకుంది. ఈ మెగా డీల్‌తో మాజీ క్రికెటర్, యువ పారిశ్రామికవేత్త ఆర్యమన్ బిర్లా ఆర్సీబీ కొత్త ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ నుండి ఆర్సీబీ పురుషుల, మహిళల జట్లను ఆదిత్య బిర్లా గ్రూప్ కొనుగోలు చేసింది. ఈ కన్సార్టియంలో టైమ్స్ ఆఫ్ ఇండియా గ్రూప్, బోల్ట్ వెంచర్స్, బ్లాక్‌స్టోన్ వంటి ప్రపంచ స్థాయి సంస్థలు భాగస్వాములుగా ఉండటం విశేషం. రాజస్థాన్ రాయల్స్ విక్రయం తర్వాత ఐపీఎల్‌లో ఇది మరో అతిపెద్ద డీల్‌గా నిలిచింది. ప్రముఖ పారిశ్రామికవేత్త కుమార్ మంగళం బిర్లా కుమారుడైన ఆర్యమన్ బిర్లాకు క్రికెట్‌తో విడదీయలేని అనుబంధం ఉంది. మధ్యప్రదేశ్ తరపున దేశవాళీ క్రికెట్ ఆడిన ఆర్యమన్, రజత్ పాటిదార్ వంటి ఆటగాళ్లతో కలిసి డ్రెస్సింగ్ రూమ్ పంచుకున్నారు. ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో సెంచరీ సాధించిన రికార్డు కూడా ఆయనకు ఉంది. 2018లో రాజస్థాన్ రాయల్స్ జట్టు ఆర్యమన్‌ను కొనుగోలు చేసినప్పటికీ, ఒక్క మ్యాచ్ ఆడే అవకాశం రాలేదు. తీవ్రమైన ఆందోళన కారణంగా క్రికెట్ నుండి విరామం తీసుకున్న ఆయన, ఇప్పుడు వ్యాపార రంగంలో రాణిస్తూ తన సొంత జట్టుకే బాస్ అయ్యారు. ఆర్సీబీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టడంపై ఆర్యమన్ స్పందిస్తూ.. "క్రీడలు, మీడియా రంగాలపై మాకున్న అవగాహనతో ఆర్సీబీని మరిన్ని శిఖరాలకు చేరుస్తాం" అని ధీమా వ్యక్తం చేశారు. ఒకప్పుడు 30 లక్షల రూపాయల ఆటగాడిగా ఐపీఎల్‌లోకి ప్రవేశించి.. నేడు 16 వేల కోట్ల జట్టుకు యజమానిగా మారడం ఆర్యమన్ బిర్లా సాధించిన అరుదైన ఘనతేనని చెప్పాల్సిందే.

## క్రెడ్ యాప్‌లో బయోమెట్రిక్ పేమెంట్స్ షురూ!

**ఫేస్, ఫింగర్ ప్రింట్‌తోనే రూ. 5,000 వరకు పేమెంట్స్!**




**ఇంటర్నెట్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

డిజిటల్ లావాదేవీలను మరింత వేగంగా, సురక్షితంగా మార్చే దిశగా ప్రముఖ ఫిన్‌టెక్ ప్లాట్‌ఫారమ్ క్రెడ్ కీలక అడుగు వేసింది. ఇకపై యూజర్లు తమ యూపీఐ చెల్లింపుల కోసం పిన్ నంబర్ ఎంటర్ చేయాల్సిన అవసరం లేకుండానే, కేవలం బయోమెట్రిక్ అథెంటికేషన్ ద్వారా లావాదేవీలు పూర్తి చేసే సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తెచ్చింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సహకారంతో క్రెడ్ ఈ ఫీచర్‌ను అభివృద్ధి చేసింది. దీని ద్వారా యూజర్లు తమ ముఖ గుర్తింపు లేదా వేలిముద్ర ఉపయోగించి రూ. 5,000 వరకు సులభంగా చెల్లింపులు చేసుకోవచ్చు. ఆండ్రాయిడ్ ఐఓఎస్ వినియోగదారులందరికీ ఈ సదుపాయం అందుబాటులోకి వచ్చింది. కార్డు పేమెంట్స్ చేసేటప్పుడు వేగంగా అథెంటికేషన్ చేయవచ్చు. కరెంటు, గ్యాస్ వంటి బిల్లుల చెల్లింపులకు వాడుకోవచ్చు. దుకాణాల్లో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి పేమెంట్ చేసేటప్పుడు ఇది ఉపయోగపడుతుంది. ఒక వ్యక్తి నుంచి మరొకరికి నగదు పంపే సమయంలోనూ ఈ బయోమెట్రిక్ సదుపాయం లభిస్తుంది. చాలా సందర్భాల్లో యూపీఐ పిన్ నంబర్ ఇతరులకు తెలిసే ప్రమాదం ఉంటుంది. బయోమెట్రిక్ పద్ధతి వల్ల పిన్ బయటకు పొక్కకుండా పూర్తి భద్రత లభిస్తుందని క్రెడ్ ప్రతినిధులు తెలిపారు. అంతేకాకుండా, పిన్ నంబర్ మర్చిపోవడం లేదా పొరపాటుగా ఎంటర్ చేయడం వంటి ఇబ్బందులను కూడా ఈ ఫీచర్ ద్వారా అధిగమించవచ్చు. ఇటీవలే ఎన్పీసీఐకి చెందిన భీమ్ యాప్ కూడా ఇలాంటి సదుపాయాన్ని ప్రవేశపెట్టిన సంగతి తెలిసిందే.

సంక్షేమ మనసర్కార్
Follow: manasarkar
గురువారం | హైదరాబాద్
26.03.2026
www.manasarkar.com

# యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో..



**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేనికి 'ఆంధ్రా కింగ్ తాలుకా' చిత్రం పూర్తిగా నిరాశపరిచింది. బాక్సాఫీస్ వద్ద గట్టిగానే బోల్తా పడింది. ఈ చిత్రం తర్వాత ఇంతవరకు రామ్ కొత్త కబురేమీ వినిపించలేదు. ఈ గ్యాప్ లో రామ్ పలువురు దర్శకుల కథలు విన్నట్లు సమాచారం. అంతేకాదు తానే స్వయంగా ఒక కథను కూడా సిద్ధం చేసుకున్నారట. అయితే ఇప్పటివరకు ఏ ప్రాజెక్ట్ కూడా ఫైనల్ కాలేదు. ఇలాంటి సమయంలో రామ్ పోతినేని తన నెక్స్ట్ మూవీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో వార్తలు వినిపిస్తున్నాయి. ప్రముఖ దర్శకుడు లోకేష్ కనగరాజ్ శిష్యుడు లోగి విఘ్నేశ్ చెప్పిన కథకు రామ్ ఓకే చెప్పాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు వేగంగా జరుగుతున్నాయని సమాచారం. నిర్మాణ సంస్థపై స్పష్టత రాగానే అధికారికంగా ప్రకటించనున్నారని న్యూస్ చక్కర్లు కొడుతున్నాయి. రామ్ కొత్త సినిమా యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందనుందని సమాచారం. భారీ బడ్జెట్తో, స్టైలిష్ టేకింగ్తో ఈ ప్రాజెక్ట్ను తెరకెక్కించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. రామ్ పోతినేని కూడా ఈ సినిమాలో కొత్త లుక్లో కనిపించే అవకాశాలు ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. మొత్తంగా రామ్ నెక్స్ట్ మూవీపై నెలకొన్న అనిశ్చితికి తెరపడినట్టే కనిపిస్తోంది. అధికారిక ప్రకటన త్వరలోనే వెలువడే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్ట్ అయినా రామ్ బాక్సాఫీస్ వద్ద సత్తా చాటుతాడా లేదా అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.



# కడుపుబ్బ నవ్వించే కామెడీ!


**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

స్టార్ ఫిల్మ్ ఫ్యాక్టరీ బ్యానర్ పై తెలంగాణ యాస, భాష నేపథ్యంలో విలేజ్ నేటివిటితో తెరకెక్కిన అవుట్ అండ్ అవుట్ కామెడీ ఎంటర్ టైనర్ 'తురుమ్ ఖాన్ లు'. ఈ సినిమా గురించి తెలిసిన ప్రేక్షకులు ఈ చిత్రం ఓటీటీలో ఎప్పుడు వస్తుందా అని ఎదురు చూశారు. ఎట్టకేలకు ఇటీవల ఆహా ఓటీటీ వేదికగా స్ట్రీమింగ్ అవుతుంది. ఈ చిత్రానికి సంబంధించిన ప్రమోషన్ కామెడీ బిట్లు సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి. కడుపుబ్బ నవ్వించే కామెడీ సన్నివేశాలతో ఆద్యాంతం అలరించేలా సాగే ఈ చిత్రం ఇన్నాళ్లు ఎక్కడ ఉందని ప్రేక్షకులు కామెంట్లు పెడుతున్నారు అంటే... ఈ చిత్రం వారి హృదయాలకు ఎంతలా హత్తుకుందో అర్థం చేసుకోవచ్చు. ఇంత అద్భుతమైన సినిమా ఇప్పటికైనా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలుపుతున్నారు. ఈ సినిమాకు థియేటర్ లలో విడుదలై మంచి రెస్పాన్స్ వచ్చింది. కానీ ఎక్కువమందికి రీచ్ కాలేదు. యాక్టర్స్ కొంత వారే కావడంతో రీచ్ తగ్గిందేమో కానీ ఇప్పుడు ఓటీటీలో దూసుకుపోతున్న తీరు ఇండస్ట్రీనే ఆశ్చర్యపరుస్తుంది. సినిమా తెరకెక్కించిన డైరెక్టర్ ఎన్ శివ కల్యాణ్ కు మంచి మార్కులే పడుతున్నాయి. పల్లెల్లో ఉండే ఒరిజినల్ కామెడీని అందరికీ కనెక్ట్ అయ్యేలా రాసుకున్నారు దర్శకుడు. అలాగే అందరూ టెక్నీషన్స్, యాక్టర్లు కూడా అద్భుతంగా చేశారు. ముఖ్యంగా దేవరాజ్ పాలమూర్ చేసే కామెడీ బాగా కనెక్ట్ అవుతుంది. ఆయన డైలాగ్ మాడ్యూలేషన్ విపరీతంగా నవ్వు తెప్పిస్తుంది. మొత్తం తురుమ్ ఖాన్ సినిమా విషయంలో నిర్మాతకే ఎక్కువ క్రెడిట్ ఇస్తున్నారు.

# 'పెద్ది' షూట్‌లో చరణ్‌కి గాయం..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా జాన్వీ కపూర్ హీరోయిన్ గా దర్శకుడు బుచ్చిబాబు సానా తెరకెక్కిస్తున్న అవైటెడ్ చిత్రమే 'పెద్ది'. మంచి అంచనాలు సెట్ చేసుకున్న ఈ సినిమా చిత్రీకరణ దాదాపు పూర్తి కావచ్చింది. ఈ నేపథ్యంలో ఊహించని విధంగా రామ్ చరణ్ కి చిన్నపాటి గాయం కావడం అభిమానుల్ని కొంచెం కలవర పెట్టింది. దీనితో చరణ్ బాబాయ్, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తన స్పందన అందించగా అది అభిమానుల్లో వైరల్ గా మారింది. "అగ్రశ్రేణి యువ కథానాయకుడు రాంచరణ్ 'పెద్ది' సినిమా చిత్రీకరణ సమయంలో గాయపడ్డారని తెలిసింది. రాంచరణ్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నాను." అని పవన్ పోస్ట్ చేశారు. దీనితో ఈ పోస్ట్ అభిమానుల్లో కొంత ధైర్యాన్ని అందించి వారిలో వైరల్ గా మారింది.





# 27న యూత్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

కెన్ కరునాస్, అనిష్మ అనిల్ కుమార్, దేవదర్శిని చేతన్, సూరజ్ వెంజరముడు, ప్రియాన్షి యాదవ్, మీనాక్షి దినేష్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తమిళ మూవీ 'యూత్' ఈ నెల 26న రిలీజ్ కావాల్సి ఉంది. అయితే అనివార్య కారణాలతో ఈ సినిమా ఒక రోజు ఆలస్యంగా ఈ నెల 27న థియేటర్స్ లోకి రాబోతోంది. పెయిడ్ ప్రీమియర్స్ పై ప్రకటన చేస్తామని ప్రొడ్యూసర్స్ వెల్లడించారు. ఇప్పటికే తమిళంలో ఘన విజయం సాధించిన ఈ చిత్రాన్ని ఈ 2సీ బ్యానర్ పై తెలుగు ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు హౌస్ ఫుల్ వినీత్, సందీప్. ఈ చిత్రానికి కెన్ కరునాస్ అండ్ గ్యాంగ్ దర్శకత్వం వహించారు. 'కమ్ విత్ యువర్ గ్యాంగ్, నోట్ నో ఏజ్ లిమిట్' అనే స్లోగన్ తో ఈ సినిమా ప్రమోషనల్ క్యాంపెయిన్ చేస్తున్నారు. ఈ మూవీ ప్రమోషనల్ కంటెంట్ కు, సాంగ్స్ కు హ్యూజ్ రెస్పాన్స్ వస్తోంది. యూత్ ఆడియెన్స్ ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో చూసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.



# కల్చరల్ డ్రామా దేత్తడి


**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

రౌడీ బాయ్స్, లవ్ మీ సినిమాలతో పాపులరైన యంగ్ ట్యాలెంటెడ్ ఆశిష్ హీరోగా, సక్సెస్‌ఫుల్ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ తమ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్మిస్తున్న చిత్రం 'దేత్తడి'. ఈ ప్రాజెక్ట్ తో దర్శకుడిగా ఆదిత్య రావు గంగసాని పరిచయం అవుతున్నారు. హైదరాబాద్ కల్చర్ బ్యాక్‌డ్రాప్‌లో కొత్త స్టోరీని ప్రజెంట్ చేస్తున్నారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. తాజాగా మేకర్స్ గ్లింప్స్ లాంచ్ చేశారు. ఈ గ్లింప్స్ హైదరాబాద్, సికింద్రాబాద్‌లోని పండుగలు, వేడుకలకు ఉత్సాహాన్ని నింపే పాపులర్ డ్రమ్మర్ ఘున్ను భాయ్ వరల్డ్ ని అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ఘున్ను భాయ్, అతని టీం దాదాపు ఏడు కిలోల డ్రమ్ములను మోస్తూ, గంటల తరబడి విరామం లేకుండా ప్రదర్శన ఇస్తూ ప్రశంసలు అందుకున్నారు. ఆ సంగీతం వెనుకకనిపించే ఆత్మగౌరవం, హుందాతనం ఉన్నాయి. ఈ గ్లింప్స్ ఆ విషయాన్ని ఎంతో సున్నితంగా, శక్తివంతంగా ప్రజెంట్ చేసింది. ఆశిష్ నటన అద్భుతంగా వుంది. అతని రఫ్ మేకోవర్ ఆ పాత్రకు చక్కగా సరిపోయింది. ఆ పాత్రలో ఎంత సహజంగా జీవించారు. అతని హావభావాలు, నేచురల్ ప్రజెన్స్, డ్రింక్ చేసే విధానం, అలవోకగా పలికే హైదరాబాద్ యాస ఈ పాత్రకు బలమైన మాస్ ఫ్లేవర్‌ను జోడించాయి.

# అదిరిపోయే జానపదం..

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

భారీ స్థాయి సినిమాలతో అలరించే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, ఇప్పుడు ఆంధ్రప్రదేశ్‌కి చెందిన లెజెండరీ జానపద గాయని గరివిడి లక్ష్మి కథని ప్రేక్షకులు ముందుకు తీసుకొస్తుంది. గరివిడి లక్ష్మి పాత్రలో ఆనంది మెరుస్తోంది. గౌరి నాయుడు జమ్ము ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. బుర్రకథలు చెప్పడమే కాదు, ఓ ఉద్యమంగా మార్చిన లక్ష్మి జీవితాన్ని ఈ సినిమా ఆవిష్కరించనుంది. టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మిస్తున్న 'గరివిడి లక్ష్మి' ఓ పాటతో వేలాది హృదయాల్లో నిలిచిపోయిన లెజెండరీ జానపద గాయని జీవితాన్ని రిక్రియేట్ చేస్తోంది. ఇప్పటికే విడుదలైన ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ కి మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా అద్భుతమైన జానపదం కోసింది కొయగూర సాంగ్ ని రిలీజ్ చేశారు మేకర్స్. చరణ్ అర్జున్ ఈ జానపదాన్ని రాఎనర్జీ వుండే డ్యాన్స్ నెంబర్ గా కంపోజ్ చేశారు. అనన్య భట్, షకలక శంకర్, గౌరీ నాయుడు జమ్ము వోకల్స్ మరింత వైబ్ ని యాడ్ చేశాయి. ఉత్తరాంధ్ర జనపదం మూలం నుంచి స్వరపరిచిన ఈ పాటకు గంటేడ గౌరు నాయుడు, గౌరీ నాయుడు జమ్ము రాసిన అదనపు సాహిత్యం మరింత ఆకర్షణ తీసుకొచ్చింది. ఈ సాంగ్ లో ఆనంది పెర్ఫార్మెన్స్ అదిరిపోయింది. రాగ్ మయూర్ ప్రజెన్స్ డ్యాన్స్ మూమెంట్స్ మరింత జోష్ ని తీసుకొచ్చింది. ఈ పాటకు సోషల్ మీడియాలో అద్భుతమైన రెస్పాన్స్ వస్తోంది. ఈ చిత్రంలో నరేష్, రాశి, శరణ్య ప్రదీప్, అంకిత్ కొయ్య, మీసాల లక్ష్మణ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# రాకాస ఫాంటసీ అడ్వెంచర్

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

జీ స్టూడియోస్ సమర్పణలో నిహారిక కొణిదెల తన పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ బ్యానర్‌పై ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి 'రాకాస' చిత్రాన్ని నిర్మించారు. మానస శర్మ తెరకెక్కించిన ఈ చిత్రంలో సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన గ్లింప్స్, టీజర్, పాటలు, ప్రమోషనల్ కంటెంట్ అంతా కూడా అందరినీ ఆకట్టుకుంది. ఇక తాజాగా ఈ చిత్ర విశేషాల్ని పంచుకునేందుకు దర్శకురాలు మానస శర్మ మీడియాతో ముచ్చటించారు. ఆమె చెప్పిన సంగతులివే..



దర్శకురాలు మానస శర్మ ఇంటర్వ్యూ...

**మీ నేపథ్యం గురించి చెప్పండి?**

మాది శ్రీకాకుళం. నేను మొదటగా యూట్యూబ్‌లో 'మ్యాడ్ హౌస్' చేశాను. ఆ తరువాత 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'కి క్రియేటర్, రైటర్‌గా పని చేశాను. ఆ తరువాత 'బెంచ్ లైఫ్' సిరీస్‌ని చేశాను. ఇది నాకు నాలుగో ప్రాజెక్ట్. ఫాంటసీ, అడ్వెంచర్‌లతో తీసిన 'రాకాస' చాలా కొత్తగా ఉండబోతుంది.

**'రాకాస'లో ప్రధాన అంశం ఏంటి?**

'రాకాస'ని ఫాంటసీ, అడ్వెంచర్, కామెడీ జానర్లో తీశాం. ఇప్పటికే అందరూ మా టీజర్‌ని చూసి ఉంటారు. త్వరలోనే ట్రైలర్ రానుంది. అప్పుడు మా సినిమా గురించి ఇంకా చాలా క్లియర్‌గా తెలుస్తుంది. కామెడీని ప్రధాన అంశంగా, కొద్దిగా హారర్ ఎలిమెంట్స్ తో పూర్తి ఫాంటసీ, అడ్వెంచర్‌గా ఈ మూవీని తీశాం. 'రాకాస' కథని ముందుగా నెట్ ఫ్లిక్స్ లో సిరీస్ కోసం చెప్పాను. ఆ టైంలోనే ఈ కథను సంగీత్ విన్నారు. ఆయనకి కూడా కథ చాలా నచ్చింది. అలా ఈ ప్రాజెక్ట్ లోకి సంగీత్ వచ్చారు.

**'రాకాస' చిత్రీకరణలో ఎదుర్కొన్న సవాళ్లు ఏంటి?**

వెబ్ సిరీస్‌కి, సినిమాకి ఒకే రకమైన ఛాలెంజ్ ఉంటుంది. మేకింగ్ ఒకేలా ఉంటుంది.. రైటింగ్‌లోనే తేడా ఉంటుంది. షూటింగ్ పరంగా, చిత్రీకరణ సమయంలో ఎలాంటి తేడాలుండవు. ఈ సినిమా అవుట్ పుట్ నిహారికకి నచ్చాలని నేను మరింత బాధ్యతగా పని చేశాను. ఈ కథని పదిహేను నిమిషాలు నెరేట్ చేసిన తరువాత నిహారికకి చాలా కాన్ఫిడెంట్ వచ్చేసి ఓకే చెప్పారు.

**నయన్ సారిక గురించి చెప్పండి?**

నయన్ సారిక మంచి నటి. డైరెక్టర్ ఏం చెబితే అది చేస్తారు. ఆల్రెడీ నేను ఇది వరకే ఆమెతో పని చేసి ఉన్నాను. ఆమె టాలెంట్, యాక్టింగ్ చూసే ఈ చిత్రంలోకి తీసుకున్నాం. ఆమె పాత్రని ప్రేక్షకులంతా ఇష్టపడతారు.

**బడ్జెట్ పెరిగిందని అంటున్నారు? దాని గురించి చెప్పండి?**

ముందు నుంచీ మేం బడ్జెట్‌లోనే సినిమా తీయాలని అనుకున్నాం. అయితే ఏ మూవీకి అయినా సరే కొంచెం అటూ ఇటూగానే అవుతుంది. కానీ టీం అంతా ముందే అనుకుని ఉండటంతో చాలా వరకు లిమిట్‌లోనే ఉన్నాం.

**'రాకాస'లో కొత్తగా ఏం ఉండబోతోంది?**

'రాకాస' థియేట్రికల్‌గా ఎక్స్ పీరియెన్స్ చేయాల్సిన చిత్రం. కథ పూర్తిగా ఫిక్షన్. అన్ని పాత్రలు అందరినీ ఆకట్టుకుంటాయి. ఓ అందమైన చందమామ కథలా ఉంటుంది. విజువల్‌గా, సౌండింగ్ పరంగా ఈ మూవీ అందరినీ ఆకట్టుకుంటుంది.

**వీఎఫ్ఎక్స్ పనుల వల్ల సినిమా ఆలస్యం కాలేదా?**

'రాకాస' సెకండాఫ్‌లో ఎక్కువగా వీఎఫ్ఎక్స్ ఉంటుంది. అందుకే మేం ముందుగా సెకండాఫ్ షూట్ చేశాం. ఒక పక్క వీఎఫ్ఎక్స్ వర్క్స్ జరుగుతూ ఉంటే.. ఫస్ట్ హాఫ్‌ని షూట్ చేశాం. అలా మాకు టైం కలిసి వచ్చింది.

**అనుదీప్ మ్యూజిక్ గురించి చెప్పండి?**

నిహారిక అనుదీప్ ని సజెస్ట్ చేశారు. అనుదీప్ మాకు అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ఇప్పటికే టీజర్‌కు ఆయన ఇచ్చిన ఆర్ఆర్‌కి మంచి రెస్పాన్స్ వచ్చింది. ఆయన ఈ చిత్రానికి ప్రధాన బలం.

**నిర్మాత నిహారిక గురించి చెప్పండి?**

నిహారిక గారితో నాకు మంచి అనుబంధం ఉంది. పింక్ ఎలిఫెంట్‌లో ప్రాజెక్టులు ఎప్పుడూ ఆలస్యం అవ్వవు. అన్నీ కూడా చాలా ఫాస్ట్ గా జరిగిపోతోంటాయి. 'ఒక చిన్న ఫ్యామిలీ స్టోరీ'ని తొమ్మిది నెలల్లో పూర్తి చేశాం. 'కమిటీ కుర్రోళ్లు' ఏడాదిన్నరలో రిలీజ్ అయింది. నిహారిక గారు మంచి నిర్మాత. ఆమె అన్నింటినీ బ్యాలెన్స్ చేస్తారు.

**ఫ్యూచర్ ప్రాజెక్ట్‌ల గురించి చెప్పండి?**

ప్రస్తుతం కొన్ని కథలు, ఐడియాలు ఉన్నాయి. ఏ ప్రాజెక్ట్ చేసినా కూడా అందులో కామెడీ ప్రధానంగా, ఎంటర్టైన్మెంట్ ఉండేలా చూసుకుంటాను. 'రాకాస' తరువాత వాటి గురించి చెబుతాను.

**- ఎం.డి. అబ్దుల్**



# ఆమె స్ట్రెంత్.. అతడి ప్రామిస్!

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

జాంబి, ఓ సాతియా వంటి వైవిధ్యభరితమైన చిత్రాలతో టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో ఆర్యన్ గౌర. విభిన్న కథాంశాలను ఎంచుకుంటూ ప్రేక్షకులను అలరిస్తున్న ఆయన, ఇప్పుడు తన హ్యాట్రిక్ మూవీతో పలకరించడానికి రెడీ అవుతున్నారు. లక్ష్మీ నరసింహ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై జ్యోతి కుమారి, తారకేశ్వర రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ సినిమా ప్రీ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. సూర్యాస్తమయం వేళ ఓ మహిళ వీల్ చైర్‌లో కూర్చుని ఉండగా, ఒక వైపు హీరో, మరో వైపు పెంపుడు కుక్కపిల్ల కూర్చున్న దృశ్యం ఎంతో హార్ట్ టచింగ్‌గా ఉంది. 'ఆమె స్ట్రెంత్, అతడి ప్రామిస్.. వారి కథ' అనే ట్యాగ్‌లైన్ ఈ సినిమా ఒక బలమైన భావోద్వేగపూరితమైన ప్రయాణం అని సూచిస్తోంది. ముఖ్యంగా ఇది ఒక నిజ జీవిత కథ ఆధారంగా రూపొందుతుండటం గమనార్హం. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడి కానున్నాయి.

**ఫిల్మ్ డెస్క్ (ఏడీఎన్ఎన్):**

అందం, అభినయం కలగలిసిన అస్సాం సుందరి కయాదు లోహర్ ప్రస్తుతం టాలీవుడ్‌లో వరుస అవకాశాలతో దూసుకుపోతోంది. వెండితెరపై గ్లామర్‌తో కుర్రకారును ఉర్రూతలూగించడమే కాదు, నటనకు ఆస్కారమున్న పాత్రల్లోనూ మెప్పించగలనని నిరూపించుకున్న ఈ భామకు ఇప్పుడు అదృష్టం గట్టిగా తలుపు తట్టింది. కెరీర్ ఆరంభంలో కొన్ని ఒడిదుడుకులు ఎదుర్కొన్నప్పటికీ ప్రస్తుతం టాలీవుడ్ టాప్ హీరోల సినిమాల్లో అవకాశాలు కొట్టేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. సక్సెస్ రేటుకు మారుపేరుగా నిలిచిన దర్శకుడు అనిల్ రావిపూడి ప్రస్తుతం విక్టరీ వెంకటేష్, నందమూరి కల్యాణ్ రామ్‌లతో ఒక భారీ మల్టీస్టారర్ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమాలో వెంకీ సరసన కీర్తి సురేశ్ నటిస్తుండగా, కల్యాణ్ రామ్ జోడీగా కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు సమాచారం. అపజయం ఎరుగని అనిల్ రావిపూడి సినిమాలో అవకాశం దక్కించుకోవడం అంటే ఈ ముద్దుగుమ్మ కెరీర్ మలుపు తిరిగినట్లేనని సినీ వర్గాలు భావిస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు క్రియేట్ చేసే అనిల్ రావిపూడి సినిమాలో కయాదు తన మార్కు చూపిస్తే, ఇక ఆమె వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం ఉండదు. ఇటీవల విశ్వక్ సేన్‌కి జోడీగా 'ఫంకీ' మూవీతో ప్రేక్షకుల్ని పలకరించింది కయాదు లోహర్. అయితే ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలైంది. సినిమా ఫలితం ఎలా ఉన్నా ఆమె అందానికి మాత్రం ప్రేక్షకులు ఫిదా అయిపోయారు. ప్రస్తుతం ఆమె నాని, శ్రీకాంత్ ఓదెల కాంబోలో తెరకెక్కుతోన్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ది ప్యారడైజ్'లో నటిస్తోంది. ఈ సినిమా సెట్స్ మీద ఉండగానే తాజాగా కయాదు మరో బంపరాఫర్ పట్టేయడం టాలీవుడ్‌లో చర్చనీయాంశంగా మారింది.



# 'ఫంకీ' బ్యూటీకి బంపర్ ఆఫర్!

Printed and Published By **SHAIK MASTAN** on behalf of **AARAA DIGITAL NEWS NETWORKS**, Printed at YADU GRAPHICS, Ground Floor 3-2-798, STO Bhavan, Chappal Bazar, Kachiguda, Hyderabad, Telangana-500 027
Published at Plot No. 72, Kamalapuri Colony, Phase III, Road No.2, Banjarahills, Hyderabad, Telangana - 500 073. Editor: **SHAIK MASTAN**, Phone No. 040 - 24099999, **PRGI REG. No. : TGTEL/25/A0540**